www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

చెట్లకు బంగారం కాస్తోంది


ఫిన్లాండ్‌లోని స్ప్రూస్ చెట్లకు పుత్తడి కాత

ఆకుల కొసల్లో బంగారు రేణువులు 2

నేలలోని బంగారాన్ని వేర్ల ద్వారా పీల్చుకొని

సూక్ష్మరేణువులుగా మారుస్తున్న వైనం

ఫిన్లాండ్ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి



బుధవారం | 22-10-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 186 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి రా.8:17 తదుపరి విదియ, నక్షత్రం: స్వాతి రా.1:52 తదుపరి విశాఖ, వర్జ్యం: శేషం ఉ. 7.02, దుర్ముహూర్తం: ఉ.11:36-12:22, అమృతఘడియలు: సా.4:00-5:48, రాహుకాలం: ఉ.12:00-1:30, సూర్యోదయం: 6:13, సూర్యాస్తమయం: 5:45 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





అమరవీరుల స్థూపం వద్ద సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత, డీజీపీ హరీశ్ గుప్తా, సీఎస్ విజయానంద్ సెల్యూట్

శాంతిభద్రతలపై రాజీ లేదు

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగండి

పోలీసులకు ముఖ్యమంత్రి పిలుపు.. అసాంఘిక శక్తులను ఏరి పారేయండి

'సోషల్' సైకోలపై ఉక్కుపాదం!.. రాజకీయ ముసుగులో చిచ్చురేపేవారిని వదలొద్దు

వారు క్రిమినల్స్ కన్నా ప్రమాదకరం.. వ్యక్తిగత గొడవలకు కులం రంగు

ఆర్థిక నేరాలకు మతం రంగు.. ఫేక్ ప్రచారాలతో అలజడులకు కుట్ర

అటువంటి వారిని జైల్లో పడేయాలి.. మీకు పూర్తి అధికారాలు ఇస్తున్నా

పోలీసుల త్యాగాలతోనే ప్రశాంతత.. ప్రజల భద్రత మీది.. మీ సంక్షేమం ప్రభుత్వానిది

పోలీసు అమరవీరుల సంస్మరణలో సీఎం చంద్రబాబు

అమరావతి/మంగళగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'శాంతిభద్రతలపై రాజీ పడొద్దు.. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగండి.. అసాంఘిక శక్తులను ఏరి పారేయండి.. మీకు పూర్తి అధికారాలు ఇస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పండగలు, పబ్బాల్లో కుటుంబాలను వదిలి సమాజ శ్రేయస్సు కోసం రాత్రింబవళ్లు పనిచేస్తూ ప్రాణాలు సైతం అర్పిస్తున్న పోలీసుల త్యాగాలు, బలిదానాల వల్లే సమాజం ప్రశాంతంగా ఉంటోందన్నారు. పోలీసు అమరవీరుల

మిగతా 11వ పేజీలో...

లక్ష్మయ్య నాయుడు హత్య కేసు విచారణకు ప్రత్యేక కోర్టు

నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తాం: సీఎం చంద్రబాబు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించనని స్పష్టీకరణ

మృతుడి భార్య, పిల్లలకు భూమి, ఆర్థిక సాయం ప్రకటన

గాయపడ్డ నవీన్, భార్గవ్‌కు సాయంతో పాటు వైద్య ఖర్చులు

చెల్లించేస్తాం

డీఏ బకాయిలపై ప్రభుత్వం స్పష్టత



సవరణ జీవోపై ఉద్యోగ సంఘాల హర్షం

వచ్చే ఏప్రిల్‌లో పది శాతం జమ

మిగిలిన 90 శాతం మూడు విడతల్లో జీపీఎఫ్, ప్రాన్ ఖాతాల్లో జమ చేస్తాం

ఉద్యోగుల అభ్యంతరాలపై స్పందన

ఆర్థిక శాఖ అధికారులతో సీఎం భేటీ

సీఎం ఆదేశాలతో సవరణ జీవో జారీ

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు 'దీపావళి' కానుకగా ప్రకటించిన డీఏ చెల్లింపులో నెలకొన్న గందరగోళాన్ని ప్రభుత్వం తొలగించింది. ఉద్యోగుల నుంచి వ్యక్తమైన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని... అప్పటికప్పుడు పొరపాటును సవరించింది. తప్పులు దిద్దుకునే విషయంలో ఎలాంటి భేషజాలు ప్రదర్శించబోమని స్పష్టమైన సంకేతాలు పంపింది. ఉద్యోగులకు ఒక డీఏ ప్రకటిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. అయితే... దీనికి సంబంధించి సోమవారం జారీ అయిన జీవోల్లో అధికారుల స్థాయిలో అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నారు. 2024 జనవరి నుంచి చెల్లించాల్సిన 3.64 శాతం డీఏ బకాయిలను... రిటైర్మెంట్ సమయంలో

మిగతా 12వ పేజీలో...

గురివింద జగన్



12

ఒక్క డీఏను కూడా సరిగ్గా ఇవ్వని ఘనుడు

ప్రభుత్వం ప్రకటించిన డీఏపై మాత్రం విమర్శలు

ఒక్క డీఏతో ఎలా బతుకుతారంటూ మొసలి కన్నీరు

ఐదేళ్లపాటు నాడు రాష్ట్ర ఉద్యోగులతో చెడుగుడు

ఐఆర్ కంటే ఫిట్‌మెంట్ తక్కువగా ఇచ్చిన ఏకైక సీఎం

డబ్బులివ్వలేక రిటైర్మెంట్ వయసునే పెంచిన వైనం

సీపీఎస్, జీపీఎఫ్ సొమ్మునూ దారిమళ్లించిన దుర్మార్గం

రూ.25 వేల కోట్ల బకాయి ఉన్నట్టు నాటి ఆర్థికశాఖ లెక్క

రూ.31 వేల కోట్లకుపైగా ఎగ్గొట్టారని ఉద్యోగుల ఫిర్యాదు



సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి లోకేశ్

ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం!

ప్రపంచవ్యాప్త నెట్ వర్కింగ్‌కు సహకరించండి

ఆధునిక పరిజ్ఞానాన్ని అందించండి.. ఆస్ట్రేలియా 'సీఫుడ్' ప్రతినిధులకు లోకేశ్ వినతి

వివిధ కంపెనీలతో వరుస భేటీలు.. విశాఖ పెట్టుబడిదారుల సదస్సుకు ఆహ్వానం

సత్వర అనుమతులు, ప్రోత్సాహకాలు.. హెచ్ఎస్‌బీసీ సీఈవో బృందంతో భేటీలో లోకేశ్

న్యూసౌత్‌వేల్స్, వెస్ట్రన్ సిడ్నీ వర్సిటీల సందర్శన.. స్మార్ట్ ఫార్మింగ్, నైపుణ్యాభివృద్ధికి సహకరించాలని వినతి.. పారమట్టా మేయర్, న్యూసౌత్‌వేల్స్ ప్రీమియర్‌తో భేటీ

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ 'ఆక్వా' పరిశ్రమతో ఆస్ట్రేలియా బంధం బలపడాలని మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. ఏపీలో సముద్ర ఆహార పరిశ్రమల నెట్‌వర్కింగ్‌కు సహకరించాలని సీ ఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా (ఎస్ఐఏ) ప్రతినిధులను కోరారు. 'బ్రాండ్ ఏపీ'కి ప్రాచుర్యం కల్పించేందుకు ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న లోకేశ్... సోమవారం, మంగళవారం బిజీబిజీగా గడిపారు. విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు హాజరు కావాలని ఆయా సంస్థల ప్రతినిధులను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను వివరిస్తూ... సంబంధిత రంగాల్లో ఏపీతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మంగళవారం పారమట్టాలో ఎస్ఐఏ సీఈవో వెరోనికా పాపకోస్టా, ఎంగేజ్‌మెంట్ మేనేజర్ జాస్మిన్ కెల్లేల, ఇతర ప్రతినిధులతో

మిగతా 11వ పేజీలో...

నేడు దుబాయ్‌కి చంద్రబాబు

మూడు రోజుల యూఏఈ పర్యటనకు సీఎం బృందం

విశాఖ సదస్సుకు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

దుబాయ్, అబుధాబిల్లో 25 సమావేశాలు.. 11

దుబాయ్‌లో రోడ్‌షోలో పాల్గొననున్న చంద్రబాబు

చివరిరోజు తెలుగు ప్రవాసీలతో సమావేశం



10

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా

ఈశ్వరయ్య

ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర సమితి

జాతీయ కార్యదర్శిగా రామకృష్ణ ఎన్నిక

శ్రీవారి దర్శనాల పేరిట 3

వసూళ్ల దందా

దళారీ ఖాతాలో ఏడాదిలో రూ.కోటి లావాదేవీలు.. అరెస్టు



తిరుమలలో జోరువాన

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

నేడు వాయుగుండంగా మారే అవకాశం

తీవ్ర వాయుగుండం, తుఫాన్‌గానూ మారే చాన్స్

24, 25 తేదీల్లో మరో అల్పపీడనం 10

వారం రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు

రైతులకు రబీ షాక్!

చైనా ఎగుమతుల నిలిపివేతతో పెరగనున్న ఎరువుల ధరలు

యూరియా, డీఏపీ ఎరువుల్లో 95 శాతం చైనా నుంచే.. 2



వంద జిల్లాల్లో స్వేచ్ఛావాయువులు!

మావోయిస్టు ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తున్నాం

పదేళ్ల కిందట 125 జిల్లాల్లో.. ప్రస్తుతం 11 జిల్లాలకే పరిమితం: ప్రధాని మోదీ

పణజీ, అక్టోబరు 21: దేశంలో నక్సల్-మావోయిస్టు ఉగ్రవాదం నిర్మూలనలో తుది అంకంలో ఉన్నామని ప్రధాని మోదీ అన్నారు. భద్రతాదళాలు 90 శాతం వరకు విజయం సాధించాయని.. వందకుపైగా జిల్లాలకు దీని నుంచి విముక్తి కల్పించాయని చెప్పారు. ఆయా జిల్లాల ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తూ దీపావళి జరుపుకొంటున్నారని అన్నారు. సదరు ఉగ్రవాదం ప్రస్తుతం 11 జిల్లాలకే పరిమితమైందని తెలిపారు. దీపావళిని పురస్కరించుకుని ఆయన గోవా తీరంలో విమాన వాహక నౌక

మిగతా 2వ పేజీలో...

మల్లోజుల, ఆశన్నలకు వై క్యాటగిరి భద్రత?

కొత్త 'అభయ్'.. తిప్పిరి తిరుపతి?

ఆపరేషన్ కగార్ యుద్ధాన్ని నిరసిస్తూ 24న దేశవ్యాప్త బంద్.. మావోయిస్టు పార్టీ పిలుపు

అమెరికా వెళ్లే విద్యార్థులకు

ఉపశమనం

ఎఫ్-1 నుంచి హెచ్-1బీకి మారితే లక్ష డాలర్లు కట్టనక్కర్లేదు

తాజా మార్గదర్శకాల్లో స్పష్టత ఇచ్చిన అమెరికా ఇమిగ్రేషన్ విభాగం

ఇప్పటికే అక్కడ ఉన్నవారికే సౌలభ్యం

జే-1, ఎల్-1 వారికీ మినహాయింపు

ఇప్పటికే హెచ్-1బీ వీసా ఉండి కంపెనీ మారే వారికీ వర్తించదు



కొత్తగా వెళ్లేవారికి, పాత వీసాల గడువు ముగిసినవారికి మాత్రమే లక్ష డాలర్ల ఫీజు

ఉల్లంఘనలు ఉంటే లక్ష డాలర్లు కట్టక తప్పదని హెచ్చరిస్తున్న నిపుణులు

వాషింగ్టన్, అక్టోబరు 21: అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరుతో అమెరికా ఉద్యోగ కలలు కల్లలవుతున్నాయన్న నిరాశలో కూరుకుపోయిన భారత విద్యార్థులకు భారీ ఉపశమనం లభించింది. అమెరికాలో చదువుకునే విద్యార్థులు, ఇప్పటికే వివిధ ఉద్యోగాలు చేస్తున్నవారు హెచ్-1బీ వీసా కోసం లక్ష డాలర్లు కట్టాల్సిన అవసరం లేదని ఆ దేశ పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) స్పష్టం చేసింది. ఇప్పటికే ఎఫ్-1, జే-1, ఎల్-1 తదితర వీసాలతో అమెరికాతో

మిగతా 2వ పేజీలో...

అమెరికా చదువుపై అనాసక్తే!

హెచ్-1బీ నిబంధనల సమస్య తేలినా భారతీయ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తగ్గని ఆందోళన.. కన్సల్టెన్సీల వెల్లడి



భీమవరం డీఎస్పీపై పవన్ సీరియస్!

పేకాట, జూదాలకు జయసూర్య ప్రోత్సాహం

పశ్చిమ ఎస్పీతో ఫోన్లో మాట్లాడిన డిప్యూటీ సీఎం

తర్వాత డీజీపీతోనూ.. నివేదిక ఇవ్వాలని సూచన

తనకు అందిన ఫిర్యాదులు హోం మంత్రికి

విచారణకు ప్రభుత్వ ఆదేశాలు?

నివేదిక రాగానే జయసూర్యపై చర్యలు!

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో పేకాట నిర్వహణకు పోలీసులు సహకరిస్తున్నారన్న ఫిర్యాదులపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. స్థానిక డీఎస్పీ జయసూర్య ఒక వర్గానికి కొమ్ము కాస్తూ చట్టవిరుద్ధమైన పేకాట, జూదం నిర్వాహకులకు వంత పాడుతున్నారని వరుస ఫిర్యాదులు అందడంతో జిల్లా ఎస్పీ నయీంతో ఆయన మంగళవారం ఫోన్లో మాట్లాడారు. పేకాట విషయంలో ఎందుకు గట్టిగా వ్యవహరించలేకపోతున్నారని ఆరా తీశారు. అనంతరం డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో కూడా డిప్యూటీ సీఎం ఫోన్లో మాట్లాడారు. పేకాట, డీఎస్పీ

మిగతా 10వ పేజీలో...



టీచర్లకూ టెట్!

ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్నవారు ఈ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాల్సిందే

సుప్రీంకోర్టు తీర్పు అమలుకు చర్యలు

త్వరలో నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) విషయంలో పాఠశాల విద్యాశాఖ కీలక ప్రతిపాదన చేసింది. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలనుకునేవారితో పాటు టెట్ అర్హత లేని ఇన్ సర్వీస్ టీచర్లు కూడా ఈ పరీక్ష రాయాల్సి ఉంటుంది. నిరుద్యోగులు, టీచర్లు ఇద్దరూ టెట్ రాసేందుకు వీలుగా త్వరలో నోటిఫికేషన్ జారీ చేయడానికి కసరత్తు చేస్తోంది. టీచర్లంతా తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని కొద్ది నెలల కిందట సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ మేరకు చర్యలు

మిగతా 12వ పేజీలో...



12

ఇంటర్ పాస్ మార్కులు మారాయ్!

గణితం 35.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ 29

కొత్త విధానంపై కాలేజీలకు విద్యామండలి సమాచారం

గణితంలో ఇక నుంచి ఒక్కటే పేపర్

ఎలక్టివ్ సబ్జెక్టు ఆధారంగా మారనున్న మార్కులు

వివాదాస్పదులపై వేటు

విశాఖ డీఆర్వో, ఆర్డీవోపై చర్యలు 3

జీఏడీకి అటాచ్ చేస్తూ దీపావళి రోజు ఉత్తర్వులు

ఆర్డీవో శ్రీలేఖ కొంపముంచిన ఒంటెద్దు పోకడలు

సర్వీస్ ఫైల్ తొక్కిపెట్టారని డీఆర్వోపై వ్యతిరేకత

కలెక్టర్, జేసీ కాల్స్, మెసేజీలకు స్పందించని వైనం

ప్రతి సోమవారం జరిగే ప్రజా స్పందనకూ గైర్హాజరు

పత్రికల్లో కథనాలతో తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం

జపాన్ తొలి మహిళా ప్రధానిగా తకైచి



టోక్యో, అక్టోబరు 21: జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా అధికార పార్టీ ఎల్‌డీపీ నేత సనే తకైచి ఎన్నికయ్యారు. మంగళవారం పార్లమెంట్ దిగువసభలో జరిగిన ఓటింగ్‌లో ఆమె చారిత్రక విజయం సాధించారు. 465 మంది సభ్యులు గల సభలో తకైచి మెజార్టీ మార్కును దాటి 237 ఓట్లు సాధించారు. తకైచి ఎన్నికను ఎగువసభ కూడా ఆమోదించనుంది. తర్వాత జపాన్ రాజుతో సమావేశమైన అనంతరం.. ఆమె దేశ 104వ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవలి వరకు ప్రధానిగా కొనసాగిన షిగెరు ఇషిబా పలు ఎన్నికల్లో భారీ ఓటముల నేపథ్యంలో గతనెల తన పదవికి రాజీనామా చేశారు. రాజకీయాల్లో మహిళా ప్రాతినిధ్యంలో అట్టడుగు స్థానంలో ఉన్న దేశానికి 64 ఏళ్ల సానే తకైచి మొట్టమొదటి మహిళా ప్రధానిగా ఎన్నిక కావడం ఒక చారిత్రక విజయంగా చెప్పవచ్చు. తకైచి దేశ తొలి ఆర్థిక మహిళా మంత్రిగా సత్సుకి కటయామాను నియమించుకొనే అవకాశం ఉందని స్థానిక మీడియా పేర్కొంది.

కర్ణాటక సీఎంతో కిరణ్ మజుందార్ భేటీ

» బెంగళూరు అభివృద్ధికి సహకరిస్తామని హామీ



బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో గుంతల రహదారులు, చెత్త సమస్యపై 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు చేసిన బయోకాన్ కంపెనీ సీఎండీ కిరణ్ మజుందార్ షా.. మంగళవారం కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో భేటీ అయ్యారు. సీఎం అధికారిక నివాసం కావేరికి వెళ్లిన ఆమె సిద్దరామయ్యకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. నగర సమస్యలపై చర్చించారు. అనంతరం ఆమె సదాశివనగర్‌లోని డీసీఎం డీకే శివకుమార్ నివాసానికి వెళ్లి, ఆయనతో భేటీ అయ్యారు. బెంగళూరు అభివృద్ధికి సహకరిస్తామని ఆమె హామీ ఇచ్చారని డీకే శివకుమార్ విలేకరులకు చెప్పారు. నగర సమస్యలపైనా ఆమె తన అభిప్రాయాలు తెలిపారని 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా, కిరణ్ మజుందార్ గుజరాత్‌కు చెందినవారని, అందుకే బెంగళూరుపై విమర్శలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఆమె స్పందించారు. 'నేను ఈ గడ్డపై పుట్టిన ఆడ బిడ్డను. బెంగళూరులోనే పుట్టాను. నా నగరంలో ఉండటం నాకు గర్వకారణం' అని ట్వీట్ చేశారు.

బిహార్‌లో మహాకూటమిలో చీలిక!

పట్నా, అక్టోబరు 21: బిహార్ మహాకూటమిలో విభేదాలు నెలకొన్నట్లు కనిపిస్తోంది. పలు నియోజకవర్గాల్లో ఆ కూటమిలోని రెండేసి పార్టీలు అభ్యర్థులను నెలబట్టడమే ఈ అభిప్రాయానికి కారణం. ఆర్జేడీ, కాంగ్రెస్ ఆరు సీట్లలో ముఖాముఖి తలపడుతుండగా.. సీపీఐ, కాంగ్రెస్ నాలుగు సీట్లలో పోటీ పడుతున్నాయి. ముకేశ్ సహాని వికాస్ శీల్ ఇన్‌సాన్ పార్టీ, ఆర్జేడీ రెండు సీట్లలో తలపడుతున్నాయి. సోమవారం ఆర్జేడీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాతో(143 సీట్లకు) ఈ విషయం స్పష్టమైంది. ఈ జాబితాలో కాంగ్రెస్ పోటీ చేస్తోన్న ఆరు సీట్లకు కూడా అభ్యర్థులను ప్రకటించారు. ఈ స్నేహపూర్వక పోటీల వల్ల ప్రతిపక్షాల ఓట్లు చీలిపోయి ఎన్డీయే లబ్ధి పొందుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

త్వరగా పెళ్లి చేసుకుని స్వీట్లకు ఆర్డర్ ఇవ్వండి..

» రాహుల్ గాంధీకి స్వీట్ షాప్ యజమాని సూచన



న్యూఢిల్లీ, అక్టోబరు 21: "రాహుల్ జీ మీరు దేశంలోనే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్. త్వరగా పెళ్లి చేసుకోండి.. మీ వివాహానికి కావాల్సిన స్వీట్ల ఆర్డర్ల కోసం మేం ఎంతగానో ఎదురు చూస్తున్నాం". ఇది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పాత ఢిల్లీలో ఎదురైన ఓ ఆసక్తికర అనుభవం. దీపావళి సందర్భంగా సుప్రసిద్ధ ఘంటేవాలా మిఠాయి దుకాణంలో సందడి చేసిన రాహుల్‌కు, ఆ షాపు యజమాని సుశాంత్ జైన్ నుంచి ఈ సరదా విజ్ఞప్తి ఎదురైంది. పండగ సందర్భంగా స్వీట్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన రాహుల్‌ను, సుశాంత్ జైన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మిఠాయిలు తయారు చేయడంలో స్వయంగా చేతులు కలిపారు. తన తండ్రి రాజీవ్ గాంధీకి ఇష్టమైన 'ఇమర్తి'తో పాటు తనకు ఎంతో ఇష్టమైన 'బేసన్ లడ్డూ'లను తయారు చేసి వాటి రుచిని ఆస్వాదించారు.

పెరగనున్న ఎరువుల ధరలు

» చైనా ఎగుమతి నిలిపివేతతో ఇబ్బందులు

న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఇటీవల యూరియా దొరకక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మరో షాక్ తగలనుంది. రబీ సీజన్ ప్రారంభానికి ముందే దేశంలో ఎరువుల ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. యూరియాతో పాటు కొన్ని రకాల ఎరువుల ఎగుమతులను ఈ నెల 15 నుంచే చైనా నిలిపివేసింది. ఈ నిర్ణయం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నిలిపివేత 5 నుంచి 6 నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మనం ఉపయోగించే మోనోఅమ్మోనియం ఫాస్పేట్ (టీఎమ్‌ఏపీ), అడ్‌బ్లూతో పాటు యూరియా, డీఏపీ వంటి ఎరువులను దాదాపు 95 శాతం చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు చైనా ఆంక్షలతో వీటి ధరలు మరో 10-15 శాతం పెరిగే అవకాశం ఉంది. అయితే వ్యాపారులు ఇప్పటికే కొంత మేర ఎరువులను నిల్వచేయడంతో రబీ అవసరాలు తీరుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

చెట్లకు బంగారం కాస్తోంది

» ఫిన్లాండ్‌లోని స్ప్రూస్ చెట్లకు పుత్తడి కాత



న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఇంట్లో పిల్లలో.. పెద్దలో అలవికాని కోరికల చిట్టా విప్పితే 'డబ్బు ఏమైనా చెట్లకు కాస్తుందనుకుంటున్నారా?' అని ఇంటిపెద్దగా రుసరుసలాడుతుంటాం! మరి.. ఈ నానుడి నిజమైతే ఎలా ఉంటుంది? ఔను.. చెట్లకు డబ్బులు కాసేరోజులొచ్చేశాయి. తళతళలాడే కరెన్సీ నోట్ల రూపంలో కాదు గానీ ధగధగ మెరిసే అచ్చమైన బంగారం రూపంలో! బంగారం కాసే ఆ చెట్టు పేరు 'నార్వే స్ప్రూస్'! ఈ చెట్లకు దాదాపు బంగారు రంగులో మిలమిల మెరిసే పదునైన సూదుల్లాంటి ఆకులుంటాయి. వీటి కొసకొసల్లో బంగారు రేణువులు ఉత్పత్తవుతున్నాయి. వీటిని బయటకు తీసి ప్రత్యేక పద్ధతిలో ప్రాసెసింగ్ చేస్తే నిగనిగలాడే బంగారం ఉత్పత్తి అవుతుంది. ఉత్తర ఫిన్లాండ్‌లోని కిట్టిలా గోల్డ్‌మైన్ సమీపంలో ఉన్న 23 స్ప్రూస్ చెట్లపై జియాలజికల్ సర్వే ఆఫ్ ఫిన్లాండ్, ఔలు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. 138 రకాల ఆకుల శాంపిళ్ల సేకరించి మైక్రోస్కోప్ ద్వారా పరిశీలించారు. నేల లోపల ఉండే బంగారం.. వేర్లు పీల్చుకునే నీటి ద్వారా చెట్ల ఆకుల్లోకి వస్తోందని.. అక్కడ ఘనరూపంలో అత్యంత సూక్ష్మకణాలుగా మారుతోందని శాస్త్రవేత్తలు తేల్చారు. ఈ ఆకుల్లోని బ్యాక్టీరియా బయోఫిల్మ్ మధ్య నానో సైజ్ గోల్డ్ పార్టికల్స్ ఉన్నట్లు గుర్తించారు. నేలలోంచి బంగారం చెట్ల వేర్ల ద్వారా ఆకుల్లోకి చేరే క్రమంలో ఎండోఫైట్స్ అనే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు ప్రధానపాత్ర పోషిస్తున్నట్లు కనుగొన్నారు. మొక్కల ఆధారిత బంగారం అన్వేషణకు ఈ అధ్యయనం బాగా ఉపకరిస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ స్ప్రూస్ చెట్లు ప్రపంచమంతా విస్తరిస్తే విశ్వమంతా పసిడిమయమే అవుతుంది కదూ!

లోకం తీరు



వంద జిల్లాల్లో స్వేచ్ఛావాయువులు

(మొదటి పేజీ తరువాయి)

ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జవాన్లతో కలిసి పండుగ జరుపుకొన్నారు. భద్రతాదళాల ధైర్యసాహసాలను కొనియాడారు. మావోయిస్టుల ఉగ్రవాదంపై కీలక విజయాలు సాధించాయన్నారు. 2014కి ముందు దాదాపు 125 జిల్లాలు మావోయిస్టుల గుప్పిట్లో ఉండేవి. గత దశాబ్ద కాలంగా కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో 11 జిల్లాలకు తగ్గిపోయింది. వీటిలో కూడా మూడు జిల్లాల్లోనే మావోయిస్టుల ప్రాబల్యం ఉంది. వారి నుంచి విముక్తి పొందిన వందకుపైగా జిల్లాలు తొలిసారి స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నాయి. 'జీఎస్‌టీ బచత్ ఉత్సవ్' కారణంగా ఈ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు ఈ జిల్లాల్లో భారత రాజ్యాంగం పేరెత్తితేనే అణచివేసేవారు. ఇప్పుడక్కడ స్వదేశీ మంత్రం ప్రతిధ్వనిస్తోంది' అని చెప్పారు. దేశంలో అంతర్గతంగా యుద్ధం చేయాలంటే ఎంతో సహనం అవసరమని, అమాయకులెవరూ చనిపోకుండా చూసుకోవలసి ఉంటుందని గుర్తుచేశారు. తమ ప్రాబల్య ప్రాంతాల్లో స్కూళ్లు, రోడ్లు, ఆస్పత్రులను నిర్మించడానికి నక్సల్స్ అనుమతించలేదని.. వాటిని పేల్చేసి డాక్టర్లను కాల్చిచంపారని తెలిపారు. ఇప్పుడవే ప్రాంతాల్లో హైవేలు నిర్మిస్తున్నామని.. స్కూళ్లు, ఆస్పత్రులు పిల్లలకు నూతన భవిష్యత్‌ను ఇస్తున్నాయని చెప్పారు. భద్రతాదళాల త్యాగాలు, ధైర్యసాహసాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ పోరులో అవయవాలు కోల్పోయి వీల్‌చైర్లకే పరిమితమైనా పోలీసు జవాన్లు పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినం సందర్భంగానూ.. ప్రాణత్యాగాలు చేసిన పోలీసులకు మోదీ నివాళులు అర్పించారు.

'ఆత్మనిర్భర భారత్'కు విక్రాంత్ నిదర్శనం

స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్.. 'ఆత్మనిర్భర భారత్'కు తిరుగులేని నిదర్శనమని ప్రధాని తెలిపారు. దీనిని కదులుతున్న నగరంగా అభివర్ణించారు. 'త్రివిధ దళాల మధ్య అద్భుత సమన్వయం.. మన నౌకాదళం చూపించిన భయం.. వైమానిక దళ అసాధారణ నైపుణ్యం, సైన్యం సాహసం.. కలగలిపి 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి తీసుకొచ్చాయన్నారు. 'కొన్నేళ్లుగా భారత దళాలు స్వావలంబనతో అత్యాధునికత సంతరించుకున్నాయి. బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులు తమ సామర్థ్యాలను ఆపరేషన్ సిందూర్‌లో నిరూపించుకున్నాయి. పలు దేశాలు ఇప్పుడీ క్షిపణుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నాయి. గత 11 ఏళ్లలో మన రక్షణ ఉత్పత్తులు మూడు రెట్లు పెరిగాయి. గత ఏడాది ఈ ఉత్పత్తులపై వ్యయం రూ.లక్షన్నర కోట్లకు చేరుకుంది. 2014 నుంచి వివిధ భారత షిప్‌యార్డులు నౌకాదళానికి 40 స్వదేశీ యుద్ధనౌకలు, జలాంతర్గాములను నిర్మించి ఇచ్చాయి. అంటే సగటున ప్రతి 40 రోజులకు ఓ యుద్ధనౌక, జలాంతర్గామి నిర్మించాయన్న మాట. ప్రపంచ అగ్ర రక్షణ ఉత్పత్తిదారుల్లో ఒకరిగా నిలవాలన్నది భారత లక్ష్యం' అని స్పష్టంచేశారు. ప్రధాని ఆదివారం సాయంత్రం ఐఎన్ఎస్ విక్రాంత్‌పైకి వచ్చారు. సోమవారమంతా అక్కడే ఉన్నారు. ఉదయం యోగా సెషన్‌లో పాల్గొన్నారు. యుద్ధనౌకలు, యుద్ధవిమానాల విన్యాసాలను పరిశీలించారు.



దీపావళిని పురస్కరించుకొని ఐఎన్ఎస్ విక్రాంత్‌లో సైనికులకు స్వీట్లు తినిపిస్తున్న ప్రధాని మోదీ

ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి: మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరామచంద్రుడే స్ఫూర్తి అని మోదీ తెలిపారు. దేశ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన బహిరంగ లేఖ రాశారు. ఆపరేష్ సిందూర్, నక్సలిజం, జీఎస్‌టీ సంస్కరణలు తదితర అంశాలను ప్రస్తావించారు. భారత్ తన ధర్మానికి కట్టుబడి ఉండే, అన్యాయంపై ప్రతీకారం తీర్చుకుందని చెప్పారు. ధర్మాన్ని నిలబెట్టాలని శ్రీరాముడు బోధించాడు. అన్యాయంపై పోరాడేందుకు ధైర్యాన్ని ఇచ్చాడు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ధర్మాన్ని నిలబెట్టడమే గాక అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్నాం' అని పేర్కొన్నారు. నక్సల్స్ హింసను వీడి జన జీవన స్రవంతిలోకి వచ్చి భారత రాజ్యాంగాన్ని స్వీకరించడం అతి పెద్ద విజయమన్నారు.

రెడ్ కారిడార్లు.. వృద్ధి కారిడార్లుగా!

» పోలీసు అమరవీరులకు రాజ్‌నాథ్ నివాళి

మావోయిస్టుల ప్రాబల్యంతో 'రెడ్ కారిడార్లు'గా ముద్రపడిన ప్రాంతాలు ఇప్పుడు 'అభివృద్ధి కారిడార్లు'గా మారాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పోలీసు బలగాల అవిశ్రాంత కృషి కారణంగా 'నక్సల్స్ హబ్స్'.. రహదారులు, పాఠశాలలు, కాలేజీలు, ఆస్పత్రులతో 'ఎడ్యుకేషన్ హబ్స్'గా మారాయని చెప్పారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారకం వద్ద నివాళులు అర్పించి ప్రసంగించారు.

కొత్త 'అభయ్' ఎవరు?

» పోలీసు నిఘా వర్గాల ఆరా

» ఆపరేషన్ కగార్ యుద్ధాన్ని నిరసిస్తూ 24న దేశవ్యాప్త బంద్.. మావోయిస్టు పార్టీ పిలుపు

హైదరాబాద్, చర్ల, ములుగు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరుసగా అగ్రనేతల ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు జరుగుతున్నా.. మావోయిస్టు పార్టీ ఎప్పటికప్పుడు ప్రకటనలు విడుదల చేస్తూ తమ వైఖరిని స్పష్టం చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విడుదలవుతున్న పత్రికా ప్రకటనలను ఎవరు రాస్తున్నారనేదానిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ సోనూ.. అభయ్, తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న లొంగిపోయిన నేపథ్యంలో.. వీరిద్దరినీ విప్లవద్రోహులుగా ప్రకటిస్తూ, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పీడిత ప్రజల కోసం సాయుధపోరు కొనసాగుతుందని అభయ్ పేరిట మావోయిస్టు పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలో.. అభయ్‌గా బాధ్యతలు స్వీకరించింది ఏవరన్నదానిపై నిఘావర్గాలు ఆరా తీస్తున్నాయి.

ములుగు జిల్లా పోలీసుల ఎదుట నలుగురు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ శబరీశ్ వివరాలు వెల్లడించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ ద్వారా మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులను హత్య చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిరసనవారాన్ని, 24న దేశవ్యాప్త బంద్ పాటించాలని మావోయిస్టు పార్టీ ప్రజలకు పిలుపునిచ్చింది. కేంద్రకమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఈ నెల 15వ తేదీన విడుదలైన ప్రకటన మంగళవారం వెలుగు చూసింది. కగార్ యుద్ధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

శ్వేతసౌధంలో ట్రంప్ కలల సౌధం!

» ఈస్ట్ వింగ్‌లో 'బాల్ రూమ్' పనులు ప్రారంభం.. వెల్లడించిన ట్రంప్

వాషింగ్టన్, అక్టోబరు 21: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన కలల ప్రాజెక్టుగా చెబుతున్న బాల్‌రూమ్ నిర్మాణానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. బాల్‌రూమ్ నిర్మాణం కోసం శ్వేతసౌధంలోని తూర్పు విభాగంలో సోమవారం కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. 'వైట్‌హౌస్ మైదానంలోని తూర్పు విభాగం (ఈస్ట్ వింగ్)లో కొత్తగా అతిపెద్ద, అందమైన బాల్‌రూమ్ నిర్మాణానికి పనులు మొదలయ్యాయని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను' అని ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. అమెరికా ప్రజలపై భారం పడకుండా దాతలు ఇచ్చే సొమ్ముతో ఈ బాల్‌రూమ్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. 'గత 150 సంవత్సరాలకుపైగా.. ప్రతి అమెరికా అధ్యక్షుడూ వైట్ హౌస్‌లో గ్రాండ్ పార్టీలు, అతిథుల కోసం ఒక బాల్‌రూమ్ ఉండాలని కలలు కన్నారు. ఎట్టకేలకు ఈ ప్రాజెక్టు ప్రారంభమైంది. అమెరికన్ పన్ను చెల్లింపుదారులకు భారం లేకుండా.. ఈ ప్రాజెక్టును ప్రారంభించిన తొలి అధ్యక్షుడిగా నేను ఈ గౌరవం దక్కించుకుంటున్నాను' అని ట్రంప్ తెలిపారు. బాల్‌రూమ్ నిర్మాణం కోసం ఉదారత కలిగిన దేశభక్తులు, అమెరికాకు చెందిన భారీ కంపెనీలు నిధులు సమకూర్చుతున్నాయని చెప్పారు.

అరుదైన ఖనిజాల కోసం ట్రంప ర్లాట!

అరుదైన ఖనిజాల అన్వేషణ, లోహాల ప్రాసెసింగ్‌పై దృష్టి



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న అల్బనీస్, ట్రంప్

» ఆ దిశగా ఆస్ట్రేలియాతో ఒప్పందం.. పాక్ నుంచీ సమకూర్చుకునే యత్నాలు

(సెంట్రల్ డెస్క్)

జానపద కథల్లో మాంత్రికుడి ప్రాణం చిలకలో ఉన్నట్టు.. ప్రస్తుతం అమెరికా సహా కీలక దేశాల టెక్నాలజీ అవసరాలన్నీ చైనా చేతిలో చిక్కుకుపోయాయి. మొబైల్ ఫోన్ల నుంచి ఎలక్ట్రిక్ వాహనాల వరకు, శాటిలైట్ల నుంచి క్షిపణులు, ఇతర రక్షణ రంగ ఉత్పత్తుల వరకు ఎంతో కీలకమైన 'అరుదైన మూలకాల'పై చైనా ఆధిపత్యమే దీనికి కారణం. రష్యా నుంచి చమురు కొంటోందంటూ భారత్‌పై అడ్డగోలు టారిఫ్‌లు వేసిన ట్రంప్.. మనకన్నా ఎక్కువ చమురు కొంటున్న చైనా జోలికి మాత్రం వెళ్లలేకపోతున్నారు. టారిఫ్‌లు వేస్తామని ట్రంప్ బెదిరించగానే.. అరుదైన లోహాల సరఫరాపై చైనా నియంత్రణలు పెట్టింది. దీనితో చైనాపై 155శాతం టారిఫ్‌లు వేస్తానని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. త్వరలో దక్షిణ కొరియాలో జరిగే సదస్సులో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకుంటానని కూడా సంకేతాలు ఇచ్చారు. కానీ చైనా ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. దీనితో ట్రంప్ మెత్తబడ్డారు. సోమవారం శ్వేతసౌధంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జిన్‌పింగ్‌తో జరగనున్న భేటీలో అద్భుతమైన ఒప్పందం కుదుర్చుకుంటామని, ఇరు దేశాలతోపాటు ప్రపంచ దేశాలన్నింటికీ ప్రయోజనం ఉంటుందని ప్రకటించడం గమనార్హం. అయితే 'అరుదైన లోహాల'పై చైనా ఆధిపత్యాన్ని భగ్నం చేసే దిశగానే ఆస్ట్రేలియా ప్రధానితో ట్రంప్ భేటీకావడం గమనార్హం. అరుదైన లోహాల మైనింగ్ కోసం ఇటీవల పాకిస్థాన్‌తో కూడా అమెరికా సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

గాలియం, లీథియం లోహాల కోసం..

ప్రపంచవ్యాప్తంగా ఆస్ట్రేలియా సహా పలు దేశాల్లో అరుదైన ఖనిజాల నిల్వలు ఉన్నాయి. కానీ వాటిని వెలికితీయడం, శుద్ధి చేసి, లోహాలను రూపొందించే ప్రక్రియ చాలా వ్యయం, శ్రమతో కూడుకున్నది. పైగా తీవ్రమైన పర్యావరణ కాలుష్యం సమస్య కూడా. కొన్ని దేశాలు ఈ అరుదైన ఖనిజాలను వెలికితీస్తున్నా.. ప్రాసెసింగ్ కోసం చైనాకు పంపించాల్సిందే. ఈ రంగంలో చైనా ఆధిపత్యానికి గండి కొట్టడానికే ట్రంప్ ఆస్ట్రేలియాతో రూ.75 వేల కోట్ల (8.5 బిలియన్ డాలర్లు) ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనితో ఆస్ట్రేలియాలో అరుదైన ఖనిజాలను తవ్వి, ప్రాసెస్ చేసేందుకు అమెరికాకు వీలుకలుగుతుంది. ఈ ఒప్పందం మేరకు పశ్చిమ ఆస్ట్రేలియాలో వార్షికంగా 100 మెట్రిక్ టన్నుల గాలియం లోహాన్ని ఉత్పత్తి చేయగల రిఫైనరీని నెలకొల్పనున్నారు. ఇక ఇప్పటికే ఆస్ట్రేలియా చేపడుతున్న లీథియం ఉత్పత్తిని మరింత పెంచి, అమెరికాకు సరఫరా చేయనున్నారు.

అమెరికా చదువుపై అనాసక్తే!

» హెచ్-1బీ నిబంధనల సమస్య తేలినా.. భారతీయుల్లో తగ్గని ఆందోళన

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అమెరికా హెచ్-1బీ వీసా కొత్త నిబంధనలపై స్పష్టత వచ్చినా, అక్కడే చదువుకుని, ఉద్యోగంలో చేరేవారికి లక్ష డాలర్ల ఫీజు వర్తించదని తేలినా.. భారత విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మునుపటి ఉత్సాహం కనిపించడం లేదు. తాజా నిబంధనలు భారతీయులకు మేలు కలిగించేలా ఉన్నా కూడా అమెరికా చదువులపై తెలుగువారు అనాసక్తి చూపుతున్నారని హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కన్సల్టెన్సీలు పేర్కొంటున్నాయి. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం విదేశీయులకు సంబంధించి ఎన్నో వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా హెచ్-1బీ వీసా కోసం లక్ష డాలర్ల ఫీజు విధించడం భారతీయులే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయమనే భావన ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో అత్యధికులు అమెరికానే ఎంచుకునేవారు. కానీ ఇటీవలి పరిణామాల నేపథ్యంలో వారి దృక్పథంలో మార్పు వచ్చిందని హైదరాబాద్‌లోని వీజేసీ ఓవర్సీస్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రతినిధి హేమంత్ తెలిపారు. విద్యార్థి వీసాల (ఎఫ్-1)పై వెళ్లినవారు తాత్కాలిక ఉద్యోగాలేవీ చేయకుండా నిబంధనలు కఠినతరం, ఉద్యోగ వీసాలకు సంబంధించి పూటకో ప్రకటన చేయడం, ఇటీవల ఏకంగా లక్ష డాలర్ల ఫీజు విధించడం వంటివి విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన రేపాయని పేర్కొన్నారు. ఎఫ్-1 వీసా నుంచి హెచ్-1బీ వీసాకు మారేందుకు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని తాజాగా విడుదల మార్గదర్శకాలు చెబుతున్నా మునుపటి ఉత్సాహం కనిపించడమే లేదని తెలిపారు. అమెరికాలో మారిన పరిస్థితుల నేపథ్యంలో అనేకమంది ఆ దేశం వెళ్లాలనే ఆలోచనలను విరమించుకుంటున్నారని హిమాయత్‌నగర్‌లోని ఇంపీరియల్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ ప్రతినిధి నయీమ్ తెలిపారు. "బీటెక్ తర్వాత మాస్టర్స్, ఇతర పీజీ కోర్సుల కోసం 70శాతం మంది అమెరికాను ఎంచుకునేవారు. ఇప్పుడు మా వద్దకు వస్తున్నవారిలో అత్యధికులు కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, యూకేకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు" అని వెల్లడించారు.

మల్లోజుల, ఆశన్నలకు వై కేటగిరి భద్రత!?

హైదరాబాద్, అక్టోబరు 21: ఇటీవల ప్రభుత్వం ఎదుట ఆయుధాలతో లొంగిపోయిన మావోయిస్టు అగ్రనాయకులు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్నలకు వై కేటగిరి భద్రత కల్పించాలని కేంద్ర సర్కారు నిర్ణయించినట్లు సమాచారం. సాయుధ పోరాటాన్ని విరమిస్తూ మల్లోజుల, ఆశన్నలు తీసుకున్న నిర్ణయాన్ని పార్టీలోని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ అగ్రనేతలకు ప్రజాకోర్టుల్లో శిక్ష తప్పదంటూ తీవ్ర హెచ్చరికలు వస్తున్నాయి. దీంతో వారికి పూర్తిస్థాయి భద్రత కల్పించడం కోసం కేంద్ర వై కేటగిరి భద్రత ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఇంటిలిజెన్స్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

అమెరికా వెళ్లే విద్యార్థులకు ఉపశమనం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటున్న విదేశీయులు హెచ్-1బీకి మారాలనుకుంటే ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపింది. ఈ మేరకు తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. అమెరికా వెలుపల ఉండి కొత్తగా దరఖాస్తు చేసినా, కాన్సులర్ ప్రాసెసింగ్ కోరినా ఫీజు చెల్లింపు నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. ప్రస్తుత హెచ్-1బీ వీసాదారులు అమెరికాకు రాకపోకలు సాగించడానికి ఎలాంటి అడ్డంకులూ ఉండబోవని వివరణ ఇచ్చింది.

యూఎస్‌సీఐఎస్ మార్గదర్శకాలు ఇవీ..

- ఎఫ్-1 వీసాపై ఇప్పటికే అమెరికాలో చదువుకుంటున్నవారు, చదువు పూర్తయి ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)పై ఉన్నవారు హెచ్-1బీ వీసా కోసం లక్ష డాలర్లు కట్టాల్సిన అవసరం లేదు.
- హెచ్-1బీపై ఉద్యోగం చేస్తూ.. వీసా రెన్యువల్, సవరణ (కంపెనీ మార్పు) కోసం దరఖాస్తు చేసుకొనేవారికి ఫీజు మినహాయింపు ఉంటుంది.
- ఎల్-1 (సంస్థల్లో అంతర్గత బదిలీలు), జే-1 (వైద్యులు, పరిశోధకులు, అధ్యాపకులు, ఇతర నిపుణులు) వీసాలపై ఉండే వారికీ హెచ్-1బీకి మారితే ఫీజు వర్తించదు. కానీ వాళ్ల రెండేళ్లపాటు స్వదేశానికి వెళ్లిరావాలనే (హోమ్ రెసిడెన్సీ) నిబంధన ఉంది. ఇందులో వైద్యులకు మాత్రం హోం రెసిడెన్సీ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు.
- 2025 సెప్టెంబరు 21వ తేదీకి ముందే దాఖలైన, ఆమోదం పొందిన హెచ్-1బీ దరఖాస్తుదారులు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదు. వారికి గతంలో ఉన్న నిబంధనలే అమలు చేస్తారు.
- అమెరికా వెలుపలి నుంచి కొత్తగా హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసినా, కాన్సులర్ ప్రాసెసింగ్ కోరినా ఫీజు చెల్లింపు నిబంధన వర్తిస్తుంది.
- ఇప్పటికే ఉన్నవారంతా దరఖాస్తు చేసుకోగానే.. ఫీజు మినహాయింపు ఉండదు. వీసా మార్పు (స్టేటస్), నివాస, ఉద్యోగ అర్హత గడువు పొడిగింపునకు సంబంధించిన దరఖాస్తుదారులు అందుకు అనర్హులని యూఎస్‌సీఐఎస్ నిర్ధారిస్తే.. వారు హెచ్-1బీ వీసా కోసం లక్ష డాలర్లు ఫీజు చెల్లించాల్సిందే.
- హెచ్-1బీ కోసం దరఖాస్తు చేసుకునే ముందే లక్ష డాలర్లను అమెరికా ట్రెజరీ పోర్టల్‌లో జమ చేసి, ఆ ఆధారాలను దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. లేదా మినహాయింపు కేటగిరీలో ఉంటే సంబంధిత ఆధారాలను జత చేయాలి. లేకపోతే దరఖాస్తు ఆటోమేటిగ్గా తిరస్కరణకు గురవుతుంది. లక్ష డాలర్లు చెల్లించినవారి దరఖాస్తు తిరస్కరణకు గురైతే.. సొమ్ము మొత్తం రీఫండ్ చేస్తారు.
- అమెరికా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, సదరు ఉద్యోగానికి తగిన అర్హత కలిగిన అమెరికన్ ఉద్యోగి అందుబాటులో లేరని కంపెనీ యాజమాన్యం నిరూపించినప్పుడు, అసాధారణ పరిస్థితుల్లో ఫీజు మినహాయించేందుకు అవకాశం ఉంటుంది.

భారతీయ విద్యార్థులకు ప్రోత్సాహం

'ఓపెన్ డోర్స్' తాజా గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరానికి గాను 3.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు అమెరికాలోని విద్యాసంస్థల్లో చేరారు. వీరిలో 97,556 మంది ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)లో నమోదయ్యారు. ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు తమ చదువుకు సంబంధించిన రంగాల్లో 12నెలల వరకూ పని చేయడానికి ఓపీటీ ప్రోగ్రామ్ అనుమతిస్తుంది. స్టెమ్ (ఎస్‌టీఈఎం) గ్రాడ్యుయేట్లు ఈ వ్యవధిని అదనంగా మరో 24 నెలలు పొడిగించుకోవడం ద్వారా మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండి పని అనుభవం పొందే అవకాశం ఉంది. అమెరికాలో ఉండే అనేక సంస్థల యజమానులు ఇటువంటి విద్యార్థులకు హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేస్తుంటారు. ఇప్పుడు వీరందరికీ ఫీజు మినహాయింపు లభించనుంది.

చిన్న ఉల్లంఘన ఉన్నా లక్ష డాలర్లు కట్టాల్సిందే

(ఎఫ్-1 వీసాలపై చదివే విద్యార్థులు ఏవైనా ఉల్లంఘనలకు పాల్పడితే వారి వీసా మార్పు తిరస్కరణకు గురవుతుంది. ఉదాహరణకు చదువుకునే సమయంలో అనధికారికంగా ఎక్కడైనా ఉద్యోగం చేసినా ప్రభావం పడుతుంది. సదరు విద్యార్థికి హెచ్-1బీ వీసా వచ్చి ఉద్యోగం చేరిన తర్వాత అయినా సరే.. ఎఫ్-1 వీసా సమయంలో నిబంధనలు ఉల్లంఘించినట్టు రుజువైతే లక్ష డాలర్లు కట్టాల్సి ఉంటుందని ఇమిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు హెచ్-1బీ వీసా కేటాయింపుల్లో వేతనాల స్థాయిని ప్రామాణికంగా తీసుకోవాలనే ప్రతిపాదననుగానీ అమల్లోకి తెస్తే ఇబ్బందులు తప్పకపోవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.



నూతన వస్త్రాలను తీసుకొస్తున్న జీయర్ స్వాములు, అర్చకులు

తిరుమలలో శాస్త్రోక్తంగా దీపావళి ఆస్థానం

తిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం ఉదయం దీపావళి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి, విష్వక్సేనుల వారి ఉత్సవమూర్తులను గరుడాళ్వార్ సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలను ధరింపజేసి, రూపాయి హారతి, ప్రత్యేక హారతులను నివేదించారు.

శ్రీవారి సేవలో జస్టిస్ సుజాత



తిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

ఖాద్రీశుడి సన్నిధిలో జస్టిస్ టి.మల్లికార్జున రావు



కదిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జస్టిస్ టి.మల్లికార్జునరావు, ఆయన కుటుంబ సభ్యులు

కదిరి లీగల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున రావు కుటుంబ సమేతంగా సోమవారం రాత్రి దర్శించుకున్నారు. న్యాయాధికారులు జయలక్ష్మి, లోకనాథం, డీఎస్పీ శివనారాయణస్వామి, తహశీల్దారు మురళీకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఆవరణలో జస్టిస్ మల్లికార్జునరావు దంపతులను వేద పండితులు సత్కరించి, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఏపీ ఆగ్రోస్ చైర్మన్ సుబ్బానాయుడి మృతి

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- పలువురు నేతల నివాళి.. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



కావలి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు(60) సోమవారం తెల్లవారుజామున అమరావతిలోని మణిపాల్ ఆసుపత్రిలో మృతిచెందారు. నెల్లూరు జిల్లా దగదర్తిలో ప్రభుత్వ లాంఛనాలతో సోమవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రతినిధులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. ఈ నెల 11న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల సమీక్షలో మాలేపాటి పాల్గొని, వ్యవసాయాభివృద్ధికి సలహాలు అందచేసారు. అదే రోజు అమరావతిలోని ఇంటికి వెళ్లిన తర్వాత ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే మణిపాల్ ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకున్నారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి, సుబ్బానాయుడికి తగిన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ నేపథ్యంలో 11 రోజులు మృత్యువుతో పోరాడిన సుబ్బానాయుడు సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లకు అధికార లాంఛనాలు లేకపోయినప్పటికి సుబ్బానాయుడి కోసం ప్రభుత్వం జీవో ఇచ్చి అధికార లాంఛనాలతో స్వగ్రామం అయిన దగదర్తిలో అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు టీడీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

'చందన' మోహనరావు కన్నుమూత

- సీఎంఆర్ షాపింగ్ మాల్స్ స్థాపకుడిగా విశేష గుర్తింపు
- వ్యాపారవేత్తలు, ప్రజా ప్రతినిధుల నివాళి



చందన మోహనరావు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వస్త్ర వ్యాపారి చందన మోహనరావు సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మోహనరావు(82) విశాఖపట్నం కేఆర్ఎం కాలనీలోని ఆయన స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన మోహనరావు 1984లో విశాఖ జగదాంబ సెంటర్ వద్ద చందన బ్రదర్స్ పేరుతో వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించారు. హోల్‌సేల్ రేట్లకే రిటైల్ అమ్మకం నినాదంతో వ్యాపారంలో నూతన ఒరవడి సృష్టించారు. 1988లో హైదరాబాద్, 1989లో విజయవాడలో చందన బ్రదర్స్ దుకాణాలను ప్రారంభించారు. అదే క్రమంలో 1998లో జ్యువెలరీ రంగంలోకి ప్రవేశించి, తొలిసారిగా హాల్‌మార్క్ బంగారు ఆభరణాలను తెలుగు రాష్ట్రాలకు పరిచయం చేశారు. పొగడ్తలంటే ఇష్టపడని మోహనరావు తన పేరు మీద వ్యాపారం ప్రారంభించేందుకు విముఖత చూపేవారు. అయితే అల్లుడు మావూరి వెంకటరమణ ప్రోద్బలంతో 2002లో విశాఖలో మొదటిసారిగా సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభించారు. రెండు రాష్ట్రాల్లో ఏర్పాటుచేసిన సీఎంఆర్ మాల్స్‌తో వేల కుటుంబాలకు ఉపాధి కల్పించడమే కాక, సీఎంఆర్ చారిటబుల్ ట్రస్టును స్థాపించి అనేకమంది పేద విద్యార్థులకు విద్యా దానం చేశారు. అవసరంలో ఉన్న వారిని ఆదుకునే దాతగా పేరు తెచ్చుకున్నారు. మృదు స్వభావిగా పేరుగాంచిన మోహనరావు వేల మందికి ఆదర్శంగా నిలిచారు. మోహనరావు మృతిపై నగరంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చందన మోహనరావు అల్లుడు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

11 నెలల్లో రూ.918.59 కోట్లు

- శ్రీవారి ట్రస్టులకు విరాళాలు

తిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ట్రస్టులకు విరాళాలు భారీగా పెరిగాయి. గడిచిన 11 నెలల్లో వివిధ ట్రస్టులకు రూ.918.59 కోట్లు విరాళాలు అందాయి. టీటీడీలోని 11 ట్రస్టుల్లో అత్యధికంగా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.338.80 కోట్లు రాగా, రెండవ స్థానంలో శ్రీవాణి ట్రస్టు నిలిచింది. ఈ ట్రస్టుకు రూ.252.83 కోట్లు అందాయి. ఇక, ఎస్వీ ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు రూ.97.97 కోట్లు, ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.66.53 కోట్లు, ఎస్వీ గోసంరక్షణకు రూ.56.77 కోట్లు, విద్యాదానం ట్రస్టుకు రూ.33.47 కోట్ల విరాళాలు అందాయి. అలాగే బర్డ్ ట్రస్టుకు రూ.30.02 కోట్లు, సర్వశ్రేయాస్‌కు రూ.20.46 కోట్లు, వేదపరిరక్షణ ట్రస్టుకు రూ.13.87 కోట్లు, ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.6.29 కోట్లు, స్విమ్స్‌కు రూ.1.52 కోట్ల చొప్పున విరాళాల రూపంలో అందాయి. ఈ 11 నెలల్లో ఆఫ్‌లైన్ ద్వారా రూ.339.20 కోట్లు విరాళాలుగా అందగా, ఆన్‌లైన్ ద్వారా 579.38 కోట్లు వచ్చాయి.

రెండురోజుల్లో హుండీ ద్వారా రూ.8.83 కోట్లు

తిరుమల శ్రీవారికి రెండురోజుల్లో హుండీ ద్వారా రూ.8.83 కోట్ల ఆదాయం లభించింది. శనివారం ఒక్కరోజే రూ.7.97 కోట్లు వచ్చింది. ఆదివారం రూ.3.86 కోట్లు ఆదాయం సమకూరింది. ఇక, ఆదివారం 84,017 మంది, సోమవారం 72,026 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, ఈ రెండురోజుల్లో 53,401 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

వివాదాస్పదులపై వేటు

విశాఖ డీఆర్వో, ఆర్డీవోపై చర్యలు

- జీఏడీకి అటాచ్ చేస్తూ దీపావళి రోజు ఉత్తర్వులు
- ఆర్డీవో శ్రీలేఖ కొంపముంచిన ఒంటెద్దు పోకడలు
- సర్వీస్ ఫైల్ తొక్కిపెట్టారని డీఆర్వోపై వ్యతిరేకత
- కలెక్టర్, జేసీ కాల్స్, మెసేజీలకు స్పందించని వైనం
- ప్రతి సోమవారం జరిగే ప్రజా స్పందనకూ గైర్హాజరు
- ఆమె తీరుపై జిల్లా కలెక్టర్‌కు వెల్లువెత్తిన ఫిర్యాదులు
- పత్రికల్లో కథనాలతో తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం



డీఆర్వో భవానీశంకర్



ఆర్డీవో శ్రీలేఖ

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద వ్యవహార శైలి, పరస్పర ఆరోపణలతో రచ్చకెక్కిన ఇద్దరు అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విశాఖపట్నం జిల్లాలో కీలకమైన ఇద్దరు రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ ఇష్టానుసారం వ్యవహరిస్తే ఉపేక్షించబోమని సంకేతాలు పంపింది. ఆర్డీవో శ్రీలేఖ, డీఆర్వో భవానీ శంకర్‌లను పక్కకు తప్పిస్తూ... దీపావళి సెలవు రోజునే ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇద్దరినీ అమరావతిలో జీఏడీకి సరండర్ చేశారు. విశాఖ జిల్లా రెవెన్యూ అధికారిగా జేసీ మయూర్ అశోక్‌కు, విశాఖ ఆర్డీవో బాధ్యతలను హెచ్‌పీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సనపల సుధాసాగర్‌కు తాత్కాలికంగా అప్పగించారు. వీరిద్దరూ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు.

ఆది నుంచీ వివాదాలే

డీఆర్వో భవానీశంకర్, ఆర్డీవో శ్రీలేఖ గతేడాది అక్టోబరులో ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. కొన్నాళ్లు బాగానే ఉన్నా ఆ తరువాత వారి మధ్య విభేదాలు మొదలయ్యాయి. ప్రభుత్వ పెద్దల దన్ను ఉందని ఆర్డీవో ఒంటెద్దు పోకడలతో వ్యవహరించడం ప్రారంభించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం ధిక్కరించేవారు. గత సాధారణ ఎన్నికల సమయంలో ఆమె ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో విధులు నిర్వహించారు. అప్పట్లో నిబంధనల ప్రకారం నడుచుకోవడం లేదంటూ ఆమెను జిల్లా కలెక్టర్ సరండర్ చేశారు. మూడు నెలల పాటు ఆమెకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. గత అక్టోబరులో విశాఖ ఆర్డీవోగా వచ్చారు. తన సర్వీస్ రెగ్యులర్ చేసే ఫైల్‌ను పైకి పంపకుండా డీఆర్వో భవానీశంకర్ తొక్కిపెట్టారని అనుమానంతో ఆయన పట్ల వ్యతిరేకతను ప్రదర్శించడం ప్రారంభించారు. కలెక్టర్ ఫోన్ చేసినా స్పందించేవారు కాదు. ఆమెకు ఏదైనా పని చెప్పాలంటే ఉన్నతాధికారులు భయపడే పరిస్థితి ఏర్పడింది. కొన్నాళ్లు వేచిచూసిన కలెక్టర్ ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు.

డీఆర్వోపై ఫిర్యాదు...

పెందుర్తి మండలం ఏకలవ్య నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం తొలగింపు వ్యవహారం శ్రీలేఖ నిర్ణయం వివాదాస్పదంగా మారింది. చాలా కాలం నుంచి అక్కడ విగ్రహం ఉండగా, స్థల యజమాని ఫిర్యాదుపై రాత్రికి రాత్రి దానిని తొలగించాలని ఆదేశించారు. స్థానిక సంఘాలు కలెక్టరేట్‌కు వెళ్లి ఆధారాలు చూపించడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ విషయమై శ్రీలేఖకు షోకాజ్ నోటీసు ఇవ్వడం, ఆ విషయం పత్రికల్లో రావడంతో ఆమె డీఆర్వో భవానీ శంకర్‌పై ఎదురుదాడికి దిగారు. ఆయన తహశీల్దార్ కార్యాలయాల నుంచి ప్రతినెలా సరకులు తెప్పించుకుంటున్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ లేఖను పత్రికలకు లీక్ చేశారు. దాంతో వారిమధ్య విభేదాలు రోడ్డున పడ్డాయి. రెవెన్యూ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కలిసి ఆర్డీవో ఆరోపణలు అవాస్తవమని వివరించారు. అయితే అప్పటికే ఈ విషయాలన్నీ ప్రభుత్వం దృష్టికి వెళ్లడం, ఆమెను సమర్థిస్తున్న నాయకులు కూడా ఆమె కారణంగా తమకు చెడ్డపేరు వస్తుందని భావించడంతో తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఈ వ్యవహారాలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. కలెక్టర్, నిఘా వర్గాలతో పాటు, నగరానికి చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని వివాదానికి కారణమైన ఆర్డీవో, డీఆర్వోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రీవారి దర్శనాల పేరిట వసూళ్ల దందా

దళారీ ఖాతాలో ఏడాదిలో రూ.కోటి లావాదేవీలు.. అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విజయ్‌శేఖర్

తిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం, ఆర్జితసేవలు, వసతి పేరుతో భక్తులను మోసగిస్తూ తప్పించుకు తిరుగుతున్న అశోక్‌కుమార్ రెడ్డి అనే దళారీని తిరుమల పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గడిచిన ఏడాది కాలంలో అతని బ్యాంకు ఖాతాల్లో రూ.కోటికిపైగా లావాదేవీలు జరిగినట్టు విచారణలో వెల్లడైంది. తిరుపతి జిల్లా చంద్రగిరి పాతపేటకు చెందిన బురిగాల అశోక్ అలియాస్ అశోక్‌కుమార్ రెడ్డి రాక్‌స్టార్ ఈవెంట్స్ ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన అమన్ గోయల్, గౌతమ్ గుప్తాకు వీఐపీ బ్రేక్ దర్శనం, కల్యాణోత్సవం, అభిషేకం, గదులు ఇప్పిస్తానని నమ్మించి రూ.4,16,500 నగదును విడతల వారీగా ఆన్‌లైన్ ద్వారా తన బ్యాంకు ఖాతాలో వేయించుకున్నాడు. తీరా ఆ భక్తులు తిరుమల చేరుకోగా అశోక్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో విజిలెన్స్ అధికారులను ఆశ్రయించి జరిగిన మోసాన్ని వివరించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా 16వ తేదీన తిరుమల టూటౌన్ పోలీస్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే గోపాల్ నత్మల్ అగర్వాల్, రాధిక అనే భక్తులూ 17వ తేదీన నేరుగా వన్‌టౌన్ పోలీస్టేషన్‌లో అశోక్‌పై ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో వన్, టూటౌన్ పోలీసులు ప్రత్యేక నిఘాతో అశోక్‌ను మంగళవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి ఓ సెల్‌ఫోన్, బైక్, నాలుగు బ్యాంక్ పాస్‌పుస్తకాలను స్వాధీనం చేశారు. రెండు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేసి మంగళవారం తిరుపతి రెండో కోర్టుకు తరలించారు.

విచారణలో వెలుగుచూసిన అక్రమాలు

పోలీసుల విచారణలో అశోక్ అక్రమాలు వెలుగుచూశాయి. గడిచిన ఏడాదిలో రూ.కోటికిపైగానే బ్యాంకు లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. రాజకీయ నాయకుల పేర్లు చెప్పడంతో పాటు టీటీడీలో తనకు మంచి పరిచయాలున్నట్టు భక్తులను నమ్మించి మోసగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. కొన్నేళ్లుగా భక్తులను మోగిస్తూ లక్షల్లో వసూలు చేసినట్టు తేలింది. ఈ డీఎస్పీ విజయ్‌శేఖర్ మంగళవారం తిరుమల టూటౌన్ పోలీస్టేషన్ అలిపిరి పాదాలు అవుట్‌పోస్టులో మీడియాతో మాట్లాడారు. స్వామి దర్శనాలు, గదులు, సేవల పేరుతో అశోక్ భక్తులను మోగిస్తున్నాడని, భక్తుల నుంచి నగదు వసూలు చేసిన తర్వాత ఫోన్ ఆఫ్ చేసి పారిపోతున్నాడని వివరించారు. భక్తులు ఇలాంటి వ్యక్తులను నమ్మకూడదని, టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే దర్శనం, వసతి, సేవలు పొందాలని సూచించారు.

బీజేపీ, ఆరెస్సెస్‌లతో దేశానికి ముప్పు: సీపీఐ రాజా

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఆరెస్సెస్‌ల మతోన్మాద విధానాలతో దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. ఆ రెండు శక్తులూ కలిసి భారత్‌ను ఫాసిస్టు దేశంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలు విస్మరించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కనుసన్నల్లో నడుస్తున్నారని అన్నారు. మంగళవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిహార్ ఎన్నికల ఫలితాలు దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని చెప్పారు. దేశంలోని అన్ని లౌకిక, ప్రజాస్వామిక పార్టీలతో కలిసి బీజేపీ, ఆరెస్సెస్‌లకు వ్యతిరేకంగా బలమైన ఐక్య పోరాటానికి సీపీఐ సన్నద్ధమవుతోందని రాజా తెలిపారు. ఈ నెల 25న ఢిల్లీలో నిర్వహించనున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయస్థాయి ఉద్యమ కార్యాచరణపై చర్చిస్తామన్నారు.

బాణసంచా వివాదంలో.. భార్యను పొడిచేశాడు


శస్త్ర చికిత్స చేసి చాకు తొలగించిన వైద్యులు



పల్లవి కంటిపై నుంచి నోటిలోకి దిగబడిన చాకు

పి.గన్నవరం/కాకినాడ(జీజీహెచ్) అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య స్వల్ప వివాదం చినికి చినికి.. గాలివానగా మారింది. మద్యం మత్తులో భర్త.. చాకుతో భార్య ఎడమవైపు నుదిటి మీద బలంగా పొడవగా అది నోట్లోకి వచ్చింది. ఈ ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి గ్రామంలో సోమవారం రాత్రి జరగ్గా బాధితురాలికి కాకినాడ జీజీహెచ్‌లో వైద్యులు మంగళవారం శస్త్రచికిత్స నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి గ్రామానికి చెందిన నేలపూడి గంగరాజు అదే గ్రామానికి చెందిన పల్లాలమ్మ(పల్లవి)(36)ని 20ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గంగరాజు మద్యానికి బానిసై తరచూ భార్యను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండడంతో కొంతకాలంగా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈక్రమంలో సోమవారం దీపావళి సందర్భంగా బాణసంచా కోసం కొంత నగదు గంగరాజు భార్యకు ఇచ్చాడు. ఈ విషయమై సాయంత్రం వారిద్దరి మధ్య స్వల్ప వివాదం జరిగింది. అనంతరం రాత్రి 11 గంటల సమయంలో గంగరాజు మద్యం తాగి వచ్చి భార్యపై గొడవకు దిగాడు. ఈక్రమంలో తన దగ్గర ఉన్న చాకుతో గంగరాజు ఆమెను గొంతులో పొడిచేందుకు ప్రయత్నించాడు. తప్పించుకునే ప్రయత్నంలో పల్లవి తల కిందికి పెట్టడంతో చాకు ఎడమ కన్ను పైభాగం నుంచి నోట్లోకి దిగబడింది. దీంతో కుటుంబీకులు, బంధువులు వెంటనే ఆమెను అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం దీపావళి సెలవు కావడంతో అక్కడ వైద్యులు అందుబాటులో లేరు. దీంతో ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు తెల్లవారుజామున 4 నుంచి 6 గంటల వరకు శ్రమించి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పి.గన్నవరం ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. కాగా, నిందితుడు పోలీసుల అదుపులోనే ఉన్నట్టు సమాచారం.

కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు హత్య | భూ వివాదమే కారణం



వారా నూకరాజు

రోలుగుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు సోమవారం హత్యకు గురయ్యారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు, స్థానికులు అందించిన వివరాలు.. మండలంలోని ఎంకే పట్నం పంచాయతీ శివారు చటర్జీపురం సర్వే నంబర్ 139లో 10.83 ఎకరాల భూమికి సంబంధించిన పట్టా నూకరాజు పేరిట ఉంది. అందులో కొంత భూమిని గత 30 ఏళ్ల నుంచి చటర్జీపురం గిరిజనులు సాగు చేసుకుంటున్నారు. సదరు భూమిని ఖాళీ చేయాలని గిరిజనులపై నూకరాజు ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. మార్చిలో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోగా నూకరాజు గాయపడ్డారు. గొడవల నేపథ్యంలో ఇరువర్గాలు ఆ భూమి జోలికి వెళ్లకూడదని, గిరిజనులు వేసుకున్న పంటను అలాగే ఉంచాలని తహశీల్దార్ సమక్షంలో బైండోవర్ చేయించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నూకరాజు తన అనుచరులతో భూమి వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడ గిరిజనులు ఉన్నారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. గిరిజనులు కర్రలు, కత్తులతో దాడి చేయడంతో నూకరాజుకు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందారు. సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నూకరాజు కుమారుడు కన్నబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అధికారంలోకి వస్తామన్న నమ్మకం లేకనే రాష్ట్రీయ జనతాదళ్ అధినేత తేజస్వి యాదవ్ అంత భారీస్థాయి ప్రభుత్వ ఉద్యోగాలకు హామీ ఇచ్చారని బీజేపీ నాయకులు అంటున్నారు. యువత ఆశలూ, ఆందోళనలు ఎన్నికల ఫలితాలను కచ్చితంగా ప్రభావితం చేస్తాయి కనుక, ఉద్యోగం, ఉపాధి గురించి ఎన్నికల వేళల్లో నాయకులు బోలెడన్ని హామీలు గుప్పించడం సహజమే. అయితే, తేజస్వి ప్రకటన సాధారణమైనది కాదు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20రోజుల్లోనే, రాష్ట్రంలోని ప్రతీ ఇంటికీ ఒక ప్రభుత్వోద్యోగం ఇస్తానని ప్రకటించాడు. ఒక్క గవర్నమెంట్ ఉద్యోగి కూడా లేని కుటుంబాలకు మాత్రమే ఈ హామీ వర్తిస్తుందని ఆయన పేరుకు ఓ మెలికపెట్టినప్పటికీ, మరో ఇరవైనెలల్లో రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగి లేని కుటుంబం ఒక్కటంటే ఒక్కటి కూడా ఉండబోదని ఆయన ప్రకటించాడు. బిహార్‌లో 2022–23 సర్వే ప్రకారం 2.76 కోట్ల కుటుంబాలు ఉన్నాయి. కేంద్రప్రభుత్వ ఉద్యోగస్తులతో కలిపి, మొత్తంగా రాష్ట్రంలో 20.5 లక్షలమంది ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. వీరంతా వేర్వేరు కుటుంబాలవారని లెక్కవేసుకున్నా, రేపు తేజస్వి అధికారంలోకి రాగానే ఇంకా 2.55కోట్ల కుటుంబాలకు, అంటే ఇప్పుడున్న దానికి పదమూడురెట్లు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంటుంది. బిహార్ ప్రభుత్వం ఇప్పటికే తన ఉద్యోగుల వేతనాలకు ఏటా యాభైఒక్కవేల కోట్లు ఖర్చుచేస్తున్నది కనుక, తేజస్వి ప్రతీ కుటుంబానికీ ఓ సర్కారీ కొలువు ఇచ్చి, జీతాలకు ఇకపై ఏటా ఆరున్నరలక్షలకోట్ల పైచిలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంతా చేసి, బిహార్ బడ్జెట్ 3.16లక్షల కోట్లే. గత రెండేళ్ళలో రెండులక్షల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగలిగిన రాష్ట్రంలో తేజస్వి హామీ ఎంతమాత్రం ఆచరణ సాధ్యం కాదని నిరూపించడానికి ప్రయత్నిస్తున్నవారు ఇంకా ఏవేవో లెక్కలు విప్పుతున్నారు కానీ, బిహార్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇటువంటి వాగ్దానాలు, విన్యాసాలు ఇంకా ఎన్నెన్నో చూడవలసి ఉంటుంది.

బిహార్ చిత్రాలు...

రెండు విడతల్లో ఎన్నికలు జరగబోతున్న బిహార్‌లో మలిదశ నామినేషన్లు, పరిశీలనలు, తిరస్కారాలు మంగళవారం పూర్తయ్యాయి. దరఖాస్తుల ఉపసంహరణకు 48 గంటల గడువుమాత్రమే ఉన్నందున, తేలని తగవులు, పంచాయితీలతో అన్ని పార్టీలూ సతమతమవుతున్నాయి. కుటుంబపాలన, రాచరికపాలన అంటూ ప్రధాని నరేంద్రమోదీ సహా బీజేపీ పెద్దలంతా విపక్షాలను ఎగతాళి చేస్తుంటారు. విపక్షనేతలంతా ప్రజాస్వామ్య విలువల గురించి తెగ బాధపడిపోతూంటారు. కానీ, బిహార్‌లో వారూ వీరూ అని తేడాలేకుండా అన్ని పార్టీలూ పెద్దసంఖ్యలో కుటుంబీకులకే టిక్కెట్లు పంచాయి. ఈ విషయంలో కేంద్రమంత్రి, హిందుస్థానీ ఆవామీ మోర్చా అధినేత జితన్‌రామ్ మాంఝీ అగ్రస్థానంలో ఉన్నారట. సామాన్యుడిని అందలం ఎక్కిస్తానని, సాధారణ కార్యకర్తను మంత్రిని చేస్తానని ప్రతిజ్ఞలు చేసి, బిహార్ ఎన్నికల బరిలోకి దిగిన ప్రశాంత్ కిషోర్ సైతం రాజకీయకుటుంబాలనే నమ్ముకొని, వారసులకే టిక్కెట్లు పంచవలసి వచ్చిందట. పుత్రరత్నాలు, సతీమణులు, సన్నిహిత బంధువులతో బిహార్ ఎన్నికల క్షేత్రం కళకళలాడుతోంది.

బిహార్ ఎన్నికల్లో 'మహాగడ్బంధన్'లో భాగంగా తనకు సీట్లు కేటాయించకుండా, ఆర్జేడీ, కాంగ్రెస్ కుట్రపన్నాయనీ, ప్రతీకారంగా ఆరు స్థానాల్లో తాను ఒంటరిగా పోటీచేస్తానని ప్రకటించిన జార్ఖండ్ ముక్తి మోర్చా చివరకు బరిలో నుంచే తప్పుకుంది. ఇది కూడా, ఫ్రెండ్లీవార్‌లో భాగమేనన్న విశ్లేషణలను అటుంచితే, విపక్ష ఇండియా కూటమిలో లుకలుకలు, సీట్ల పంపకాల్లో విభేదాలు క్షేత్రస్థాయిలో ఏ విధమైన ప్రభావం చూపుతాయో తెలియదు. కూటమి ఐక్యతను పక్కనబెట్టి, ఆర్జేడీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు స్నేహపూర్వక పోటీలకు సిద్ధపడుతున్నాయి. అభ్యర్థుల జాబితాలను విడుదల చేయకుండా నేరుగా వారితో నామినేషన్లు వేయించడం వంటి విన్యాసాలకు ఆర్జేడీ పాల్పడింది. 'ఇండియా' కూటమిలో వైరాలు ఎన్డీయేకు ఉపకరించవచ్చునన్న విశ్లేషణలతో పాటు, ప్రశాంత్ కిషోర్ జన్‌సురాజ్ పార్టీ అధిక స్థానాలు నెగ్గకపోయినా, ఎన్డీయేకు అధికంగా నష్టంచేయవచ్చునన్న వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ఉద్యోగ ఉపాధులు, మౌలిక సదుపాయాలు ఎన్నికల్లో ముఖ్యమే అయినప్పటికీ, కులం అంతకంటే ప్రధానంగా పనిచేయడం బిహార్ ప్రత్యేకత. కేవలం ఐదునెలల్లో సంక్షేమం పేరిట ముప్పైవేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి, మరిన్ని వేలకోట్ల రూపాయల పథకాలు, ప్రారంభోత్సవాలు జరిపిన ఎన్డీయే ఈ మారు ఏ మేరకు లబ్ధిపొందుతుందో చూడాలి.

వ్యూహాత్మక స్వతంత్రతే భారత్ బాట



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు పిచ్చెక్కినట్లుంది..' అని ప్రపంచ వ్యాప్తంగా సంఖ్యానేకులు అభిప్రాయపడుతున్నారు. 30 ట్రిలియన్ డాలర్ల వార్షిక జీడీపీ ఉన్న అతిపెద్ద ఆర్థిక శక్తి అమెరికా. అంతేకాదు, అది అతిపెద్ద మిలటరీ సూపర్ పవర్ కూడా. పెంటగాన్ (అమెరికా రక్షణ మంత్రిత్వశాఖ నెలవు) ఆయుధాగారంలో వేలాది అణ్వస్త్రాలు ఉన్నాయి; అమెరికా యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు, నిత్యం ప్రపంచ మహాసముద్రాలలో నలుమూలలా సంచరిస్తుంటాయి; 70 దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలున్నాయి. గత ఏడాది అమెరికా తన సైనిక శక్తిపై వేయి బిలియన్ డాలర్లు ఖర్చుపెట్టింది. ప్రపంచ పటం నుంచి ఏ దేశాన్ని అయినా తుడిచిపెట్టగలిగిన శక్తి అమెరికాకు ఉన్నది. ఇంత మహాశక్తికి సర్వాధినేత అయిన అధ్యక్షుడు ట్రంప్ ఎంత బాధ్యతగా ఉండాలి?

రెండోసారి అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ ట్రంప్ స్థిమితం లేనట్లు మాట్లాడుతున్నారు. ఎవరు మిత్రులో, ఎవరు శత్రువో తేల్చుకోలేకపోతున్నారు. భారత్‌పై కక్షసాధింపుగా అన్నట్లు హెచ్–1బి వీసా, టారిఫ్‌ల విషయమై రకరకాల ప్రకటనలు గుప్పిస్తున్నారు. భారత్–పాక్ సంఘర్షణలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడ సంఘర్షణ తలెత్తినా అమెరికా తలదూరుస్తోంది. ప్రతి దేశానికీ సార్వభౌమాధికారం ఉంటుందన్న మాట మరిచి ఆయా దేశాల పక్షాన ట్రంప్ తానే ప్రకటనలు చేస్తున్నారు! ఆపరేషన్ సిందూర్ గురించి రకరకాల ప్రకటనలు చేసిన ట్రంప్ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని భారత్‌ను హెచ్చరించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు మానేస్తానని మోదీ తనకు హామీ ఇచ్చినట్లు కూడా ట్రంప్ తాజాగా ప్రకటించారు. అలాంటి హామీ ఏదీ తామివ్వలేదని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. అయినా భారత్‌పై టారిఫ్‌లు భారీ ఎత్తున పెంచక తప్పదని ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మొదట్లో ట్రంప్ మాటలకు విశ్వసనీయత ఉన్నదని భావించిన వారు సైతం ఇప్పుడు ఆయన అబద్ధాలు చెబుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ట్రంప్ ప్రకటనలను భారత్ ఏమీ లెక్కచేయనక్కర్లేదని భావిస్తున్నారు. చివరకు అమెరికా ప్రజలు కూడా ట్రంప్ వాచాలతకు విసుగు చెందుతున్నట్లు స్పష్టమవుతోంది. అమెరికా టెక్నాలజీ సంస్థలు కూడా ట్రంప్ హెచ్చరికలతో నిమిత్తం లేకుండా భారత్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి. వైజాగ్‌లో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని గూగుల్ సంస్థ నిర్ణయించడమే అందుకొక ఉదాహరణ. భారత్‌లో తన విస్తరణను నిలిపివేసే ప్రసక్తి లేదని ఆపిల్ సంస్థ కూడా ప్రకటించింది. ఈ సంస్థ గత ఆరు నెలల్లో భారతదేశం నుంచి 10 బిలియన్ డాలర్ల విలువైన ఐ ఫోన్లను ఎగుమతి చేసింది. నేతల విశ్వసనీయత, పెట్టుబడులకు లభించే ఆదరణ, ఫలితాలను బట్టి పారిశ్రామిక సంస్థలు నిర్ణయాలు తీసుకుంటాయి కాని, ఉత్తుత్తి బెదిరింపులకు అవి లొంగే అవకాశాలు తక్కువ. మార్కెట్ చలన సూత్రాలు వేరుగా ఉంటాయని వేరే చెప్పనక్కర్లేదు. ఈ పండుగ రోజుల్లో భారతీయులు దాదాపు రూ. 6 లక్షల కోట్లకు పైగా సరుకులు, సేవలకోసం ఖర్చు పెట్టడమే భారతదేశంలో పెరుగుతున్న మార్కెట్ శక్తికి నిదర్శనం.

అయినా ట్రంప్ ప్రకటనలను తప్పనిసరైతే ఖండించడం తప్ప ఆయనపై వ్యక్తిగతంగా పరుష విమర్శలు చేయకూడదని భారత్ వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది. భారతదేశ వ్యతిరేక ప్రకటనలు ట్రంప్ ఎన్ని చేసినా ఆయన తనకు 'మంచి స్నేహితుడు' అని మోదీ అభివర్ణిస్తున్నారు. నిజానికి ట్రంప్ ప్రకటనల వల్ల భారతీయుల ఆత్మాభిమానం ఎక్కువగా దెబ్బతిన్నట్లు కనపడుతోంది. దానివల్ల మోదీకి ప్రయోజనమే కాని నష్టం వచ్చే అవకాశాలు తక్కువ. ట్రంప్‌ను నేరుగా మోదీ ఎందుకు ఢీకొనడం లేదు? 'ప్రస్తుతానికి మౌనం వహించడం మినహా మనకు వేరే గత్యంతరం లేదు. అదే సరైన దౌత్యనీతి..' అని మన విదేశాంగశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. 'యుద్ధం చేయకుండానే ప్రత్యర్థిని తగ్గేలా చేయడం ఒక అద్భుత కళ' అని చైనా సైనిక వ్యూహకర్త సు జు తన 'ద ఆర్ట్ ఆఫ్ వార్'లో సూచించారు. వ్యక్తులతో నిమిత్తం లేకుండా అమెరికా లాంటి మహాశక్తి భారతదేశం వైపు ఉండడం, దాన్ని శత్రువుగా మార్చుకోకపోవడం అనేది అవసరం అని మన నాయకులు గ్రహించినట్లున్నారు.

నిజానికి నరేంద్రమోదీ అమెరికాను భారత్‌కు సహజ మిత్రదేశంగా భావించారు. తాను తూర్పు తీరం నుంచి చూస్తే అమెరికా పశ్చిమ తీరం కనపడుతోందని, ఇరు దేశాలు ఒకే సువిశాలమైన ప్రాంతంలో భాగమని, తమ మధ్య స్నేహం ఇరు దేశాలకే కాక ప్రపంచ భవిష్యత్తుకు కూడా ఎంతో మంచిదని మోదీ 2014లోనే 'ఇండో–అమెరికా సీఈఓల ఫోరమ్'లో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంతకాలం అమెరికాను తన అభివృద్ధి అజెండాలో సహాయకారిగానే భావించింది. మోదీ అధికారంలోకి రాగానే అమెరికాను తన హిందూ వ్యూహాత్మక అజెండాలో భాగంగా భావించారు. ప్రపంచ అగ్రరాజ్యంగా ఎదిగేందుకు భారత్‌కు అమెరికా అండ దోహదం చేయగలదని ఆయన ఆలోచించారు. ట్రంప్ ఎలుగెత్తుతోన్న 'అమెరికా ఫస్ట్' సిద్ధాంతానికి తన 'భారత్ ఫస్ట్' నినాదం తోడవుతుందని మోదీ అనుకున్నారు. ట్రంప్‌ను రెండోసారి గెలిపించేందుకు

మొదటిసారి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు భారత్‌కు అనుకూలంగా ఉన్న ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఎందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు? జో బైడెన్ అధికారంలో ఉన్నప్పుడు ట్రంప్‌ను మోదీ విస్మరించారని, ఈ విషయంలో మన విదేశాంగ శాఖ ఆయనకు సరైన సలహాలనివ్వలేకపోయిందని దౌత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అమెరికా ప్రయోజనాలనే ధ్యేయంగా పెట్టుకోవాలని ట్రంప్ నిర్ణయించుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. అదే జరిగితే భారత్‌తో పాటు అనేక దేశాలు తమ విదేశాంగ విధానాన్ని మార్చుకోవడం అనివార్యమవుతుంది.



పనిగట్టుకుని ప్రచారం చేశారు. అమెరికాలో ఉన్న ప్రవాస భారతీయులు పూర్తిగా ట్రంప్ వైపు మొగ్గేలా చేశారు. మోదీ ఇలా ట్రంప్‌ను పూర్తిగా విశ్వసించేందుకు ఎన్నో కారణాలున్నాయి.

ప్రధానంగా పాకిస్థాన్, చైనా విషయంలో భారత్ వైఖరితో ట్రంప్ తొలుత ఏకీభవించారు. తన ఎన్నికల ప్రచారంలో ఇస్లామిక్ తీవ్రవాదాన్ని, చైనా విస్తరణ వాదాన్ని ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. అంతకు ముందు న్యూఢిల్లీ ఎన్ని ఫిర్యాదులు చేసినా ఉగ్రవాద బృందాలకు ఇస్లామాబాద్ మద్దతు గురించి వాషింగ్టన్ పట్టించుకునేది కాదు. జియా ఉల్ హక్ పాక్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అమెరికా నుంచి లభించిన ఆర్థిక సహాయమే ఆ దేశంలో తీవ్రవాదాన్ని పెంచి పోషించింది. 1990 దశకం ప్రథమార్థంలో ముంబైను అతలాకుతలం చేసిన దాడుల్లో లభ్యమైన బాంబులు పాక్‌లో తయారైనవని ఆధారాలు సమర్పించినా అమెరికా విస్మరించిందని అప్పటి హోంసెక్రటరీ పద్మనాభయ్య చెప్పారు. పాక్ అణుశాస్త్రవేత్తలు యురేనియంను స్మగుల్ చేసి అణుబాంబు తయారీ చేశారని తెలిసినా అమెరికా పట్టించుకోలేదని మాజీ విదేశాంగమంత్రి జస్వంత్‌సింగ్ తన 'A call to Honour'లో రాశారు. ఇస్లామిక్ తీవ్రవాదంపై పోరు విషయంలో భారత్, అమెరికా, ఇజ్రాయెల్ సహజ మిత్రులని జస్వంత్‌సింగ్ నాటి అమెరికా విదేశాంగశాఖ సహాయ మంత్రి స్ట్రోబ్ టాల్బోట్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని టాల్బోట్ తన పుస్తకం 'ఎంగేజింగ్ ఇండియా'లో వివరించారు. భారత్ అమెరికా స్నేహసంబంధాలు వాజపేయి హయాంలో గణనీయంగా మెరుగయ్యాయి. భారత్ అణు వాణిజ్యానికి చైనా అడ్డుపడకుండా చేసిన అమెరికా కార్గిల్ ఘర్షణను భారత్‌తో సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి చేసింది. అయితే 2001 సెప్టెంబర్ 11న న్యూయార్క్‌లో ఉగ్రవాద దాడుల తర్వాత అమెరికా వైఖరి క్రమంగా మారిపోయింది.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా విదేశాంగ విధానమే భారతదేశ విదేశాంగ విధానమా అన్నట్లు మోదీ వ్యవహరించారు. ఇరుగు పొరుగు దేశాల ప్రభుత్వాధినేతలను తొలుత తన ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించి స్నేహ హస్తం చాచిన మోదీ ఆ తర్వాత ట్రంప్‌తో స్నేహం చేస్తే తనకు తిరుగుండదని భావించారు. మోదీ ప్రధాని అయిన కొత్తలో భారతదేశంలో పర్యటించిన బరాక్ ఒబామా మన దేశానికే మన రాజ్యాంగం గురించి గుర్తు చేశారు. అమెరికా రాజ్యాంగాన్నే పెద్దగా పట్టించుకోని ట్రంప్ మోదీ ప్రభుత్వ జాతీయవాద అజెండాను బలపరిచారు. భారత్ కూడా అనేక అంతర్జాతీయ వేదికలపై అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా, చైనాకు వ్యతిరేకంగా వ్యవహరించింది.

మొదటిసారి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు భారత్‌కు అనుకూలంగా ఉన్న ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఎందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనేది ట్రిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ మధ్య కాలంలో డెమొక్రాటిక్ పార్టీకి చెందిన జో బైడెన్ అధికారంలో ఉన్నప్పుడు ట్రంప్‌ను మోదీ విస్మరించారని, ఈ విషయంలో మన విదేశాంగ శాఖ ఆయనకు సరైన సలహాలనివ్వలేకపోయిందని తలపండిన దౌత్య దురంధరులు అభిప్రాయపడుతున్నారు. విచిత్రమేమంటే ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా విదేశాంగ విధానం పూర్తిగా అస్తవ్యస్తమైనట్లు కనపడుతోంది. పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదని తెలిసినా భారత్ వైఖరికి భిన్నంగా ఆ దేశాన్ని ప్రోత్సహించడం ఆశ్చర్యకరం. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్‌కు అమెరికా గానీ ఇజ్రాయిల్ గానీ మద్దతునివ్వలేదు. పైగా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదని ప్రపంచ దేశాలకు వివరించాల్సిన పరిస్థితి మనకు ఏర్పడింది. అంటే పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్లే అన్నట్లుగా మారింది. విడ్డూరమేమిటంటే అమెరికా ఒకవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దని భారత్‌ను హెచ్చరిస్తూనే మరోవైపు పుతిన్‌తో స్నేహం చేయమని ఉక్రెయిన్ అధ్యక్షుడిని బలవంతం చేస్తోంది. నిన్నమొన్నటి వరకూ చైనా విస్తరణ వాదాన్ని అడ్డుకున్న అమెరికా ఇప్పుడు జీ2 పేరిట చైనాకు స్నేహహస్తం అందిస్తోంది. యూరోపియన్, ఆసియన్ మిత్రపక్షాలకు చేసిన వాగ్దానాలను విస్మరిస్తోంది. అమెరికా తన ప్రయోజనాలనే ధ్యేయంగా పెట్టుకోవాలనే 1823 నాటి జేమ్స్ మన్రో (అమెరికా ఐదవ అధ్యక్షుడు) సిద్ధాంతాన్ని అనుసరించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. అదే జరిగితే భారత్‌తో పాటు అనేక దేశాలు తమ విదేశాంగ విధానాన్ని మార్చుకోవడం అనివార్యమవుతుంది. ఏ దేశంతోను పూర్తిగా అంటకాగకుండా వ్యూహాత్మక స్వతంత్రతను అవలంబించడమే భారత్‌కు ఎప్పటికైనా శ్రేయస్కరం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఆదివాసీ విప్లవ పోరాట జ్వాల

అడవితల్లి ముద్దుబిడ్డలైన ఆదివాసీలు బుక్కెడు బువ్వ కోసం, భూమి కోసం ఆరాటపడుతుంటే చలించిపోయి... వారి హక్కుల కోసం, జల్–జంగిల్–జమీన్ కోసం తెల్లదొరలపైనా, నల్లదొరలపైనా, నైజాం సర్కార్‌పైనా సమరశంఖం పూరించిన గోండ్ పోరాట యోధుడు కొమరం భీమ్. గిరిజనేతర అస్తిత్వం దోపిడీపైనా, గిరిజనేతర సామ్రాజ్యవాదంపైనా పోరాడి బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరజీవి అయ్యారు.

దేశంలో, రాష్ట్రంలో చరిత్ర పరిణామ క్రమంలో ఆధిపత్యం అణచివేతకూ వ్యతిరేకంగా సంప్రదాయకమైన ఆయుధాలు చేపట్టి... సాయుధ పోరాటాల ద్వారానే స్వయంపాలన వస్తుందని దృఢంగా నమ్మి, నాటి నుంచి నేటి వరకు ఆదివాసీలు చేస్తున్న పోరాటాల చరిత్ర ఘనమైనది. 1240–1749 మధ్య కాలంలో స్వేచ్ఛగా విలసిల్లిన గోండ్వానా రాజ్యాలు ఆంగ్లేయుల రాకతో విచ్ఛిన్నమయ్యాయి. ఆదివాసీల జీవన విధానం, అస్తిత్వం దెబ్బతిన్నది. 1836 నుంచి 1860 వరకు రాంజీ గోండ్ నాయకత్వంలో ఆదివాసీలు వీరోచితంగా పోరాడారు. ఆ పోరాట వారసత్వంగా ఆదిలాబాద్ అడవితల్లి ఒడి నుంచి ఆవిర్భవించిన ఆణిముత్యం, ఆదివాసీ విప్లవ పోరాట జ్వాల కొమరం భీమ్. 1900, అక్టోబరు 22న ఆదిలాబాద్ జిల్లాలో జన్మించారాయన. ఆంగ్లేయులు, నైజాం నవాబులు కొనసాగిస్తున్న దోపిడి, దుర్మార్గాలు, అరాచకాలు, అణచివేతకు వ్యతిరేకంగా ఆసిఫాబాద్ పరిసర 50 ఆదివాసీ గ్రామాలలో యువకులను కూడగట్టి గెరిల్లాసైన్యం ఏర్పాటు చేశారు. జోడేఘాట్ కేంద్రంగా నిజాం సైన్యంపై గెరిల్లా యుద్ధం చేశారు. 1940 సెప్టెంబర్ ఒకటిన రాత్రివేళ కొండలలో నిజాం సైన్యంతో వీరోచితంగా పోరాడారు. ఆ పోరాటంలో వెన్నుపోటు రాజకీయాల ద్వారా దొంగదెబ్బ తీసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కొమరం భీమ్‌ను నిజాం సైనికులు కాల్చి చంపారు. ఆయన వీర మరణం పొంది, నేడు ఆదివాసీ అస్తిత్వ ఆత్మగౌరవ ఉద్యమాలకు ఊపిరిగా నిలుస్తున్నారు. ఆయన వర్ధంతిని ఆదిలాబాదు నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న ఆదివాసీలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తారు. స్వయంపాలన ఉద్యమాల కోసం ఆదివాసీలను మేల్కొలిపి, సామాజిక న్యాయం కోసం సమరశంఖం పూరించి, ఆదివాసీ అస్తిత్వ ఉద్యమాలకు ప్రాణం పోసిన వ్యక్తి కొమరం భీమ్.



నీళ్లు, నియామకాలు, నిధులు, స్వయంపాలన, ఆత్మగౌరవంతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఆదివాసీలకు స్వయంపాలన కల్పించాలనే కొమరం భీమ్ ఆశయాన్ని నేటి పాలకులు పట్టించుకోవడం లేదు. 5వ షెడ్యూల్ ద్వారా రాజ్యాంగ విరుద్ధంగా ఆదివాసీ భూభాగాన్ని ఆంధ్ర, తెలంగాణగా విభజించటమే కాక; జిల్లాల పునర్విభజన పేరుతో ఆదివాసీ ప్రాంతాలనూ మైదాన ప్రాంతాలలో కలిపి ఆదివాసీల అస్తిత్వాన్ని పాలకులు దెబ్బతీసారు. హరితహారం పేరుతో ఆదివాసీల భూములను బలవంతంగా లాక్కొని, వాటిలో మొక్కలు నాటి, ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారు. తెలంగాణలో సాదాబైనామా కోసం జీవో 53 తీసుకువచ్చి, ఏజెన్సీలో 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసి, ఆదివాసుల భూములను గిరిజనేతరులకు దోచిపెట్టడానికి కుట్రలు పన్నుతున్నారు.

గిరిజనేతర సామ్రాజ్యవాదం నేడు దేశంలో, దండకారణ్యంలో, రాష్ట్రంలో, జిల్లాల్లో అడుగుబెట్టి ఆదివాసీ ప్రాంతాలలో ఉన్న సహజ వనరులు, ఖనిజ సంపదనూ దొడ్డిదారిలో దోచుకుంటున్నారు. దండకారణ్యంలో ఆదివాసీలపై నరమేధం కొనసాగుతోంది. ఆదివాసీ మహిళలపై అంతులేని అత్యాచారాలు కొనసాగుతున్నాయి. ఆదివాసీ ప్రజాప్రతినిధులు గిరిజనేతర రాజకీయ పార్టీలలో కీలుబొమ్మలుగా మారారు. ఏజెన్సీలో ఆదివాసీలను దోపిడీ చేస్తూ వారిపై పెత్తనం చెలాయిస్తున్న గిరిజనేతరులు... నేడు ఆదివాసీల రిజర్వేషన్స్ కబ్జా చేయాలని కుట్రలు పన్నుతున్నారు. మరోవైపు చెల్లప్ప కమిషన్ ద్వారా మరో మూడు కులాలను ఎస్టీ జాబితాలో కలిపి, ఆదివాసులను నిర్వీర్యం చేస్తున్నారు. దేశంలో ఏజెన్సీ ఏరియాలో ఉన్న గిరిజనేతరులు ఆదివాసీల రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తూ వారిపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. దీనికి రాజకీయ పార్టీలు కూడా మద్దతు తెలుపుతున్నాయి. ఆదివాసీల జీవన విధానం విధ్వంసమవుతున్నా ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు, మేధావులు నోరు మెదపటం లేదు.

ఏజెన్సీలో గిరిజనేతరుల ఓటు హక్కు రద్దు చేయాలి, వారి వలసలు అరికట్టాలి. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలనూ తొలగించాలి. ఐటీడీఏలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలి. ఇందులో అటెండరు నుంచి ఐఏఎస్ వరకు ఆదివాసీలనే నియమించాలి. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పీసా చట్టాన్ని, జీవో నెం.3ని పకడ్బందీగా అమలు చేయాలి. ఏజెన్సీలో పోలీస్ శాఖనూ ఐటీడీఏ నియంత్రణలోకి తీసుకురావాలి. ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి. ఏజెన్సీలో ఆదివాసీలు సాగుచేస్తున్న పోడుభూములకు పట్టాలు ఇవ్వాలి. అలాగే గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. పై డిమాండ్స్ సాధన కోసం కొమరం భీమ్ స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆయన కలలు కన్న ఆదివాసీల స్వయంపాలన సాధ్యమవుతుంది.

● వూకె రామకృష్ణ దొర

(నేడు కొమరం భీమ్ 125 జయంతి, ఖమ్మంలో విగ్రహావిష్కరణ)

పేదల పక్షపాతి

ప్రజలను పురుగుల్లా చూసే నాయకులు, అధికారులు ఉన్న ఈ రోజుల్లో ఎస్.ఆర్. శంకరన్ జీవితాన్ని గుర్తు చేసుకోవడం ఎంతయినా అవసరం. నిరుపేదల ఐఏఎస్‌గా పేరు తెచ్చుకొన్న ఆయన సేవలు అనితరసాధ్యమైనవి. బ్యూరోక్రాటిక్ అసాధ్యాలను సుసాధ్యం చేసిన ఆయన ప్రతిభ అద్వితీయమైనది. పేదల అభ్యున్నతి కొరకు 120 జీవోలను ఆయన రూపొందించి విడుదల చేశారు. తన కీలక నిర్ణయాలతో వ్యవస్థలో విశేషమైన మార్పులు తెచ్చారు. ప్రభుత్వ అధికార వ్యవస్థను ప్రజలకు చేరువ చేసిన ఆయన నిబద్ధత, కృషి అద్వితీయమైనవి. అందుకే ఆయన ఐఏఎస్ గాంధీగా ఖ్యాతికెక్కారు. కాలి నడకన సంచరిస్తూ, తన ఆత్మగౌరవాన్ని కాపాడుకొన్నారు. పద్మభూషణ్ పురస్కారాన్ని సున్నితంగా తిరస్కరించారు. వెట్టిచాకిరీ విధానం, సఫాయి కార్మిక వ్యవస్థల నిర్మూలనకు శంకరన్ విశేషంగా కృషి చేశారు.



తన జీవితం మొత్తం దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల సముద్ధరణకు పాటుపడ్డారు. వ్యక్తిగత జీవితం అంటూ లేకుండా పూర్తిగా సమాజానికే అంకితం అయ్యారు. విశ్రాంత జీవితంలో కూడా పేదలకు అండగా నిలబడ్డారు.

షార్ అంతరిక్ష కేంద్రాన్ని తమిళనాడులో నెలకొల్పడం కోసం తమిళ నాయకులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఒక తమిళుడైనా కూడా శంకరన్ ఆ కేంద్రాన్ని అప్పటి నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటకు తీసుకురావడానికి విశేషంగా కృషి చేశారు. నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడే, ప్రభుత్వ మహిళా కళాశాలకు స్వంత భవనాలు లేనందువల్ల కలెక్టర్ బంగ్లా అంత పెద్దది తనకెందుకని దానిలో అధిక భాగాన్ని కళాశాలకు కేటాయించారు. అలాగే శంకరన్ తన జీతంలో అధిక భాగం పేద ప్రజలకు పంచిపెట్టేవారు. వారు తనకెక్కడ కృతజ్ఞతాభావం చూపెడతారోనని, అవి ప్రభుత్వ డబ్బులని వారికి చెప్పేవారు. 'మీలాంటి వారికివ్వమని ప్రభుత్వం నా వద్ద కొంత డబ్బు ఉంచిందని వారితో నమ్మబలికేవారు, అదీ ఆయన వ్యక్తిత్వం. త్రిపుర ప్రధాన కార్యదర్శిగా నియమితులైనప్పుడు ఒక చిన్న సూట్‌కేస్‌తో అగర్తలా వెళ్ళి, రిక్షా ఎక్కి తన అధికార నివాసానికి చేరుకొన్నారు. ఘన్‌శ్యామ్ షా వెలువరించిన సంకలనంలో 'అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ది పూర్' అనే అధ్యాయాన్ని శంకరన్ రచించారు. 2010 అక్టోబర్ 7న ఆయన మరణించారు. 2011లో హైదరాబాద్‌లో ప్రభుత్వ సంక్షేమశాఖ కార్యాలయం ముందు ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. శంకరన్ విగ్రహాన్ని ఈ నెల 7వ తేదీన బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో కూడా ఆవిష్కరించారు. ఆశ్రిత పక్షపాతానికి ఇసుమంతైనా ఆస్కారం ఇవ్వకుండా అందర్నీ ఒకే విధంగా చూసిన సమదర్శి శంకరన్. ఆయన మానవీయ విలువలను ఆదర్శంగా తీసుకోవాలి. శంకరన్‌లోని సేవాతత్పరత, వినయశీలం, చిత్తశుద్ధి అలవర్చుకునే యత్నాలు ప్రారంభం కావాలి.

– పి.సి. సాయిబాబు

(నేడు శంకరన్ జయంతి)

వెన్నెల సునాదమే బాలసరస్వతి గానం

బాలమురళీకృష్ణ అసలు పేరు అది కాదు. మురళీకృష్ణ మాత్రమే! అలాగే బాలసరస్వతి అసలు పేరు కూడా అది కాదు. సరస్వతి మాత్రమే! ఎనిమిదేళ్ల వయసులో మురళీకృష్ణ సంగీత కచేరి చేసినప్పుడు శ్రోతలు పొంగెత్తిన మురళీగాన రసవాహినిలో లీనమైపోయారట. అదే సభలో ఉన్న ప్రసిద్ధ హరికథా విద్వాంసులు ముసునూరి సత్యనారాయణ గారు ముగ్ధులై 'బాలమురళీ' అని ముద్దుగా పిలిచి మూర్ధం ఆఘ్రాణించి ఆశీర్వదించారు. అప్పటి నుంచి ఆయనకు ఆ పేరు స్థిరపడిపోయింది. అలాగే సరస్వతి కూడా! ఆమెకు ఆరేళ్ల వయస్సున్నప్పుడు కె.సుబ్రహ్మణ్యం (ప్రముఖ నర్తకి పద్మాసుబ్రహ్మణ్యం తండ్రి) నిర్మించిన భక్త కుచేల, భక్త యోగిని చిత్రాలలో నటించి, ఆ చిత్రాలలో దాదాపు అన్ని పాటలూ పాడారు. సుబ్రహ్మణ్యం ఆమెని 'బాలసరస్వతి' అని ప్రేమగా పిలిచేవారట. అప్పటి నుంచి అందరూ అలానే పిలవటం మొదలుపెట్టారు. అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ అదే పేరు ఆమెకు.

మాటల మధ్యలో బాలసరస్వతి చెప్పారు, "మద్రాసు, విజయవాడ రేడియో స్టేషన్లలో నాతోనే లలిత సంగీతం మొదలైంది. ఎన్ని పాటలు పాడానో! మొదట్లో సంగీత దర్శకులు చెప్పినట్టు పాడినా తర్వాత తర్వాత నేను పాడవలసిన పాటలను నేనే స్వరపరచుకుని తిన్నగా రేడియో స్టేషన్‌కు వెళ్లి పాడేదాన్ని. నాకు శాస్త్రీయ సంగీతం పట్ల ఆసక్తి లేదు, అసలు ఇష్టమే లేదు. కాకపోతే క్లాసికల్ బేస్ ఉండాలని అందరూ చెప్పబట్టి మద్రాసులో అలత్తూరు సుబ్బయ్య గారి దగ్గర మూడేళ్లపాటు శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. బొంబాయిలో సినీ సంగీత దర్శకుడు వసంతదేశాయి వద్ద హిందుస్థానీ సంగీతం నేర్చుకున్నాను. మద్రాసులో ఉన్నప్పుడే పియానో, వీణ రెండూ నేర్చుకున్నాను. నా పాట బాగుంటుందని అందరూ అంటారు. ఎంత బాగుంటుందో నాకు తెలియదుగానీ ఒక విషయం మాత్రం చెప్పగలను. ఆరుద్ర, రజనీ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వింజమూరి శివరామారావు, సి.నారాయణరెడ్డి, సన్యాసిరాజు (ఎస్. రాజేశ్వరరావు సోదరుడు) ఇలా ఒకరా, ఇద్దరా ఎందరెందరో రాసిన పాటలు పాడాను. వాళ్ల సాహిత్యంలోనే సగం సంగీతం ఉండేది. ఆ పాటల్లోని భావం చెడకుండా శ్రోతల మనసుకు హత్తుకునేలా పాడాలని తాపత్రయపడేదాన్ని. పాట పాడే వారికి కవి భావనను పట్టుకోగల శక్తీ, నేర్పూ ఉండాలి" అన్నారు. ఎంత చక్కటి మాట!

బాలసరస్వతి పాట పాడుతూంటే ఎక్కడో ఏ వంపులోనో ఒక గమకంలోనో మాధుర్యం తొణికిసలాడటం కాదు. పాట మొత్తం నెత్తావులు చిమ్ముతుంది. 'ఆహా! ఏమి పాట' అని మురిసిపోతాం. మా సంభాషణ సాగుతూ ఉండగా 'టీ' వచ్చింది. 'ఆ! అన్నట్లు మీరూ రేడియో మనిషే కదూ! మీకో సంగతి చెప్పాలి. రేడియోలోకి నా ప్రవేశం ఎలా జరిగిందో చెబుతా. ఇల్లాలు అనే సినిమాలో నేనూ ఎస్. రాజేశ్వరరావు కలిసి నటించాం. మద్రాసు జెమినీ స్టూడియోలో రికార్డింగ్. అప్పుడే రేడియో స్టేషన్ నుంచి జనమంచి రామకృష్ణ, ఆచంట జానకిరామ్, ఎస్.ఎస్.మూర్తి వచ్చారు. రాజేశ్వరరావు నన్ను వారికి పరిచయం చేశారు. వారు నా పాట విని మెచ్చుకున్నారు. ఎస్.ఎస్.మూర్తి- నన్నూ, రాజేశ్వరరావునూ, మా వాద్య బృందాన్నీ జెమినీ స్టూడియో నుంచి తిన్నగా రేడియో స్టేషన్‌కు తీసుకువెళ్లి, నా చేత కొన్ని పాటలు పాడించి, వాటిని ప్రత్యక్ష ప్రసారం చేసారు. అలా రేడియో ఆర్టిస్ట్ అయ్యాను. నేను రేడియోలో పాడిన 'ఈ ప్రేమ ఎలా కలిగెనో నాలో, నల్లనివాడ నే గొల్ల కన్నెనోయి, ఈ చల్లని రేయి తిరిగి రానేరాదు, బంగారు పాపాయి, హాయమ్మహాయి' మొదలైన పాటలన్నీ గ్రాంఫోన్ రికార్డుగా కూడా వచ్చాయి.

"మా రోజుల్లో సినిమాల్లో కానీ రేడియోలో కానీ ఇప్పటిలా కాదు. సంగీత దర్శకులు, గాయనీ గాయకులు, వాద్య కళాకారులు అందరం కలిసి కూర్చుని ఒక్కో పాట పది పదిహేను రోజులు ప్రాక్టీస్ చేసేవాళ్లం. అందుకే ఆ పాటలు నిలబడ్డాయి. ఇప్పుడు కూడా నా పాటలు రేడియోలో వింటూ ఉంటాను" అన్నారు.

చాలా ఏళ్ల క్రితం ప్రసిద్ధ స్త్రీ వాద రచయిత్రి రంగనాయకమ్మ రేడియో కోసం బాలసరస్వతి గారిని ఇంటర్వ్యూ చేసారు. 'సంగీతపు లోతులు, అంచులు చూసిన మనిషిగా మీరు ఎప్పుడో పాడిన పాటలను ఇప్పుడు వింటున్నప్పుడు.. అయ్యయ్యో! ఈ పదం ఇలా పలకవలసింది, ఈ గమకం ఇలా అని ఉండవలసింది, ఇలా అని ఉంటే ఇంకా బాగుండేది' అనిపించిన సందర్భాలు ఉన్నాయా?... "చాలానే ఉన్నాయి".

'అవునూ, మీరు ఎప్పుడూ తక్కువ స్థాయిలోనే పాడతారు. ఎందుకనీ?'... "నాకు అలా పాడటమే ఇష్టం. అలవాటు కూడా! పై స్థాయిలో పాడితే స్వర లాలిత్యం పోతుందనుకునేదాన్ని. పైగా నేను ఎక్కువగా ప్రణయ గీతాలు – కృష్ణుడి మీద పాడాను. ప్రేమ సున్నితంగా నాజూకుగా ఉంటుంది. దాన్ని పొదివి పట్టుకోవాలని పిచ్చి కోరిక."

'ఆరుద్ర, రజనీ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వింజమూరి శివరామారావు, సి.నారాయణరెడ్డి, సన్యాసిరాజు... ఇలా ఒకరా, ఇద్దరా ఎందరెందరో రాసిన పాటలు పాడాను. వాళ్ల సాహిత్యంలోనే సగం సంగీతం ఉండేది. ఆ పాటల్లోని భావం చెడకుండా శ్రోతల మనసుకు హత్తుకునేలా పాడాలని తాపత్రయపడేదాన్ని. పాట పాడే వారికి కవి భావనను పట్టుకోగల శక్తీ, నేర్పూ ఉండాలి'



'1936లో మీరు సినీరంగ ప్రవేశం చేసారు. 1958 వరకూ మీరు నటించారు, పాడారు. తర్వాత అకస్మాత్తుగా తెరమరుగయ్యారు. కారణం ఏమిటి? ఆఫర్స్ రాకనా? ఆరోగ్యం సరిగా లేకనా?' అని రంగనాయకమ్మ అడిగితే, బాలసరస్వతి పేలవంగా నవ్వి "రెండూ కాదు. ఎంకరేజ్‌మెంట్ లేక. ఇంట్లో సందర్భాలు సరిగాలేక. ఎవరెంత గొప్ప కళాకారులైనా ఇంట్లో ప్రోత్సహించేవారుండాలి. సంగీతాన్ని ఆస్వాదిస్తూ, అనుభవిస్తూ, అభినందించేవారు ఉండాలి. అది లేకపోయింది నాకు. పైగా పాడరాదని నిర్బంధించారు. దానితో నేను మూగబోయాను" అన్నారు.

తర్వాత రంగనాయకమ్మ అడగవలసిన ప్రశ్నే అడిగారు. 'మీ వారిని ఎదిరించలేకపోయారా?'... "అప్పుడు నాకు అంత ధైర్యమూ, చొరవా, తెలివితేటలూ లేవు. బ్రతిమాలి భంగపడదలచుకోలేదు. మానేశాను" అన్నారు బాలసరస్వతి.

చివరిసారిగా ఆమె ఆకాశవాణి తునిలో, ఆహ్వానితుల సమక్షంలో ఏర్పాటు చేసిన సంగీత సభలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఆమె పాడలేదు. భర్త రాజా రావ్ ప్రద్యుమ్నకృష్ణ సూర్యారావు బహదూర్ మరణించాక ఆమె మళ్లీ మద్రాసు వెళ్లిపోయారు. 1974లో దర్శకులు రమేశ్‌నాయుడు, విజయనిర్మల పట్టుబట్టి 'సంఘం చెక్కిన శిల్పాలు' చిత్రంలో ఆమెతో ఒక పాట పాడించారు.

ఆమె పాట గురించి చెప్పాలంటే ఆమె కన్నా పై స్థాయి ఉండాలి. నాకు ఆ అర్హతలేదు. ఎప్పటికీ గుర్తుండిపోయే పాటలు పాడిన సంగీత రససరస్వతి 1928, ఆగస్టు 28న జన్మించారు. ఈ నెల 15న తొంభై ఏడేళ్ల వయసులో స్వర్గస్థులయ్యారు. వారికిదే అక్షర నీరాజనం.

■ ప్రయాగ రామకృష్ణ


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ఎన్.టి.ఆర్. జిల్లా వార్తలు

బుధవారం 22 అక్టోబరు 2025





ఇంటింటా దీపావళి

జిల్లాలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం ఉదయం నుంచే పండుగ సందడి మొదలైంది. గృహాలను అందంగా అలంకరించుకుని, వాహనాలను శుభ్రం చేసుకుని ప్రజలు భక్తితో లక్ష్మీదేవిని కొలిచారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాలుస్తూ సంతోషంగా గడిపారు. బాణసంచా వెలుగుల్లో ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ గుడి దేదీప్యమానంగా కాంతులీనింది. 6లో



రేపు గాజుల మహోత్సవం

ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గాజుల మహోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 23వ తేదీన వివిధ రంగుల గాజుల అలంకరణలో దుర్గమ్మ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయం మొత్తం గాజులతో అలంకరించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఈవో శీనానాయక్, చైర్మన్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో చేస్తున్నారు. 6లో

జరిమానాల మోత!

మల్లవల్లి పారిశ్రామికవాడలో ఏపీఐఐసీ అధికారుల అత్యుత్సాహం

పనులు చేపడుతున్న సంస్థలకు భారీ జరిమానాలు

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బంది పడ్డ సంస్థలపైనే భారం!
- బ్యాలెన్స్ పనులు పూర్తి చేస్తున్న 198 సంస్థలకు నోటీసులు
- ప్రోత్సాహకాలు అందించాల్సింది పోయి.. జరిమానాలేమిటని చర్చ
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బాధితులుగా మారిన పారిశ్రామికవేత్తల విషయంలో ఏపీఐఐసీ అధికారులు ఇంకా పాత వైఖరిని కొనసాగించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా సరే.. భారీగా జరిమానాలు విధించి వారిని వేధిస్తున్నారు. సంస్థలు తమకు ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ (ఈవోటీ) ఇవ్వాలని కోరుతుంటే అధికారులు మాత్రం మరింత భారం మోపుతున్నారు. దీంతో ఇప్పటికే పనులు ప్రారంభించి వివిధ దశల్లో ఉన్న వారికి అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఇప్పటికే పలు పరిశ్రమలు ఏర్పడ్డాయి. 198 ఎంఎస్ఎంఈ యూనిట్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ యూనిట్లన్నీ భూముల కోసం కాకుండా.. పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్న కోణంతోనే ఇక్కడికి వచ్చాయి. దురదృష్టం ఏమిటంటే.. ఈ 198 పారిశ్రామిక యూనిట్లు కూడా గత వైసీపీ ప్రభుత్వ హయంలో బాధిత సంస్థలుగా ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడులు పెట్టిన ఈ సంస్థలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీస సహకారం కూడా అందలేదు. ఏపీఐఐసీ అధికారులు ఈ సంస్థలకు అంతకు ముందుగానే రోడ్లు వేసి అప్పగించినా.. రైతుల ఆందోళనల కారణంగా పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యలను అప్పట్లో వైసీపీ ప్రభుత్వం పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. దీంతో రోడ్లు వేసినా వాటిని రైతులు అడ్డంగా తవ్వేయటం, అడ్డంకులను సృష్టించటం వంటి కారణాల వల్ల పనులను అనుకున్న సమయానికి పూర్తి చేయటంలో ఆయా సంస్థలు ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు పడిన ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావు. ఈ విషయం ఏపీఐఐసీ అధికారులకు కూడా తెలుసు. ఈవోటీ అంటే నిర్ణీత పనులు పూర్తి కావటానికి కొంత సమయం కోరటం. ఈవోటీ కోరటం తప్పు ఎలా అవుతుందో అధికారులే చెప్పాలి.

ఓ సంస్థకు రూ.50 లక్షల జరిమానా!

మధ్య తరహా పరిశ్రమల విషయంలో ఓ సంస్థకు రూ.50 లక్షల జరిమానా విధించారు. ఆ సంస్థ ఇప్పటికే మొత్తం ఐదు యూనిట్లకు గాను మూడు యూనిట్లను ఏర్పాటు చేసింది. నాలుగో యూనిట్‌కు సంబంధించి సివిల్ పనులు పూర్తయ్యాయి. ఐదో యూనిట్‌కు సంబంధించి ఎర్త్ వర్క్ జరుగుతోంది. ఇలాంటి పరిశ్రమకు తగినంత సమయం ఇస్తే ఆ సమయంలోపు మిగిలిన వాటిని కూడా పూర్తి చేసి ఉత్పాదకతను ప్రారంభిస్తుంది. ఉపాధి అవకాశాలు కూడా వస్తాయి. కానీ, ఆ సంస్థకు రూ.50 లక్షల జరిమానా విధిస్తే.. పనులు ఆశాజనకంగా ఉంటాయా అన్నది ఆలోచించాల్సిన విషయం. ఇదొక్కటే కాదు.. మిగిలిన 197 సంస్థల విషయంలో కూడా భారీగా జరిమానాలను విధిస్తూ ఏపీఐఐసీ అధికారులు నోటీసులను పంపుతున్నారు.

340 పరిశ్రమలకు కూటమి ప్రభుత్వంలో మళ్లీ అవకాశం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 340 మందికి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములను కేటాయించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వీరికి ఇచ్చిన భూముల ధరలను అమాంతం పెంచేసింది. పరిశ్రమలను పెట్టలేదన్న కారణంతో వాటి భూకేటాయింపులను కూడా తర్వాత రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. 340 పరిశ్రమలకు కూడా మళ్లీ అవకాశాన్ని కల్పించింది. రద్దు చేసిన భూకేటాయింపులను పునరుద్ధరించింది. పెంచిన భూముల ధరలను కూడా తగ్గించి రూ.16.50 లక్షలుగా నిర్ణయించింది. ఇంకా పరిశ్రమలు ఏర్పాటు చేయని వాటి విషయంలోనే వారికి ప్రోత్సాహకరంగా ఉంటున్నపుడు.. వైసీపీ హయాంలో బాధితులుగా ఉండి వివిధ దశలలో పనులు చేపట్టిన వాటి విషయంలో గడువులు పెంచితే తప్పేమిటో మిగతా 6లో..

అమరుల త్యాగాలను మరువలేం

- సీపీ రాజశేఖరబాబు
- ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

విజయవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను మరువలేమని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఎంజీ రోడ్డులోని మిగతా 6లో..



వ్యాస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ రాజశేఖరబాబు



ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్

- ముత్యాలంపాడులో ఐదు ఎకరాలు కేటాయింపు
- టెండర్లు పిలిచిన ఏపీఐఐసీ అధికారులు
- 27వ తేదీతో బిడ్స్‌కు తుది గడువు
- రూ.7.57 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భవనం
- సీఎం చేతుల మీదుగా నవంబరు రెండో వారంలో భూమి పూజ

6

టాస్క్ మారింది..!

- సీటీఎఫ్ నుంచి కానిస్టేబుల్‌కు స్థానచలనం
- జగ్గయ్యపేటకు బదిలీ
- ఎస్ఐపైనా బదిలీ వేటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌కు అత్యంత ప్రధానమైన విభాగంగా ఉన్న సీటీఎఫ్ (సిటీ టాస్క్ ఫోర్స్)ను ప్రక్షాళన చేయడానికి అధికారులు అడుగులు వేస్తున్నారు. ఆరోపణలు ఉన్న వారిని, వివాదాస్పదంగా ఉంటున్న వారిని అక్కడి నుంచి సాగనంపడానికి రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఒక కానిస్టేబుల్, ఒక ఎస్ఐపై వేటు వేశారు. సీటీఎఫ్‌లో పనిచేస్తూ ఆరోపణలు ఎదుర్కొని బదిలీ అయిన కానిస్టేబుల్ తిరిగి ఇక్కడికి వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో 19వ తేదీన 'టాస్క్ పూర్తి చేశాడు..!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు పూర్తి స్థాయిలో విచారణ చేశారు. లోగడ జరిగిన విషయాన్ని మొత్తం తొక్కిపెట్టి అధికారులను తప్పుదోవ పట్టించినట్టు తెలిసింది. దీనిపై సీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కానిస్టేబుల్‌ను సీటీఎఫ్ మిగతా 6లో..

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



భూక్యా సక్రు (ఫైల్)

మైలవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. మైలవరం ఎస్సై కె.సుధాకర్ కథనం ప్రకారం.. మండలంలోని సీతారాంపురం తండాకు చెందిన భూక్యా సక్రు(55) వడ్డీకి నగదు తెచ్చి మిర్చి పంట సాగు చేశాడు. గత రెండేళ్లుగా నష్టాలు వచ్చాయి. అప్పు తీర్చకపోవడంతో వడ్డీ వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో భార్య లక్ష్మికి బయటకు వెళ్లి వస్తానని చెప్పిన సక్రు, గ్రామ శివారులోని బెండ తోటలో మద్యం సీసాలో పురుగు మందు కలుపుకుని తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరాచకాల కొండ!

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి తీరుపై విమర్శలు

- అనధికారికంగా విదేశీ పర్యటనలు
- మర్నాడు విధులకు ముందురోజే సంతకాలు
- వ్యాపార వర్గాల నుంచి మామూళ్లు వసూలు
- తోటి ఉద్యోగులపై వేధింపులు
- సబార్డినేట్ కొండపల్లి శ్రీనివాసరావు అరాచకాలు వెలుగులోకి..



కొండపల్లి శ్రీనివాసరావు

కొండపల్లి శ్రీనివాసరావు... ఈ పేరు బయటి ప్రపంచానికి పెద్దగా తెలియకపోవచ్చు. వాణిజ్య పన్నుల శాఖలో అధికారులు, సిబ్బంది, వ్యాపార వర్గాలకు మాత్రం బాగా తెలుసు. అవినీతికి ఈ పేరు ఒక బ్రాండ్. కొంతమంది అధికారులకు బాగా ఇష్టమైన పేరు కూడా. ఇటీవల ఏసీబీ అధికారులకు చిక్కిన సబార్డినేటే ఈ కొండపల్లి శ్రీనివాసరావు. లంచాల కోసం వ్యాపార వర్గాలను పీడించాడు. తాను ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టుగా సాగడానికి అధికారుల పేర్లు ఉపయోగించి తోటి ఉద్యోగులను సైతం వేధించాడు. ఇంతకాలం గోప్యంగా ఉన్న కొండపల్లి శ్రీనివాసరావు ఆగడాలు, చేష్టలు తాజాగా ఆయన ఏసీబీకి చిక్కిన తర్వాత ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పైఅధికారులు చెప్పిన పని కింది స్థాయి ఉద్యోగులు చేస్తుంటారు. వాణిజ్య పన్నుల శాఖలో మాత్రం పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. సబార్డినేట్‌గా ఉన్న కొండపల్లి శ్రీనివాసరావు ఏ పని చెప్పినా కొంతమంది అధికారులు ఎలాంటి ఆలోచన లేకుండా చేసి పెట్టారని ఆ శాఖ మొత్తం చెప్పుకుంటున్నారు.

అనధికార విదేశీయానాలు


కొండపల్లి శ్రీనివాసరావు కుమారుడు, కుమార్తె విదేశాల్లో ఉంటున్నారు. ఒకరు ఇంజనీరింగ్, మరొకరు మెడిసిన్ చదువుతున్నారు. వారి వద్దకు శ్రీనివాసరావు ఏడాదిలో రెండు సార్లు వెళ్లి వస్తుంటారు. దీనికి ఉన్నతాధికారుల అనుమతులు ఉండవు. అలాగని వారికి సమాచారం ఉండదు. నిబంధనల ప్రకారం ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి విదేశాలకు వెళ్లేటప్పుడు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ఆ పర్యటనకు మిగతా 6లో..

వాయుగండం!

- రెండు రోజులపాటు దక్షిణ కోస్తాతీరం వెంబడి భారీవర్షాలు
- బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కేంద్రీకృతం
- ఆరెంజ్ అలర్ట్ జారీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా వాసులను వాయుగుండం వణికిస్తోంది. సముద్ర నీటిమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తున బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి మరింతగా బలపడటంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మంగళవారం పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం నాటికి అల్పపీడన ద్రోణి మరింతగా బలపడి వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. వాయుగుండం ప్రభావంతో దక్షిణ కోస్తాతీరం వెంబడి రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఈ నెల 25వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసింది.






చీకటి వెలుగుల రంగేళి

- అంబరాన్నంటిన దీపావళి సంబరాలు
- ప్రత్యేక పూజలందుకున్న లక్ష్మీదేవి
- అర్ధరాత్రి వరకు విరామం లేని టపాకుల మోత

విజయవాడ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. అశ్వయుజ అమావాస్యను హైందవ సంప్రదాయం ప్రకారం ప్రజలు శ్రద్ధాభక్తులతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే నగరంలో పండుగ వాతావరణం కనిపించింది. గృహాలను అందంగా అలంకరించుకుని ప్రజలు భక్తితో లక్ష్మీదేవిని కొలిచారు. పండుగను పురస్కరించుకుని పలువురు కొత్త వాహనాలను కొనుగోలు చేశారు.

మిన్నంటిన సంబరాలు

ఉదయం పూజల్లో నిమగ్నమైన ప్రజలు.. సాయంత్రం టపాకులతో సందడి చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి నగరంలో బాణాసంచా మోత మొదలైంది. పండుగకు రెండు రోజులు ముందు శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. పండుగ రోజున కూడా కురుస్తుందని భావించినా పడలేదు. అశ్వయుజ అమావాస్య రోజున వర్షం కురవడమనేది సర్వసాధారణం. ఈ ఏడాది వర్షం రెండు రోజులు ముందే కురిసి, పండుగ రోజున విరామం ఇచ్చింది. దీంతో ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకున్నారు. పూర్తిగా పొడి వాతావరణం నేపథ్యంలో సూర్యాస్తమయం నుంచే టపాకులను ప్రజలు బయటకు తీశారు. ఆమావస్య చీకట్లను చీల్చే వెలుగులను వీధుల్లో నింపారు. నగరంలోని ప్రధాన రహదారులన్నీ బాణాసంచా శబ్దంతో మారుమోగాయి. అంతర్గత రహదారులన్నీ టపాసుల కాంతులతో నిండిపోయాయి. మతాబులు, సిసింద్రీలు, చిచ్చుబుడ్డీలు, భూ చక్రాలు, అగ్గిపెట్టెలు, పాము బిల్లలతో చిన్నారులు సరదాను ప్రదర్శించగా, లక్ష్మీ అవుట్‌లు, 500, 1000, 2000, 5000 వాలా, క్రాకర్స్‌తో యువత హల్‌చల్ చేసింది. 60, 120 షార్ట్స్ నగరంపైకి ఎరుగుతూ ఆకాశానికి రంగులద్దాయి. వ్యాపారస్తులు సాయంత్రం దుకాణాల వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి టపాకులు కాల్చారు. ఆలయాల వద్ద సైతం బాణాసంచా భారీగానే మోగింది.

దుర్గగుడిలో దీపావళి వేడుకలు

ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో సోమవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం చుట్టూ, ఉపాలయాల వద్ద దీపాలను వెలిగించారు. ప్రధాన ఆలయం వెలుపలి గోడల్లో ఉన్న అష్టలక్ష్మిల విగ్రహాల వద్ద దీపాల కాంతి మెరసింది. దివ్యజ్యోతులు కాంతిని విస్తరింపజేశాయి. పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దుర్గగుడి ఈవో శీనానాయక్ తమ కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం సంయుక్తంగా దీపాలను వెలిగించి బాణసంచా కాల్చారు. స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, సిబ్బంది పాల్గొన్నారు. రాజగోపురానికి ప్రత్యేక విద్యద్దీప లతలను ఏర్పాటు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం దీపాల శోభతో ప్రత్యేకంగా కనిపించింది. అమావాస్య సందర్భంగా సోమవారం సాయంత్రం 7 గంటల తరువాత ఆలయాన్ని మూసివేశారు. మంగళవారం వేకువజాము నుంచి యథావిధిగా ఆలయ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అర్చనలు. అభిషేకాదులు నెలరోజుల పాటు కొనసాగనున్నాయి.



ఆకాశదీపం ప్రారంభం..

కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా దుర్గగుడిలో మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆకాశదీపాన్ని వెలిగించారు. పాలకమండలి చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ పాల్గొని ఆకాశ దీపానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిరోజూ నెల పాటు ఆకాశదీపాన్ని వెలిగించనున్నారు. దీన్ని దర్శించుకున్నవారికి అనంత శుభఫలితం కలుగుతుందని నమ్మిక. పాలక మండలి సభ్యులు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

దుర్గాఘాట్‌లో భక్తుల భద్రతకు ఏర్పాట్లు

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భక్తులు దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. కార్తీకమాసం మొదటిరోజు బుధవారం నుంచి ప్రారంభం కావటంతో ఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది. అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టారు. నదిలో భక్తులు పుణ్యస్నానాలాచరించేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. దుర్గాఘాట్ నుంచి అండర్ పాస్ మార్గంలో విద్యుత్ లైట్లు, లైట్స్ ఏర్పాటు చేశారు. దుస్తులు మార్చుకునేందుకు రెండు గదులు, లగేజీ, పాదరక్షలు, సెల్‌ఫోన్‌లు భద్రపరచుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. టాయిలెట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం ఈవో వీకే శీనానాయక్ దుర్గాఘాట్‌కు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ ఇంట హరిత దీపావళి

కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి కలెక్టర్ విడిది కార్యాలయంలో హరిత దీపావళితో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. కలెక్టర్ లక్ష్మీశ, కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు దీపకాంతుల వెలుగులో పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పర్యావరణహిత దీపావళిని జరుపుకొంటూ ఆదర్శవంతంగా నిలిచారు. పర్యావరణ పరిరక్షణకు, మానవ ఆరోగ్యానికి రెండింటికీ స్వచ్ఛమైన గాలి అవసరమని, వాయు కాలుష్యాన్ని కట్టడి చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అధికారులు పర్యావరణానికి హాని కలిగించే టపాసులకు దూరంగా ఉండాలని, తాను కూడా హరిత దీపావళిని జరుపుకుంటానని ఇటీవల క్లీన్ ఎయిర్ ఇతివృత్తంతో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం హరిత దీపావళిని జరుపుకొని ఆదర్శంగా నిలిచారు.

చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు భయపడొద్దు

- చిన్నారి సహస్రను పరామర్శించిన కలెక్టర్ లక్ష్మీశ

పెనుగంచిప్రోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు భయాపడల్సిన అవసరం లేదని జిల్లా అధికార యంత్రాగం పటిష్ఠంగా పనిచేస్తోందని కలెక్టర్ లక్ష్మీశ భరోసా ఇచ్చారు. రెండు రోజుల క్రితం వైరల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది సురక్షితంగా ఇంటికి చేరిన చిన్నారి చిట్టిమళ్ల గీతా సహస్రను మంగళవారం ఉదయం కలెక్టర్ లక్ష్మీశ పరామర్శించి ఆమె తల్లిదండ్రులను కలిసి వివరాలు అడిగి ధైర్యం చెప్పారు. సహస్రకు వచ్చింది చిన్న ఆరోగ్య సమస్యని సోషల్ మీడియాలో కొంతమంది అవగాహన లోపంతో పెద్ద వ్యాధిగా ప్రచారం చేశారన్నారు. అయినా 3 రోజులుగా వైద్యారోగ్య, రెవెన్యూ, పంచాయితీ రాజ్ శాఖలు సయుక్తంగా సమర్థవంతంగా సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. గ్రామంలో శానిటేషన్ బాగానే ఉన్నా ఇంకా సమర్థవంతంగా నిర్వహించాలని సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ కుమార్‌కు సూచించారు. మరో 24 గంటల పాటు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలని అధికారులకు సూచించారు. మంచినీటి ట్యాంక్ వద్ద కలెక్టర్ పరిశీలించి ప్రజలకు పంచాయతీ ద్వారా సరఫరా చేసే మంచినీటిని పరీక్ష చేశారు. ఖాళీస్థలాల్లోని చెత్తాచెదరాలను తొలంచాలని యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో మరో డాక్టర్ ఉండాలని, ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో పేద ప్రజలకు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 23న ఎస్పిరేషనల్ బ్లాక్ మండలం ఉన్న పెనుగంచిప్రోలులో కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఐఏఎస్ అధికారి పర్యటిస్తారని వారికి మండలానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని తహసీల్దార్ శాంతి లక్ష్మీకి సూచించారు. ప్రభుత్వమే బస్తాలను ఉచితంగా అందజేస్తుందని, ఈ విషయం రైతులకు తెలపాలని డీపీఏ భవానికి సూచించారు. నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, తహసీల్దార్ శాంతి లక్ష్మీ, ఎంపీడీవో శ్రీను, డిప్యూటి ఎంపీడీవో కేవీ సుబ్బారావు, సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, పంచాయతీ రాజ్ ఏఈపీ సుందర్‌రామయ్య, ఎంఈవోడీ రవీందర్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సహస్రకు హాయ్ చెబుతున్న కలెక్టర్

తిరుపతమ్మ సేవలో కలెక్టర్..

తిరుపతమ్మ అమ్మవారిని కలెక్టర్ లక్ష్మీశ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా రాజగోపురం వద్ద ఆయనకు అవో కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు అర్చకులు, వేద పండితులు, ప్రధాన అర్చకులు మర్రిబోయిన గోపి బాబు ఆధ్వర్యంలో అశీర్వచనం చేశారు. ఈవో కిషోర్ కుమార్ కలెక్టర్‌కు స్వామి శేషవస్త్రాన్ని ప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, ఎఈవో జంగం శ్రీనివాసరావు, తహసీల్దార్ శాంతి లక్ష్మీ, ఆర్డీవో బాలకృష్ణ, ఆర్ఐ షేక్ హలీం పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాశస్త్యం గురించి ప్రధాన అర్చకులు మర్రిబోయిన గోపి బాబు కలెక్టర్‌కు వివరించారు.

ప్రతి శాఖా ఏ గ్రేడ్ సాధించాలి

కలెక్టరేట్: కీలక ప్రగతి సూచిక (కేపీఐ)లతో జిల్లా ర్యాంకు ముందంజలో ఉండాలంటే ప్రతి శాఖా ఉత్తమ పనితీరు కనబరచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కీలక ప్రగతి సూచికలపై కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని శాఖలు బీ, సీ గ్రేడుల్లో ఉన్నాయని దీంతో జిల్లా ర్యాంకు ప్రభావితం అవుతోందన్నారు. కేపీఐలలో ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేసి ప్రతిశాఖ ఏ గ్రేడ్ సాధించాలన్నారు. అన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్ఆర్) నిర్వహించాలన్నారు. ఐటీఐ విద్యార్థులకు యాడ్ ఆన్ కోర్సుగా కృత్రిమ మేథ (ఏఐ) నేర్పించాలన్నారు. నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళికపై సీఎం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని, ప్రతి నెలలో ఒకసారి తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేతో ఈ బృందం సమావేశమై లక్ష్యాల సాధనకు కృషిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి వై శ్రీలత, అన్ని శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ విజన్ కార్యాచరణ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

బకాయిల కోసం ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్ల పోరుబాట

ఆంధ్రజ్యోతి, విజయవాడ: గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)లో జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో పోరుబాట పట్టారు. బుధవారం నగరంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం ముందు మౌన నిరాహార దీక్ష చేపట్టబోతున్నారు. జిల్లాల వారీగా విజయవాడ వచ్చి మౌన నిరాహారదీక్షలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నాయి. చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లు 750 మందికి పైగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు.

రైల్వే, ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి: జేసీ

కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విస్తృత ప్రజా ప్రయోజనాలతో ముడిపడిన రైల్వే, జాతీయ రహదారులు (ఎన్‌హెచ్) ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జేసీ ఇలక్కియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని రైల్వే, ఎన్‌హెచ్ ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్షించారు. భూసేకరణలో పురోగతిపై చర్చించారు. ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో మాధురి పాల్గొన్నారు.

విద్యుత్ సౌధతో సమానంగా పాత జోనల్ కార్యాలయం ఆధునికీకరణ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విద్యుత్‌సౌధతో సమానంగా పాత జోనల్ కార్యాలయ భవనాన్ని ఆధునీకరించేందుకు విద్యుత్ అధికారులు శ్రీకారం చుట్టారు. గుణదలలోని విద్యుత్ సౌధ ప్రాంగణంలోని పాత జోనల్ కార్యాలయ భవనాన్ని పూర్తిస్థాయి ఆధునీకరణకు రూ.1.20 కోట్ల వ్యయంతో ట్రాన్స్‌కో టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా జోనల్ కార్యాలయ భవనానికి సివిల్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, ఎలివేషన్, ఎయిర్ కండిషనింగ్ వంటి పనులకు టెండర్లు పిలిచారు. 2వ అంతస్తులోని ఐటీ విభాగంలో సీఈ, పీఆర్‌టీఐ విభాగాలను ఆధునీకరించనున్నారు.

కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకే లైఫ్ సర్టిఫికెట్లు

విజయవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ప్రతి ఏటా ట్రెజరీకి జనవరి/ఫిబ్రవరిలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి, కానీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం 2026కు సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్లను ఈ వారం నుంచే సమర్పించుకోవడానికి అవకాశం కల్పించారని పెన్షనర్ల జిల్లా జనరల్ సెక్రటరీ బీ విష్ణువర్ధన రావు తెలిపారు. గాంధీనగర్‌లోని పెన్షనర్ హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు మాత్రమే బ్యాంకు/పోస్టాఫీసుల్లో లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి అవకాశం ఇచ్చారన్నారు. రాష్ట్ర పెన్షనర్లు పోస్టుమ్యాన్‌లకు లైఫ్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని ఇవి చెల్లవన్నారు. కాబట్టి డిసెంబరు 31లోగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఇవ్వవద్దన్నారు. 2026లో జనవరి/ఫిబ్రవరిలో మాత్రమే లైఫ్ సర్టిఫికేట్లు ఇవ్వాలని సూచించారు. ప్రెసిడెంట్ కే దాలి నాయుడు, ట్రెజరర్ కే నాగేశ్వరరావు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొలికపూడి తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి

గాంధీనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పై, ఆయన కార్యాలయంపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ ఎస్సీసెల్ నేతలు మండిపడ్డారు. తక్షణమే ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ డబ్బులు తీసుకుని పదవులిచ్చే సంస్కృతి టీడీపీకి లేదని ఎమ్మెల్యే గ్రహించాలని హితవుపలికారు. వైసీపీ నేతలతో కుమ్మక్కై కేశినేని చిన్నిపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఎస్సీసెల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్, జీవీ నరసింహారావు పాల్గొన్నారు.

రేపటి గాజుల మహోత్సవానికి ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో నెల 23న నిర్వహించనున్న గాజుల అలంకరణ మహోత్సవానికి ఏరాట్లు ప్రారంభమయ్యాయి. పాలక మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనాయక్ మహామండపం 6వ అంతస్తులో మంగళవారం కొబ్బరి కాయ కొట్టి గాజుల తోరణాలను కట్టేందుకు పనులను ప్రారంభించారు. అలంకరణకు పెద్ద సంఖ్యలో గాజులను భక్తులు విరాళంగా సమర్పించారు. తొలుత వైదిక కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. చైర్మన్, ఈవోతో పాటు దేవస్థానం పాలకమండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులు ఈ ప్రత్యేక అలంకరణ దర్శనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఆర్‌డీఏ ప్రత్యేక ఆహ్వానితుడిగా హడ్కో ప్రతినిధి

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హడ్కో విజయవాడ రీజినల్ చీఫ్ బీఎస్‌పీ మూర్తిని సీఆర్‌డీఏ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమిస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 53వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో హడ్కో ప్రతినిధిని సీఆర్‌డీఏ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించాలన్న నిర్ణయంపై ప్రభుత్వం తీర్మానం చేసింది.

జరిమానాల మోత!

(5వ పేజీ తరువాయి)

అధికారులే చెప్పాలి. భూములు తీసుకుని అసలు పరిశ్రమలే పెట్టని వాటికి వెసులుబాటు కల్పించినపుడు పరిశ్రమలను ఇప్పటికే ప్రారంభించి కొనసాగిస్తున్న వారిని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తమ లోపాలను పక్కనపెట్టి మరీ..

పనులు చేపడుతున్న పారిశ్రామిక సంస్థలపై జరిమానాలు విధిస్తున్న ఏపీఐఐసీ అధికారులు తమ వైపు ఉన్న లోపాలను కూడా ఆలోచించాల్సి ఉంది. ఇప్పటి వరకు మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌కు నీటి సదుపాయాన్ని కల్పించలేకపోయారు. అలాగే పూర్తిస్థాయిలో విద్యుత్ సదుపాయాలను కూడా కల్పించలేదు అగ్రిమెంట్ సందర్భంలో ఏపీఐఐసీ అధికారులు 11 కేవీ, ఎల్‌టీ లైన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 80 శాతం పనులే జరిగాయి. ఇంకా 20 శాతం పనులు బ్యాలెన్స్ ఉన్నాయి. తమ వైపున ఉన్న తప్పులను పక్కన పెట్టి నిర్ణీత సమయం కంటే ఆలస్యమయ్యాయని వారిపై జరిమానాలు విధించటం కూడా సముచితం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పరిశ్రమలు తీసుకొచ్చే వేళ ఇలాంటివి తగదు!

గత ప్రభుత్వంలో నానా బాధలు పడినా.. పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తే.. ఆయా సంస్థల నుంచి బ్యాడ్ ఫీడ్ బ్యాక్ బయటకు వస్తే చెడు సంకేతాలు వెళతాయి. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు విశేష కృషి జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటివి ఏమాత్రం మంచిది కాదు. ఇప్పటికైనా ఏపీఐఐసీ అధికారులు తమ తీరును మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టాస్క్ మారింది..!

(5వ పేజీ తరువాయి)

నుంచి జగ్గయ్యపేటకు బదిలీ చేశారు. అదేవిధంగా ఇక్కడ పనిచేస్తున్న మరో ఎస్ఐను పశ్చిమ డివిజన్‌కు బదిలీ చేయడానికి రంగం సిద్ధం చేశారు. అదే సమయంలో సీటీఎఫ్ నుంచే బదిలీ అయి ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తూ తిరిగి వెనక్కి రావడానికి ప్రయత్నాలు చేస్తున్న కానిస్టేబుల్ వివరాలను పోలీస్ కమిషనర్ సేకరించారు. సీటీఎఫ్ నుంచి ఆరోపణలతో బదిలీ అయిన వారి నుంచి ఎలాంటి బదిలీ విజ్ఞాపనలు వచ్చినా క్షుణ్ణంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అమరుల త్యాగాలను మరువలేం

(5వ పేజీ తరువాయి)

ట్రాఫిక్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఐపీఎస్ అధికారి వ్యాస్ విగ్ర హం వద్ద మంగళవారం నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బందిని ఉద్దేశించిన ఆయన ప్రసంగించారు. సీనియర్ అధికారి వ్యాస్ అడుగుజాడల్లో అధికారులు, సిబ్బంది నడవాలని సూచించారు. డీసీపీలు కేజీవీ సరిత, ఎస్వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జక్కంపూడి ఎకనామిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీ తరహాలో ముత్యాలంపాడులో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ) ఏర్పాటు చేసేందుకు ఏపీఐఐసీ అధికారులు రంగం సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముత్యాలంపాడులో జిల్లా యంత్రాంగం ఐదు ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమిని స్వాధీనం చేసుకున్న ఏపీఐఐసీ అధికారులు ఇందులో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్‌సీసీ) ఏర్పాటు కోసం తాజాగా టెండర్లు పిలిచారు. రూ.7.57 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ నెల 27వ తేదీ నాటికి బిడ్లను సమర్పించటానికి తుది గడువుగా అధికారులు నిర్ణయించారు. విజయవాడ నగరంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను పరిచయం చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ముత్యాలంపాడులో ఎఫ్ఎఫ్‌సీని ఏర్పాటు చేయటానికి భూములు దొరకటంతో అక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఎఫ్ఎఫ్‌సీని జీ ప్లస్ 5 విధానంలో నిర్మించనున్నట్టు తెలుస్తోంది. నగరంలోని వివిధ రంగాల యూనిట్లకు ఎఫ్ఎఫ్‌సీలో అవకాశం కల్పిస్తారు. జెట్ సిటీలో నిర్మిస్తున్న ఎఫ్ఎఫ్‌సీలో మొత్తంగా ఫుట్‌వేర్ ఇండస్ట్రీకి చెందిన వారికి కేటాయిస్తున్నారు. అదే తరహాలో ముత్యాలంపాడులో ఏ రంగానికి ప్రాధాన్యత ఇస్తారన్నదానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఫర్నిచర్ - కార్పెంటరింగ్ రంగానికి పెద్దపీట వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముత్యాలంపాడులో తలపెట్టే ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా భూమి పూజ, శిలాఫలకం పనులు నిర్వహించటానికి ఏపీఐఐసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నవంబరు రెండో వారంలో పనులకు శ్రీకారం చుట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. నవంబరు 14, 15 తేదీలలో విశాఖలో పెట్టుబడుల సమ్మిట్‌కు ముందుగా దీనికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా శ్రీకారం చుడుతున్నారు.

అరాచకాల కొండ!

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన అన్ని వివరాలను తెలియజేయాలి. వాణిజ్య పన్నుల శాఖలో ఎవరైనా కిందిస్థాయి ఉద్యోగి విదేశాలకు వెళ్లాలంటే సంబంధిత సర్కిల్ సీటీవో ద్వారా డివిజన్ సంయుక్త కమిషనర్‌కు ప్రతిపాదన వెళ్లాలి. విదేశాలకు వెళ్లడానికి నిధులు ఎలా సమకూరాయి, అక్కడ ఎవరు ఉంటున్నారు, ఎవరి వద్ద బస చేస్తున్నారు అన్న వివరాలతోపాటు విదేశీ ప్రయాణానికి సంబంధించిన విమాన టికెట్ల ఫొటోస్టాట్ కాపీలను అధికారులకు సమర్పించాలి. వాణిజ్య పన్నుల శాఖ కింది, మధ్యస్థాయి ఉద్యోగులంతా ఈ నిబంధనను అనుసరిస్తున్నారు. దీనికి తాను మినహాయింపు అన్న భావనలో కొండపల్లి శ్రీనివాసరావు వ్యవహరించాడు. విదేశాలకు వెళ్లేటప్పుడు సంబంధిత సర్కిల్‌లోని సీటీవోకు ఎలాంటి సమాచారం ఇచ్చేవాడు కాదు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకునేవాడు కాదు. దర్జాగా పక్క ఊరికి వెళ్లి వచ్చినట్టుగా ప్రయాణం చేసేవాడు. శ్రీనివాసరావు అనధికారికంగా విదేశాలకు వెళ్తున్నాడని సర్కిల్‌లోని అధికారులకు పూర్తిగా సమాచారం ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకునేవారు కాదు. పైగా అతనిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు.

రేపటి విధులకు ముందురోజే సంతకాలు

గవర్నరుపేట సర్కిల్‌లో కొండపల్లి శ్రీనివాసరావు ఎంత అరాచకంగా వ్యవహరించాడు, అతనికి అధికారులు ఏ స్థాయిలో వత్తాసు పలికారు అన్న దానికి బలమైన ఆధారాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగులైనా, ప్రైవేటు ఉద్యోగులైనా ఏ రోజు విధులకు హాజరైతే ఆ రోజే హాజరుపట్టీలో సంతకాలు చేస్తారు. ఒకవేళ బయోమెట్రిక్ ఉంటే ఆరోజే వేస్తారు. ఈ విషయంలో కొండపల్లి శ్రీనివాసరావు తనంతట తాను సొంత నిబంధనను రూపొందించుకున్నాడు. శ్రీనివాసరావు తొమ్మిదో తేదీన లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత అధికారులు కార్యాలయంలో హాజరుపట్టికను పరిశీలించారు. తొమ్మిదో తేదీన హాజరుపట్టీలో సంతకం చేయడంతోపాటు ఆ మర్నాడు పదో తేదీన సంతకాలు చేసి ఉండడాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. వాణిజ్య పన్నుల శాఖలో బయోమెట్రిక్ హాజరు అమలవుతోంది. ఒకవేళ సాంకేతికంగా ఏమైనా సమస్యలు వస్తే ఇబ్బంది లేకుండా దానికి సమాంతరంగా హాజరుపట్టీని నిర్వహిస్తున్నారు. ఇందులో మాత్రం శ్రీనివాసరావు తర్వాత తేదీలో సంతకాలు చేయడం గమనార్హం. ఈ సర్కిల్‌లో ఉన్న అధికారి ఎవరైనా ఉద్యోగులు విధులకు ఆలస్యంగా హాజరైతే ఆ పేరు ఎదురుగా ఇన్‌టు మార్క్ పెడతారు. ఈ మార్క్ నుంచి కొండపల్లి శ్రీనివాసరావుకు మినహాయింపు ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. అతడు ఎన్ని గంటల ఆలస్యంగా విధులకు వచ్చినా, అసలు సమాచారం లేకుండా విధులకు రాకపోయినా ఆ అధికారి వెనుకేసుకుని వచ్చినట్టు విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగా కొండపల్లి అవినీతి కోటలను విస్తరించుకున్నాడని తెలుస్తోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	137,146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

ఆటోనగర్ ఆర్టీసీ డీఎంగా రాజేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

ఆటోనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జి. రాజేష్‌కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత నెలాఖరు వరకు ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేసిన కె. ప్రవీణ్‌కుమార్ పదవీ విరమణ చేయడంతో ఈ ఖాళీ ఏర్పడింది. రాజేష్‌కుమార్ గుడివాడ డిపో మేనేజర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ డిపోలోని బస్సులన్నీ దూరప్రాంతం సర్వీసులేనని, కండక్టర్ రహిత డిపో అని చెప్పారు. దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు ఎటువంటి మరమ్మతులకు గురికాకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడతామని డీఎం రాజేష్‌కుమార్ తెలిపారు.

పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

● నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్‌ని అందుబాటులోకి తెచ్చిందని, నగర ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకొని, నగరపాలక సంబంధిత సమస్యలను త్వరగా పరిష్కరించుకోవచ్చని, పురమిత్ర యాప్‌ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు వంటి దాదాపు 122 పురపాలక సేవలు పొందవచ్చునని తెలిపారు. సమస్యలను ఫిర్యాదుతో పాటు ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయవచ్చునని తెలిపారు. వచ్చే వారం నుంచి వార్డు సచివాలయాల వారీగా ప్రజలకు యాప్ డౌన్‌లోడ్, వినియోగంపై అవగాహన కలిగిస్తామని తెలిపారు.

నేటి నుంచి శివాలయంలో ప్రత్యేక పూజలు

భారతీనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గురునానక్ కాలనీలోని శివాలయంలో బుధవారం నుంచి వచ్చే నెల 22 వరకు ఆలయంలో శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల రోజులపాటు ప్రతిరోజు ఉదయం తెల్లవారు జాము నుంచి 6గంటల వరకే అభిషేకం జరుగుతుందని, కార్తీక సోమవారాలలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ కులరాజకీయాలు

జనసేన నాయకుడు అమిశెట్టి వాసు

లబ్బీపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ కుల రాజకీయాలు చేస్తుందని జనసేన నాయకులు అమిశెట్టి వాసు విమర్శించారు. బందర్‌రోడ్డులోని జనసేన కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కందుకూరులో జరిగిన ఘటనను కులాలకు ఆపాదించి తమ నాయకుడు పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. 40 ఏళ్లుగా లక్ష్మీనారాయణ కుటుంబం టీడీపీతో కలిసి ఉంటుందని, చంద్రయ్య, లక్ష్మీనారాయణల మధ్య ఆర్థిక విధమైన ఘర్షణ ను కులాలకు ఆపాదించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు బొలిశెట్టి వంశీ కృష్ణ, మల్లెపు విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.






ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ జెడ్ఎం కార్యాలయం బోర్డు, శిథిలావస్థలో ఉన్న భవనం, సిమెంట్ పెచ్చులు ఊడుతూ తుప్పుపట్టిన ఇనుప చువ్వలతో ఉన్న వరండా

ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు..పగిలిన అద్దాలు

● శిథిలావస్థలో ఏపీఐఐసీ జెడ్ఎం కార్యాలయ భవనం ● భయపడుతున్న ఉద్యోగులు ● ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటూ వినతి

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: పరిశ్రమల్లో మౌలిక సదుపాయలు కల్పించే విజయవాడ జవహర్ ఆటోనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్(జెడ్ఎం) కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. సుమారు ఐదున్నర దశాబ్దాల క్రితం ఈ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈభవనంలోనే కార్యాలయం ఉంది. ప్రస్తుతం ఈ భవనంలో జెడ్ఎం కార్యాలయంతోపాటు ఆంధ్రప్రదేశ్ ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం కూడా ఉంది. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో భవనం లోపల శ్లాబ్ సిమెంట్ పెచ్చులు విరిగి కిందపడుతున్నాయి. వర్షానికి గోడల నుంచి చెమ్మ వచ్చి ఫైళ్లు కూడా నీటిలో నానుతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం కిటికీల అద్దాలు పగిలి వర్షానికి నీరు లోపలకు వస్తోందంటున్నారు. దీనితోడు కార్యాలయం పరిసర ప్రాంతాలు మొక్కలతో గుబురుగా ఉండటంతో విషపురుగులు లోపలకు వస్తున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం వరండాలో పలు చోట్ల సిమెంట్ పెచ్చులు ఊడి తుప్పుపట్టిన ఇనుప చువ్వలు కూడా బయటకు కనిపిస్తున్నాయి. ఏసమయంలో ఏప్రమాదం ముంచుకు వస్తుందోనని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారించి నూతన భవనం నిర్మింపుజేయాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

ఏపీఐఐసీ కార్యాలయం భవనం స్థానంలో మరో నూతన భవనం నిర్మింపజేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రెండు ఫ్లోర్లుగా దీనిని నిర్మించి ఒక ఫ్లోర్ ఏపీఐఐసీ జెడ్ఎం కార్యాలయానికి, మరో ఫ్లోర్ జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం కార్యాలయానికి ఇవ్వాలని కోరాం. ప్రభుత్వం దీనిపై ఆలోచన చేస్తుంది.

\- ఏపీఐఐసీ జెడ్ఎం కె. బాబ్జీ

బహుళ అంతస్థుల భవనం నిర్మిస్తే ప్రభుత్వానికి ఆదాయం

సుమారు ఎకరం విస్తీర్ణంలో ఏపీఐఐసీ జెడ్ఎం కార్యాలయం, దానికి ప్రహరీ ఉంది. ఈప్రాంతం నగరానికి ప్రముఖ కూడలిగా ఉండటంతో దీని స్థానంలో బహుళ అంతస్థుల భవనం నిర్మించి చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే గద్దె ఇంట ఉత్సాహంగా దీపావళి వేడుకలు

భారతీనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దీపావళి వేడుకలను కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకున్నారు. అశోక్‌నగర్‌లోని ఆయన ఇంటి ఆవరణలో సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి ఆయన టపాసులు కాల్చారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో పాటుగా ఆయన సతీమణి కృష్ణా జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, కుమారుడు గద్దె క్రాంతి, కోడలు, మనవరాలు వేడుకలలో పాల్గొన్నారు.

ఐదో డివిజన్లో విద్యుత్ దీపాలు ప్రారంభం

గుణదల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అంటేనే అభివృద్ధికి మారుపేరని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. స్థానిక ఐదో డివిజన్లోని ఆర్‌సీఎం చర్చి ఏరియాలో విద్యుత్ దీపాల ప్రారంభ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ రూ.10లక్షల వ్యయంతో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలో ఉన్న ఫ్లైఓవర్ల నిర్మాణాలు, రోడ్ల విస్తరణలు, కొండ ప్రాంతంలో

ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె

రెయిలింగ్, మెట్ల ఏర్పాటు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు తమ హయాంలోనే జరిగాయని తెలిపారు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజం అన్నారు. ఐదో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నాయకులు , జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో సంతోషంలో ప్రజలు

● టీడీపీ యువనేత గద్దె క్రాంతి కుమార్

బెంజిసర్కిల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రభుత్వం సాఫల్యంతో ప్రజలు సంతోషంగా పండుగలు జరుపుకుంటున్నారని టీడీపీ యువనేత గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. మంగళవారం 9వ డివిజన్ పటమటలంకకు చెందిన జక్కా లక్ష్మీ గృహానికి పైకప్పు సమస్యను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వివరించగా రూ.15 వేల సొంత నిధులతో రేకులు కొనుగోలు చేసి అమర్చారు. పనులు పూర్తి కావడంతో క్రాంతి కుమార్ లక్ష్మీ ఇంటికి వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.






తూర్పులో సోమవారం దీపావళి వేడుకలు సంతోషంగా జరుపుకొన్నారు. ఎంజీ రోడ్డులో షాపుల ముందు, పటమట, ఈ సేవ కేంద్రం వద్ద ఉత్సాహంగా టపాసులు కాల్చారు

వీఎంసీ డీఈ దృష్టికి 7వ డివిజన్ సమస్యలు

మొగల్రాజపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏడో డివిజన్ బందిలదొడ్డి, సీఎస్ఐ చర్చి రోడ్డులో పలు సమస్యలను వీఎంసీ డీఈ శాంతారామ్ పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించినపుడు స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారం నిమిత్తం డీఈ మంగళవారం ఆయన డివిజన్‌లో పర్యటించారు.. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు సతీష్ డ్రెయినేజీ, రోడ్డు సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయో అక్కడికి తీసుకెళ్లి చూపించారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరసా లక్ష్మణ్, స్థానికులు పాల్గొన్నారు.



డ్రెయినేజీ సమస్యను పరిశీలిస్తున్న డీఈ శాంతారామ్ తదితరులు

స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ స్టేజ్-2 కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్

ఆటోనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ స్టేజ్-2 కాంట్రాక్టర్ల సమస్యలను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆచంట రామకృష్ణ డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం మంగళవారం ఆటోనగర్‌లోని ఒక హోటల్‌లో ఆచంట రామకృష్ణ అధ్యక్షత జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్‌ల నుంచి రేషన్ దుకాణాలు, మధ్యాహ్నం భోజనం పెట్టే ప్రభుత్వ స్కూళ్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకును ఒకేసారి ఇవ్వకుండా మూడు సార్లుగా ఇస్తున్నారని తెలిపారు. అలా కాకుండా సరుకును ఒకే సారి విడుదల చేస్తే తమకు రవాణా ఖర్చు తగ్గుతుందని, దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. మూడు నెలలుగా రవాణా ఖర్చులను చెల్లించడంలేదని, ప్రతి జిల్లాకు ఇటువంటి బిల్లులు నెలకు రూ. 40 లక్షల వరకు పెండింగ్ ఉందని పేర్కొన్నారు. సరుకును తీసుకువెళ్లే పెద్దపెద్ద లారీలు స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఉండే చిన్నచిన్న సందుల్లోకి వెళ్లడం లేదని, కూలీలను పెట్టి సరుకును మోయిస్తున్నామని ఆయన చెప్పారు. తమ సమస్యలను పలుసార్లు సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని, దీనిపై ప్రభుత్వం దృష్టిసారించి న్యాయం చేయాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి. రాజారావు, ఉపాధ్యక్షుడు పి. కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆచంట రామకృష్ణ

'జాతీయ సాంస్కృతిక ఉత్సవాల' కరపత్రం ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ సహకారంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహణలో నవంబరు 22, 23 తేదీలలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగనున్న 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాల' కరపత్రాన్ని మంగళవారం ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ సన్నిధిలో ఆవిష్కరించారు.అనంతరం ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘం (ఆకాసం) రాష్ట్ర అధ్యక్షుడు బాచి మాట్లాడుతూ కలెక్టర్ లక్ష్మీశ గొప్ప సంకల్పంతో, మల్లెతీగ నిర్వహణలో కవులు, కార్టూనిస్టులు, కళాకారులు ఒక గొడుగు కిందకి రావడం చారిత్రాత్మక సన్నివేశమని అన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా కార్టూన్ల పోటీ నిర్వహించడం, బహుమతులివ్వడం, ఆ కార్టూన్లన్నీ కలిపి ఒక ప్రత్యేక సంచికగా తేవడం తెలుగు కార్టూనిస్టులందరికీ ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. జాతీయ సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ మాట్లాడుతూ కార్టూనిస్టులు, కవులు, కళాకారులు ఈ నెల 25లోగా 8332903156 నెంబరులో ప్రతినిధులుగా పేర్లు నమోదు చేసుకొని ఉత్సవాలకు హాజరుకావచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కార్టూనిస్టులు ఏవీఎం, పద్మ, మురళీధర్, ఉత్సవాల నిర్వహణ కమిటీ బాధ్యులు యేమినేని వెంకటరమణ, చొప్ప రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆకాసం రాష్ట్ర అధ్యక్షుడు బాచి తదితరులు



దుర్గగుడిలో అన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో అన్నదాన పథకానికి సత్యనారాయణపురానికి చెందిన అనిల్ గోవిందరాజు, శైలజ, వారి కుమార్తె ఆర్నా పేరున విరాళంగా రూ.1,00,116లు అధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం అధికారులు వారికి లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

రిక్రియేషనల్ అవసరాలకు కేటాయించిన

భూములకు వీఎల్‌టీ వేయకూడదు

హైకోర్టు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రిక్రియేషనల్ అవసరాల (పార్క్) కోసం కేటాయించిన స్థలానికి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్(వీఎల్‌టీ) విధించడానికి వీల్లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. భూమి వినియోగ మార్పిడి జరగకుండా పిటిషనర్ దానిని వాణిజ్య అవసరాలకు వినియోగించలేరని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో దానిని ఖాళీ భూమిగా పరిగణించి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ విధించడం సమర్థనీయం కాదని పేర్కొంది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ 2017 మార్చిలో జారీ చేసిన నోటీసును చట్టవిరుద్ధమైనదిగా ప్రకటిస్తూ దానిని రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ, మొగల్రాజపురంలో వీవీ రామకృష్ణకు 14,990 చదరపు గజాల భూమి ఉంది. మాస్టర్ ప్లాన్ మేరకు అందులో 3.26 ఎకరాలను రెసిడెన్సియల్ రిక్రియేషనల్ అవసరాల కోసం కేటాయించారు. మిగిలిన స్థలంలో షెడ్లు నిర్మించి వాటికి ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. 2013-16 సంవత్సరాలకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ రామకృష్ణ 2017లో హైకోర్టును ఆశ్రయించారు. వాదప్రతిపాదనల అనంతరం న్యాయమూర్తి... మున్సిపల్ కమిషనర్ 2017 మార్చిలో జారీ చేసిన నోటీసును చట్టవిరుద్ధమైనదిగా ప్రకటిస్తూ దానిని రద్దు చేశారు.

ఫ్యాషన్

ధగధగలాడే బంగారం డ్రస్



బంగారంతో ఆభరణాలతో పాటు దుస్తులూ రూపొందుతూ ఉంటాయి. తాజాగా దుబాయ్‌కు చెందిన అల్ రొమోజాన్ ఆభరణాల బ్రాండ్... పది కిలోల బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల ఖరీదైన 'దుబాయ్ డ్రస్'ను రూపొందించింది. ఇలాంటి బంగారం దుస్తుల స్ఫూర్తితో ట్రెండ్‌గా మారిపోతున్న గోల్డెన్ డ్రస్సుల మీద ఓ లుక్కేద్దామా...

9.5 కోట్ల డ్రస్

విలాసాలకూ, సంపదకూ పేరు పొందిన దుబాయ్ తాజాగా 21 క్యారెట్ల మేలిమి బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల రూపాయల విలువైన బంగారం డ్రస్‌ను రూపొందించి, గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. పది కిలోల బరువున్న ఈ డ్రస్ ప్రపంచంలోనే అత్యంత బరువైన, విలువైన డ్రస్‌గా పేరు తెచ్చుకుంది. ఒక బంగారు కిరీటం, నెక్లెస్, నడుముకు తగిలించుకునే హియార్ అనే ఆభరణం లాంటి అదనపు హంగులు కూడా ఈ డ్రస్‌కు తోడవడం విశేషం. ఎమిరాటి సంస్కృతిని ప్రతిబింబించేలా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చరిత్ర, వారసత్వాలకు అద్దం పడుతూ చక్కని పనితనంతో, ఆకృతులతో ఈ డ్రస్‌ను ఎంతో కళాత్మకంగా రూపొందించారు.



బంగారం ప్రియులను అలరించేలా...

ఈ దుస్తులకు తగ్గట్టుగా రూపొందించిన బంగారం టియారా 398 గ్రాముల బరువుంటే, నెక్లెస్ ఏకంగా 8,810 గ్రాముల బరువుంది. ఇయర్ రింగ్స్ 134 గ్రాముల బరువున్నాయి. ఇలాంటి అత్యంత బరువైన, విలువైన బంగారం డ్రస్ రూపకల్పన... ప్రపంచ నాయకత్వాన్ని చాటుకోవాలనే యుఎఇ ఆశయం ప్రతిబింబించడంతో పాటు దుబాయ్ నగరం... బంగారు ఆభరణాల ప్రియుల ప్రధాన గమ్య స్థానంగా ప్రత్యేక గుర్తింపును కూడా పొందగలిగింది. షార్జాలో జరిగిన 56వ మధ్యప్రాచ్య వాచ్ అండ్ జ్యువెలరీ ప్రదర్శనలో భాగంగా పలు ఆభరణాల కంపెనీలు తమ ఆసక్తికరమైన ఉత్పత్తు లను ప్రదర్శించాయి. 500మందికి పైగా స్థానిక, అంతర్జాతీయ ప్రదర్శనకారులు పాల్గొనగా, ప్రపంచవ్యాప్తంగా 1800 మంది డిజైనర్లు, వర్తకులు వారి ఉత్పత్తులు ప్రదర్శించారు. వీటిలో దుబాయ్ డ్రస్‌తో పాటు మూడున్నర కోట్ల రూపాయల విపులైన గోల్డ్ ప్లేటెడ్ సైకిల్ కూడా ఉండడం చెప్పుకోదగిన విశేషం!



వినూత్నం

ప్రతి ఒక్కరిలో రహస్య నైపుణ్యాలు దాగి ఉంటాయి. వాటిని కనిపెట్టి మెరుగులు దిద్ది, ప్రతిభను చాటుకునే సామర్థ్యం కొందరికే ఉంటుంది. కేరళకు చెందిన బీట్ ఆఫీసర్, **బిస్మి విల్స్** కథే ఇందుకు ఉదాహరణ. అటవీ శాఖలో వృత్తి బాధ్యతలకే పరిమితమైపోకుండా, తనలోని కెమెరా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుని, కేరళ అటవీ శాఖ ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ ప్రయత్నాలకు నిదర్శనంగా మారిందామె. మరిన్ని వివరాలు...

అడవిలో ఫొటోగ్రాఫర్‌గా మారి..

తిరువనంతపురంలోని పరసాలకు చెందిన బిస్మి విల్స్. కేరళ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా ఎంపికైంది. పరీక్ష పాసై, ఉద్యోగానికి ఎంపికైంది కాబట్టి వృత్తిలో చేరాలనే ఆలోచనే తప్ప, వృత్తి పట్ల ఆమెకెలాంటి ఆసక్తి కలగలేదు. అయితే ఆమె పై అధికారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రియ టి.జోసెఫ్ మాటలు బిస్మిని ప్రభావితం చేశాయి. వృత్తిలో పైకి ఎదగాలంటే, వృత్తి పట్ల నిబద్ధత కలిగి ఉండాలనీ, మక్కువ పెంచుకోవాలనీ ప్రియ... బిస్మికి హితబోధ చేసింది. ఆ మాటలు బిస్మి మనసులో నాటుకుపోయాయి. అప్పటి నుంచి అడవిలో గస్తీ సమయంలో పరిసరాలను ఆసక్తిగా గమనించడం మొదలుపెట్టింది.

చుట్టూరా అందమైన ప్రకృతి, ఆసక్తి కలిగించే వన్యప్రాణులు, వాటి ప్రవర్తనలు ఆమెను ఆకట్టుకోవడం మొదలుపెట్టాయి. వాటిని జ్ఞాపకాల్లో బంధించడంతో పాటు, అటవీ శాఖకు ఉపయోగపడేలా కెమెరాలో బంధిస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే ఆలోచనతో ఒకడిఎస్ఎల్ఆర్ కెమెరా కొనుగోలు చేసింది బిస్మి. ఈ సందర్భం గురించి ప్రస్తావిస్తూ...'పంప ప్రాంతంలో విధులు నిర్వహించే సమయంలో అక్కడి చెట్ల ఆకులు నన్ను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఫీల్డ్ డ్యూటీలో భాగం వేర్వేరు చెట్లను గుర్తు పెట్టుకోవడం కోసం వాటి ఆకులను



సేకరించడం మొదలుపెట్టాను. ఆ తర్వాత నా ఆసక్తి సీతాకోకచిలుకల మీదకు మళ్లింది. వేర్వేరు జాతుల డేటాను సేకరించడం కోసం ఒక యాప్‌ను కూడా ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకున్నాను. అయితే చిన్న జాతుల మధ్య తేడాలను గుర్తించాలంటే వాటిని ఫొటోలు తీసుకోక తప్పదు. దాంతో నాది పాత ఫోన్ అవడంతో, ఒక డిజిటల్ కెమెరా కొనుక్కున్నాను" అంటూ తన కెమెరా ప్రయాణం తొలినాళ్ల గురించి వివరించింది బిస్మి.

నేర్పు, ఓర్పు అవసరం

పంప నుంచి వలక్కడువుకు బదిలీ అవడంతో బిస్మిలోని వన్యప్రాణుల ప్రేమికురాలు మేలుకొంది. "పంపకు భిన్నంగా వలక్కడువులో ఏనుగులు, సాంబార్ డీర్.. ఇతర జంతువులు కనిపిస్తూ ఉండేవి. ఫారెస్ట్ వాచర్, అనుభవమున్న వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ విష్ణు నాకు తోడయ్యాడు. దాంతో ఇద్దరం కలిసి వన్యప్రాణులను వెతుక్కుంటూ కొండల మీద తిరగడం మొదలుపెట్టాం. ఏనుగుల వాసనను పసిగట్టి, వాటికి 250 మీటర్ల దూరానికి చేరుకుని, అందమైన ఫొటోలు తీయడం మొదలుపెట్టాం. జంతువుల దృష్టిలో పడకుండా ఎలా నడుచుకోవాలో, వాటికి భంగం కలగకుండా ఫొటోలు ఎలా తీయాలో, గాలి వీచే దిశ ఆధారంగా, నా ఉనికిని జంతువులు పసిగట్టే వీలు లేకుండా ఫొటోలకు తగిన ప్రదేశాన్ని ఎలా ఎంచుకోవాలో అతను నాకు నేర్పించాడు.

ఆ మెలకువల మీద పట్టు పెరిగిన తర్వాత, ఎన్నో మరపురాని ఫొటోలను తీయగలిగాను. ఎలుగుబంటి మీద దాడి చేసే అడవి కుక్కను ఫొటోలో బంధించగలిగాను. మేత మేస్తూ, గొడవ పడుతూ, ప్రేమ ప్రదర్శించుకునే పాతిక ఏనుగుల మందను ఫొటోలు తీయగలిగాను. అయితే ఫొటోల కోసం నేను చేసే ప్రతి ప్రయత్నం ఫలిస్తుందనే నమ్మకం ఉండదు. గంపెడు ఆశతో వెళ్లి, నిరుత్సాహంతో వెనుతిరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. గంటల తరబడి ఎదురుచూసి, ఖాళీ చేతులతో తిరిగొచ్చిన రోజులూ లేకపోలేదు. వన్యప్రాణుల ఫొటోగ్రఫీకి ఎంతో నేర్పు, ఓర్పు అవసరం" అంటూ ఫొటోలు తీయడంలో ఎదుర్కొన్న శ్రమల గురించి వివరిస్తోంది బిస్మి.

పులిని ఫొటో తీయాలి

"నా అంతిమ లక్ష్యం పులిని ఫొటోలు తీయడం. చాలాసార్లు వాటిని అనుసరించినా, కెమెరాలో బంధించే అవకాశం ఇప్పటివరకూ రాలేదు. పులులు సిగ్గరులు. అవి మనుషులకు దూరంగా ఉంటాయి. అయినా ఏదో ఒకనాటికి పులిని కచ్చితంగా కెమెరాలో బంధిస్తాను' అంటున్న బిస్మి, ప్రకృతి, వన్యప్రాణుల పట్ల ప్రేమతో అటవీ శాఖలో చేరుతున్న మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందనీ, అయితే ఈ వృత్తిలోకి అడుగుపెట్టే ప్రతి ఒక్కరూ అడవులు, వన్యప్రాణుల పట్ల మక్కువను పెంచుకోవడం అవసరమని అంటోంది. ఆమె తీసిన ఫొటోలు కేరళ అటవీ శాఖ డాటా సేకరణకు ఎంతో బాగా ఉపయోగపడుతున్నాయి. బిస్మి ఫొటోల వల్ల, అడవిలో వన్యప్రాణుల జీవనశైలి, వాటి మధ్య వైవిధ్యాలను ఆధారాలతో సహా ప్రదర్శించగలిగే అవకాశం కూడా దక్కుతూ ఉండడం చెప్పుకోదగిన విశేషం .



ఈ మహిళా కారాగారం... బతుకుల్ని మార్చే ఆశ్రమం

వివిధ కారణాలతో ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న వారి జీవితాల్లో మార్పు కోసం, సాధికారత కోసం కృషి చేస్తోంది రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం.

ఈ సెమీ ఓపెన్ ప్రిజన్‌లో, ఆశ్రమంలాంటి వాతావరణంలో మహిళా ఖైదీలు... పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు.

కూరగాయల పెంపకం, పిండి వంటల తయారీ... ఇలా ఎన్నో మార్గాలతో జైలుకు ఆదాయాన్ని సమకూరుస్తూ, వేతనాలు సంపాదిస్తున్నారు.

జైలు నుంచి విడుదలయ్యాక సొంతకాళ్ల మీద నిలబడి, స్వయంసమృద్ధి సాధించడానికి పునాదులు వేసుకుంటున్నారు.

కృషితో నాస్తి దుర్భిక్షం... ఇది పెద్దలు చెప్పిన మంచి మాట. కృషితో మంచి మార్పు కూడా సాధ్యమేనని రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం అధికారులు రుజువు చేస్తున్నారు. మహిళా ఖైదీలకు చదువుతోపాటు పంటల సాగు, వంటల తయారీలో నైపుణ్యాలను అందించి, జైలు నుంచి వారు విడుదలయ్యాక... సొంత కాళ్ల మీద నిలబడేందుకు ఊతం ఇస్తున్నారు. దేశంలోని కొన్ని మహిళా కారాగారాల్లో ఓపెన్ ప్రిజన్ విధానం ప్రారంభమైనా, రకరకాల సమస్యలతో కొంత కాలానికే మూతపడ్డాయి. కానీ ఇక్కడ ఏడాదిన్నర నుంచి విజయవంతంగా అమలవుతోంది. ఆ జైలులోని మహిళా ఖైదీలు ఎన్నో రకాల పంటలు పండిస్తూ జైలుకు ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు వేతనాల రూపంలో తామూ సంపాదించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప, రాజమహేంద్రవరంలో మాత్రమే ప్రత్యేక మహిళా కారాగారాలు ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని కారాగారాన్ని ఆశ్రమం మాదిరిగా తీర్చిదిద్దారు. మహిళా ఖైదీల జీవన స్థితిగతులను మెరుగుపరచడం కోసం, శిక్ష పూర్తయ్యాక తక్కువ పెట్టుబడితో వ్యాపారం చేసుకొని జీవనోపాధి పొంపొందడం కోసం వారికి ఆసక్తి ఉన్న పనిలో తర్ఫీదు ఇస్తున్నారు. వారి నైపుణ్యాలను పదునుపెడుతున్నారు.

పూర్తి సేంద్రియంగా...

ఈ కారాగారంలో సెమీ ఓపెన్ ప్రిజన్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.. సాధారణంగా శిక్షపడిన, రిమాండ్ ఖైదీలను జైలు లోపల ఉంచుతారు. వాళ్లలో సత్ప్రవర్తనతో మెలిగే జీవిత ఖైదీలను జైలు ప్రాంగణంలో వివిధ అవసరాలకు వినియోగిస్తారు. ఇక్కడి ఓపెన్ ప్రిజన్ కోసం 27 మంది ఖైదీలను ఎంపిక చేశారు. వారిలో కొందరు విడుదల కాగా... ప్రస్తుతం 15 మంది ఉన్నారు. వీళ్లను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. ఈ జైలుకు చెందిన అయిదు ఎకరాల భూమి పూర్వం చిట్టడవి మాదిరిగా ఉండేది. దాన్ని సాగుకు అనువుగా మలిచారు. సుమారు రూ.1.50 లక్షలతో డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ భూమిలో అంజూర, షర్బత్ నిమ్మ, ఉసిరి, సీతాఫలం, వాటర్ యాపిల్, నారింజ, బత్తాయి, మామిడి, పనస, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, జామ తదితర పండ్ల మొక్కలను నాటారు. వంకాయ, బెండ, దోస, ఆనప, కాకర, గోరు చిక్కుడు, పందిరి చిక్కుడు, బీర, టమాట, దొండ లాంటి కూరగాయలతో పాటు ఆకు కూరలను జైలు సిబ్బంది పర్యవేక్షణలో మహిళా ఖైదీలు సాగు చేస్తున్నారు. వీరికి గతంలో ఎలాంటి వ్యవసాయ అనుభవం లేదు. ఉద్యానవన, అటవీ, వ్యవసాయ తదితర శాఖల సలహాలను పాటిస్తూ పూర్తి ప్రకృతి, సేంద్రీయ పద్ధతిలో పంటలను పండిస్తున్నారు. ట్రాక్టరు లాంటి యంత్రాలు లేకుండా సంప్రదాయ విధానాలను అనుసరిస్తూ... రోజుకు రూ.1500 వరకూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.





త్వరలో క్యాటరింగ్ సేవలు...

రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారంలో కవర్ల తయారీ యూనిట్, బేకరీ యూనిట్, టైలరింగ్ యూనిట్ ఉన్నాయి. వీటిలో తయారు చేసే పదార్థాలు, వస్త్రాలు, వస్తువులను జైలు బయట విక్రయిస్తారు. అలాగే రాగి మాల్ట్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి జైలు బయట చేసే ఆకు కూరలు, కాయగూరల విక్రయాలు అరగంటలో పూర్తయిపోతాయి. బేకరీ యూనిట్‌లో నాణ్యమైన దినుసులు ఉపయోగించి... స్వీట్లు చాక్లెట్లు, ఉస్మానియా బిస్కట్లు, ఫ్రూట్‌కేక్, బ్రెడ్, వాము పకోడీ, కారప్పూస, జంతికలు, అటుకుల మిక్చర్, కార్న్ ఫ్లాక్స్ బూందీ, బెల్లం గవ్వలు లాంటివి తయారు చేసి బహిరంగ మార్కెట్ కంటే తక్కువకే విక్రయిస్తున్నారు. ఇవి నిల్వ ఉండడానికి, రుచి పెంచడానికి ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. పిండి వంటలు, బేకరీ ఐటమ్స్, టైలరింగ్, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రోజుకు రూ.5వేల వరకూ జైలుకు ఆదాయం సమకూరుతోంది. "ఇప్పటికే ఆర్డర్లపై పిండి వంటలు తయారుచేసి ఇస్తున్నాం. త్వరలో క్యాటరింగ్ సేవలు, స్వీట్ స్టాల్ కూడా ప్రారంభిస్తాం. ఈ ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత బతుకుతెరువుకు ఇబ్బంది పడకుండా సమాజంలో గౌరవంగా జీవించాలనేదే మా ధ్యేయం. దీని వెనుక మా డీజీ, ఐజీ, డీఐజీల ప్రోత్సాహం చాలా ఉంది. మహిళా ఖైదీలతో వ్యవసాయం దిశగా అడుగులు వేయడంలో డీజీ హరీశ్ కుమార్ గుప్తా ఎంతో సహకరించారు. మా సిబ్బంది సహాయంతో మహిళా ఖైదీల జీవితాల్లో మెరుగైన మార్పులు రావడానికి కృషి చేస్తున్నాం" అంటున్నారు జైలు సూపరింటెండెంట్ వసంతకుమారి.



తారతమ్యాలు లేకుండా...

రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారంలో తారతమ్యాలకు తావు ఉండదు. ఏ పండుగ వచ్చినా అందరూ కలసిమెలసి చేసుకుంటారు. జైలు అధికారులు, సిబ్బంది కూడా భాగస్వాములవుతారు. ఎవరి ప్రార్థనాలయాలు వారికి ఉన్నాయి. రోజూ ఉదయం యోగాతో ఖైదీలు తమ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. తర్వాత కాసేపు ఇష్ట దైవారాధన చేసి, దైనందిన పనుల్లో నిమగ్నమవుతారు. వంటశాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుతారు. జైలు ఆవరణలో ఎటు చూసినా పచ్చదనం, అందమైన రంగవల్లులు కనువిందు చేస్తాయి. ఈ ప్రాంగణంలో ఆరు పడకల ఆసుపత్రి ఉంది. వైద్యులు నిరంతరాయంగా అందుబాటులో ఉంటారు. డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సులు చదివే సౌలభ్యం ఉంది. అధికారుల ప్రోత్సాహంతో 2008 నుంచీ ఇప్పటి వరకూ 32 మంది డిగ్రీ, ఇద్దరు పీజీ పూర్తి చేశారు. 2021-2024లో డిగ్రీ పూర్తి చేసిన డి.నాగరాజకుమారి బంగారు పతకం సాధించారు. ఈ కారాగారంలో అయిదు వేల పుస్తకాల గ్రంథాలయం కూడా ఉంది.

• పి.రమేశ్ నాగేంద్ర

వంటింటి వ్యర్థాలే బలం..!

మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి ఎరువులు అత్యవసరం. రసాయన ఎరువులకు బదులు వంటింటి వ్యర్థాలను ఉపయోగిస్తే మొక్కలు మరింత ఆరోగ్యంగా ఉంటాయి. వంటింటి వ్యర్థాలను సేంద్రీయ ఎరువులుగా ఎలా వాడాలో తెలుసుకుందాం...

- కోడిగుడ్డు పెంకుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది మొక్క పెరుగుదలకు తోడ్పడడమే కాకుండా పూలు, కాయలు అధికంగా ఉత్పత్తి కావడానికి దోహదం చేస్తుంది. కోడిగుడ్డు పెంకులను మెత్తగా పొడి చేయాలి. మొక్కల మొదళ్లలో కొద్దిగా తవ్వి, వేర్ల చుట్టూ ఈ పొడిని చల్లాలి. తరువాత యథావిధిగా మట్టిని పరచి కొన్ని నీళ్ల చిలకరించాలి. గుడ్డు పెంకుల పొడిని నీళ్లలో కలిపి రోజూ మొక్కల మొదళ్లలో పోసినా ప్రయోజనం కనిపిస్తుంది.



- అరటి పండు తొక్కలో అధికంగా ఉండే పొటాషియం, భాస్వరం లాంటి మూలకాలు.. పూల ఉత్పత్తిని పెంచుతాయి. అరటి తొక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసి ఒక ప్లాస్టిక్ బాటిల్‌లో వేయాలి.



నిండా నీళ్ల పోసి మూతపెట్టి మూడు రోజులు అలాగే ఉంచాలి. తరువాత ఈ నీటిని మొక్కల మొదళ్లలో పోస్తే పువ్వులు గుత్తులు గుత్తులుగా వస్తాయి.

- ఆకు కూరల కాడలు, కూరగాయల వ్యర్థాలు.. సహజ ఎరువులుగా పనిచేస్తాయి. వీటిని మట్టిలో కలిపి మొక్కల మొదళ్లలో చల్లవచ్చు. లేదంటే మొక్కల మొదళ్లలో, చుట్టూరా కొద్దిగా తవ్వి వీటిని వేసి పైన మట్టితో కప్పవచ్చు.
- వాడేసిన టీ పొడిలో కొన్ని నీళ్ల పోసి వడకట్టాలి. ఈ పొడిని గట్టిగా పిండి కాగితం మీద వేసి బాగా ఆరబెట్టాలి. తరువాత ఈ పొడిని వారానికి ఒకసారి కొద్దికొద్దిగా తీసుకుంటూ మొక్కల మొదళ్లలో చల్లాలి. ఇలా చేయడం వల్ల పచ్చని ఆకులతో మొక్కలు ఏపుగా పెరుగుతాయి.



పిల్లల విషయంలో జాగ్రత్త..!

నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లలపై రకరకాల ఆశలు పెట్టుకుంటున్నారు. వాటిని సాధించి తీరాలంటూ పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారు. దీని వల్ల పిల్లల మానసిక స్థితి ప్రభావితమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలను పెంచే క్రమంలో తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

- పిల్లలందరి శక్తి సామర్థ్యాలు, ఆలోచన తీరు ఒకేరకంగా ఉండవు. కాబట్టి పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. అవసరమైన శిక్షణ ఇప్పించాలి.
- క్రమశిక్షణ పేరుతో పిల్లలకు కఠినమైన ఆంక్షలు పెట్టకూడదు. కేవలం చదువుకు మాత్రమే ప్రాముఖ్యమిస్తే పిల్లలు ఆటపాటల్లో రాణించలేరు. అంతేకాదు వాళ్లకు.. ఇతరులతో మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, పోటీ తత్త్వం అలవడవు.
- పిల్లలు ఏవైనా పొరబాట్లు చేస్తే వారిపై కోపం చూపించకూడదు. సామరస్యంగా వ్యవహరించి మంచి, చెడుల తారతమ్యాన్ని వివరించాలి.
- పరీక్షల్లో మార్కులు తగ్గాయనో, ఆటల్లో ఓడిపోయారనో పిల్లలను 'నీకేమీ చేతకాదు' అంటూ నిరాశ పరచకూడదు. దీనివల్ల పిల్లల ఆత్మ విశ్వాసం దెబ్బతింటుంది. మరో ప్రయత్నం చేసి అనుకున్నది సాధించేలా పిల్లలను ప్రోత్సహించాలి.



- పిల్లల ఇష్టాలు, ఆశయాలు తెలుసుకోకుండా చెప్పిన మాట వినాలంటూ ఒత్తిడి చేయకూడదు. పిల్లలు ఏవిధంగా ఆలోచిస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. పిల్లల అభిరుచులను గమనిస్తూ ఉండాలి. సమయం దొరికినప్పుడల్లా పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి.
- పిల్లల మీద అతిగా ప్రేమ చూపిస్తూ వాళ్లు ఏమి చేసినా సమర్థించడం కూడా మంచిది కాదు. పిల్లలకు సమయపాలన, తోటివారితో స్నేహంగా ఉండడం, పెద్దలతో మర్యాదగా మెలగడం, సమయస్ఫూర్తి నేర్పించాలి. పోషకాహారం, వ్యాయామం, వ్యక్తిగత శుభ్రతల గురించి తెలియజెప్పాలి.

దీపావళి అమ్మకాలు .. రూ.6 లక్షల కోట్లు

రికార్డు స్థాయిలో విక్రయాలు

50 లక్షల తాత్కాలిక కొలువులు: సీఏఐటీ



న్యూఢిల్లీ: ఈ ఏడాది దీపావళి రిటైల్ రంగానికి బాగానే కలిసొచ్చింది. ఈ పండగ సీజన్‌లో దేశ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో రూ.6.05 లక్షల కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.1.8 లక్షల కోట్లు ఎక్కువని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) తెలిపింది. దీనికి తోడు 50 లక్షల తాత్కాలిక కొలువులూ ఏర్పడ్డాయి. ఈ ఏడాది దీపావళికి నమోదైన రూ.6.05 లక్షల కోట్ల అమ్మకాల్లో 75 శాతం అమ్మకాలు నాన్-కార్పొరేట్, సంప్రదాయ మార్కెట్ల నుంచి నమోదైంది. మళ్లీ ఇందులో రూ.5.4 లక్షల కోట్లు వస్తువుల అమ్మకాల ద్వారా, రూ.65,000 కోట్లు సేవల ద్వారా నమోదైనట్టు సీఏఐటీ తెలిపింది. రాష్ట్రాల రాజధానులు, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని 60 ప్రధాన పంపిణీ కేంద్రాల కేంద్రాల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్టు పేర్కొంది.

జీఎస్‌టీతో బూస్ట్: ప్రభుత్వం జీఎస్‌టీ రేట్లను కుదించడం ఈ సంవత్సరం దీపావళి అమ్మకాలకు బాగా దోహదం చేసినట్టు 72 శాతం మంది వ్యాపారులు వెల్లడించటం విశేషం. జీఎస్‌టీ తగ్గింపుతో ఈ ఏడాది నిత్యావసరాలు, పాదరక్షలు, దుస్తులు, మిఠాయిలు, గృహాలంకరణ, వినియోగ వస్తువులు బాగా అమ్ముడుపోయాయి. ఈ అమ్మకాల జోరు ఈ ఏడాది చలికాలం, పెళ్లిళ్ల సీజన్, సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి వరకు కొనసాగుతుందని సీఏఐటీ అంచనా. ఈ ఏడాది దీపావళికి నమోదైన రూ.6.05 లక్షల కోట్ల అమ్మకాల్లో 28 శాతం అమ్మకాలు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల నుంచి నమోదవడం విశేషం.

ఈ-కామర్స్‌దీ అదే బాట

ఈ దీపావళి ఈ-కామర్స్ దిగ్గజాలకూ బాగానే కలిసొచ్చింది. గత ఏడాది దీపావళితో పోలిస్తే ఈ ఏడాది దీపావళికి ఈ సంస్థల అమ్మకాల పరిమాణం 24 శాతం పెరిగింది. విలువపరంగా చూసినా 23 శాతం వృద్ధి రేటు నమోదైందని యూనికామర్స్ అనే సంస్థ తెలిపింది. ఇదే సమయంలో క్విక్ కామర్స్ కంపెనీల ఆర్డర్ల పరిమాణమైతే 120 శాతం పెరిగింది. బ్రాండ్ వెబ్‌సైట్ల అమ్మకాల్లోనూ 33 శాతం వృద్ధి రేటు కనిపించింది. ఈ దీపావళికి నమోదైన 15 కోట్ల ఆన్‌లైన్ ఆర్డర్లను పరిశీలించి యూనికామర్స్ సంస్థ ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది.

లక్ష కార్ల డెలివరీ
టాటా మోటార్స్

ఈ పండగల సీజన్ టాటా మోటార్స్‌కీ బాగానే కలిసొచ్చింది. ఈ ఏడాది దసరా నవరాత్రుల నుంచి దీపావళి వరకు లక్షకు పైగా కార్లను కొనుగోలుదారులకు డెలివరీ ఇచ్చింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 33 శాతం ఎక్కువని తెలిపింది. ఇందులో ఎస్‌యూవీలే 38,000 వరకు ఉన్నట్టు పేర్కొంది.

ఐటీలో మళ్లీ నియామకాల జోరు!

- కోలుకుంటున్న ఐటీ మార్కెట్
- హైదరాబాద్, విశాఖలపైనా కంపెనీల దృష్టి
- ఏఐ నిపుణులకు యమ గిరాకీ

అడెకో ఇండియా



ముంబై: భారత ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ (ఐటీ) రంగం క్రమంగా గాడిన పడుతోంది. నిన్న మొన్నటి వరకు అంతంత మాత్రంగా ఉన్న ప్రాజెక్టుల రాక కొద్దిగా ఊపందుకుంది. దీంతో ఐటీ కంపెనీలు మళ్లీ నియామకాలపై దృష్టి పెట్టాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలలతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి ఆరు నెలల్లో నియామకాలు 27 శాతం పెరిగాయి. కంపెనీలకు మానవ వనరుల (హెచ్‌ఆర్) సేవలు అందించే అడెకో ఇండియా ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో నియామకాలు మరింత జోరందుకుంటాయని ఈ సంస్థ అంచనా. ఐటీ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులు క్రమంగా పుంజుకోవడమే ఇందుకు ప్రధాన కారణం.

చిన్న నగరాలకూ వ్యాప్తి: ఐటీ కంపెనీలు గతంలో నియామకాల కోసం పెద్ద నగరాలపైనే దృష్టి పెట్టేవి. ఇప్పుడు క్రమంగా విశాఖపట్నం, ఉదయపూర్, నాగపూర్, కోయంబత్తూర్, ఇండోర్ వంటి చిన్న నగరాలపైనా దృష్టి పెడుతున్నాయి. దీంతో గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలతో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఈ చిన్న నగరాల నుంచి నియామకాలు 7 శాతం పెరిగినట్టు అడెకో ఇండియా నివేదిక తెలిపింది. అయినా కంపెనీలు ఇప్పటికీ బెంగళూరు, హైదరాబాద్, పుణె, ఢిల్లీ వంటి పెద్ద నగరాల నుంచే ఎక్కువ మందిని నియమించుకుంటున్నాయి. హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఐటీ నిపుణుల కోసం గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ).. ఐటీ కంపెనీలతో పోటీపడుతున్నాయి.

జీతాలూ పెరిగాయి: నియామకాలతో పాటు ఐటీ ఉద్యోగుల జీతాల్లోనూ ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 5 శాతం పెరుగుల కనిపించింది. ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ప్రత్యేక డొమైన్స్‌లో అవసరమైన నైపుణ్యాలు దొరకడం ఇప్పుడు కంపెనీలకు పెద్ద సమస్యగా మారింది. భారీ జీతాలు ఇస్తామన్నా సరైన నిపుణులు దొరకడం లేదు. ఈ డొమైన్లలో పట్టున్న నిపుణుల కొరత ప్రస్తుతం 45 నుంచి 50 శాతం వరకు ఉన్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు యాభై ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్టు అడెకో ఇండియా తెలిపింది.

ఫ్రెషర్లకు మంచి రోజులు

నిన్న మొన్నటి వరకు ఐటీ కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలు చాలా వరకు పక్కన పెట్టాయి. ప్రధాన కంపెనీలు కూడా ఇచ్చిన ఆఫర్లను సైతం ఏదో ఒక పేరుతో పక్కన పెట్టేవి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పరిస్థితి కొద్దిగా మారింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలలతో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలు 25 శాతం పెంచినట్టు అడెకో తెలిపింది. అయితే కంపెనీలు గతంలోలా అల్లాటప్పా కాలేజీలకు వెళ్లడం లేదు. మంచి పేరు ప్రతిష్ఠలున్న ఇంజనీరింగ్, టెక్నికల్ సంస్థలకు వెళ్లి ఫ్రెషర్లను తీసుకుంటున్నట్టు అడెకో ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప చెప్పారు. అది కూడా అన్ని విభాగాల వారికి కాకుండా కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి డొమైన్లలో ప్రాక్టికల్ నైపుణ్యాలు ఉన్న ఫ్రెషర్లకు మాత్రమే ఆఫర్ లెటర్లు ఇస్తున్నాయి. దీనికి తోడు గతంలోలా ఆఫర్ లెటర్లు ఇచ్చి శిక్షణ ఇవ్వడం కాకుండా తమకు అవసరమైన డొమైన్లలో కాలేజీల్లోనే శిక్షణఇచ్చి మరీ జాబ్స్‌లోకి తీసుకుంటున్నాయి.

తగ్గిన ఎన్‌ఆర్‌ఐ డిపాజిట్లు

ముంబై: మన బ్యాంకులకు ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐ) పంపే డిపాజిట్లు తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది ఏప్రిల్-జూలై మధ్య 580 కోట్ల డాలర్లుగా ఉన్న ఈ డిపాజిట్లు.. ప్రస్తుత సంవత్సరం ఇదే కాలంలో 470 కోట్ల డాలర్లకు పడిపోయాయి. దీంతో దేశంలోని బ్యాంకుల్లో ఎన్‌ఆర్‌ఐల డిపాజిట్లు గత ఏడాది జూలై నాటికి 16,823 కోట్ల డాలర్ల నుంచి ఈ ఏడాది జూలై నాటికి 16,786 కోట్ల డాలర్లకు పడిపోయినట్టు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తెలిపింది. ఎన్‌ఆర్‌ఐలు పంపించే ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (బ్యాంకు) డిపాజిట్లు తగ్గిపోవడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

స్వల్ప లాభాలతో సంవత్ 2082కి స్వాగతం

సెన్సెక్స్ 63 పాయింట్లు. నిఫ్టీ 25 పాయింట్లు అప్

ముంబై: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన ముహూరత్ ట్రేడింగ్ మందకొడిగా సాగింది. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల నడుమ ఈక్విటీ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. సంవత్ 2082కు స్వాగతం పలుకుతూ మంగళవారం మధ్యాహ్నం 1.45 నుంచి 2.45 మధ్యలో నిర్వహించిన ప్రత్యేక ముహూరత్ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 62.97 పాయింట్ల లాభంతో 84,426.34 వద్ద ముగిసింది. ఒక దశలో సెన్సెక్స్ 84,665.44 పాయింట్ల గరిష్ఠ స్థాయిని, 84,286.40 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 25.45 పాయింట్ల లాభంతో 25,868.60 వద్ద క్లోజైంది. సంవత్ 2082 ప్రారంభమవుతున్న శుభ సమయాన ట్రేడర్లు, ఇన్వెస్టర్లు కొత్త పద్దు పుస్తకాలు తెరిచారు.

- బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.23% లాభంతో 46,787.20 వద్ద, స్మాల్‌క్యాప్ 0.91% లాభంతో 53,842.85 వద్ద ముగిశాయి. రంగాలవారీ సూచీల్లో ఇండస్ట్రియల్స్, టెలి కమ్యూనికేషన్, కమోడిటీస్, యంత్రపరికరాలు, సర్వీసెస్, మెటల్ సూచీలు లాభపడగా బ్యాంకెక్స్ రియల్టీ స్వల్పంగా నష్టపోయాయి.



ముహూరత్ ట్రేడింగ్ సందర్భంగా గంట కొట్టి ట్రేడింగ్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్

- సోమవారంతో ముగిసిన సంవత్ 2081లో సెన్సెక్స్ 4974.31 పాయింట్లు (6.26%), నిఫ్టీ 1637.8 పాయింట్లు (6.76%) లాభపడ్డాయి. సోమవారం సెన్సెక్స్ 411.18 పాయింట్లు, నిఫ్టీ 133.30 పాయింట్లు లాభపడ్డాయి.

నేడు మార్కెట్లకు సెలవు

బలిప్రతిపాద పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. ఫారెక్స్ మార్కెట్లు కూడా పని చేయవు. గురువారం మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

అరేబియన్ కన్‌స్ట్రక్షన్స్‌లో సింప్లీజిత్‌కు వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన సింప్లీజిత్ గ్రూప్.. అరేబియన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఏసీసీ) ఇండియా ఈక్విటీలో మెజారిటీ వాటా దక్కించుకుంది. అయితే ఎంత మొత్తంతో ఎంత ఈక్విటీ కొనుగోలు చేసిందనే విషయాన్ని మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ కొనుగోలు ద్వారా భారీ రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలవుతుందని సింప్లీజిత్ తెలిపింది. సింప్లీజిత్ గ్రూప్ ప్రస్తుతం ఫైనాన్స్, ఎగుమతుల రంగంలో ఉంది. కంపెనీ చేతిలో ప్రస్తుతం రూ.2,300 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	553
చిత్తూరు	583	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	126
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	115
కర్నూలు	112	నెల్లూరు	120
విశాఖపట్నం	129	అనంతపురం	120
గోదావరి	126		

టాటా ట్రస్ట్స్ ట్రస్టీగా వేణు శ్రీనివాసన్

మెహ్లీ మిస్త్రీ పునర్నియామకంపై సస్పెన్స్

న్యూఢిల్లీ: టీవీఎస్ గ్రూప్ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్.. టాటా ట్రస్ట్స్ జీవితకాల ట్రస్టీగా పునర్నియమితుయారు. ఈ నెల 17న జరిగిన సమావేశంలో టాటా ట్రస్ట్స్ దీనికి సంబంధించిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించినట్టు సమాచారం. గురువారంతో శ్రీనివాసన్ పదవీకాలం ముగుస్తుంది. టాటా ట్రస్ట్స్ ఈ లోపే ఆయన్ని మళ్లీ జీవిత కాలానికి ట్రస్టీగా పునర్నియమించడం విశేషం. ఇప్పుడు ఇక అందరి దృష్టీ షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు ప్రాతినిధ్యం వహిస్తున్న మెహ్లీ మిస్త్రీ పునర్నియామకంపై పడింది. ఈయన పదవీ కాలం ఈ నెల 28తో ముగుస్తుంది. టాటా ట్రస్ట్స్‌లో అంతర్యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,32,770 ▲	1,21,700 ▲	1,88,000 ▼
విజయవాడ	1,32,150 ▼	1,26,000 ▼	1,62,200 ▼
విశాఖపట్నం	1,30,850 ▼	1,19,950 ▲	1,88,000 ▼
రాజమండ్రి	1,30,580 ▼	1,19,700 ▼	1,74,000 ▼
ప్రొద్దుటూరు	1,32,200 ▼	1,21,620 ▼	1,68,000 ▼
ముంబై	1,27,633 ▼	1,16,912 ▼	1,63,050 ▼

స్పోర్ట్స్



అడిలైడ్ పిచ్‌పై యూవీ లైట్లు

ఆసీస్‌తో భారత్ రెండో వన్డేకు ముందు జాగ్రత్త చర్యలు

న్యూఢిల్లీ: ఆదివారం ఆతిథ్య ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరిగిన తొలి వన్డేకు వర్షం నాలుగుసార్లు అడ్డుపడింది. పెర్త్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌ను వరుణుడి కారణంగా 26 ఓవర్లకు కుదించాల్సి వచ్చింది. పదేపదే వర్షం అంతరాయంతో పచ్చికపై తేమ పెరగడం, పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలించడంతో ఓ దశలో టీమిండియా 45 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొనే గురువారం అడిలైడ్ ఓవల్ స్టేడియంలో జరిగే రెండో వన్డేకు అక్కడి గ్రౌండ్ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం అక్కడ కూడా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. పిచ్‌పై తేమ శాతం పెరగకుండా ఉండేందుకు అల్ట్రావైలెట్ లైట్ల (అతినీలలోహిత కాంతి)తో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక వేడితో కూడుకున్న వెలుతురు వచ్చే ఈ యూవీ లైట్లను పిచ్‌పై ఉంచుతున్నారు. ఇలా చేయడం వల్ల తేమశాతం తగ్గడమే గాకుండా పిచ్ పొడిగా ఉంటుంది. అయితే, రెండో వన్డే రోజు అక్కడ వర్షం కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ చెబుతోంది.


కెప్టెన్‌ను మళ్లీ మార్చారు

పాక్ వన్డే సారథి రిజ్వాన్‌కు ఉద్వాసన
షహీన్ షా అఫ్రీదికి పగ్గాలు



అఫ్రీది

కరాచీ: పాకిస్థాన్ క్రికెట్ సారథిని మరోసారి మార్చారు. ఈసారి వన్డే కెప్టెన్ రిజ్వాన్‌పై వేటుపడింది. వచ్చే నెల ఆరంభంలో దక్షిణాఫ్రికాతో మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌కు సీనియర్ పేసర్ షహీన్ షా అఫ్రీదికి సారథ్య బాధ్యతలు అప్పగించారు. వైట్‌బాల్ కోచ్ మైక్ హెస్సన్ సూచనల మేరకే నాయకత్వ మార్పు జరిగినట్టు తెలుస్తోంది. కోచ్‌గా హెస్సన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు మాత్రమే రిజ్వాన్‌తో కలిసి పనిచేశాడు. ఇంత తక్కువ సమయంలో కెప్టెన్‌పై హెస్సన్ ఇలాంటి అభిప్రాయానికి రావడంపై మాజీ ఆటగాళ్లు ఆశ్చర్యం వ్యక్తం చేసున్నారు. కానీ, కొందరు మాత్రం అసలు కారణాలు వేరే ఉన్నాయని చెబుతున్నారు. రిజ్వాన్‌లో మత మౌఢ్యం రోజురోజుకూ పెరిగిపోతోందని..డ్రెస్సింగ్ రూమ్‌లో ఆట గురించి కాకుండా మతపరమైన విషయాలు ఎక్కువగా మాట్లాడుతున్నాడని సమాచారం. రిజ్వాన్‌ను తప్పించాలన్న నిర్ణయం వెనుక సెలెక్షన్ కమిటీ, హైపర్ఫామెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావెద్‌తోపాటు పీసీబీ చైర్మన్, మాజీ కెప్టెన్లు మిస్బావుల్ హక్, సర్ఫరాజ్ ఖాన్‌ల ప్రమేయం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే పాలస్తీనా గురించి బహిరంగంగా మాట్లాడడం కూడా ఓ కారణం అంటున్నారు. ముఖ్యంగా బెట్టింగ్ కంపెనీలను తాను ఎండార్స్ చేయనని రిజ్వాన్ అన్నాడు. అయితే బెట్టింగ్ కంపెనీలతో ఒప్పందాలున్న పాక్ క్రికెట్ బోర్డుకు ఇది ఇబ్బంది కల్గించివుండవచ్చు.



దుబాయ్ రండి.. ట్రోఫీ ఇస్తా

తీరు మారని నఖ్వీ

పద్ధతి మార్చుకోవాలని బీసీసీఐ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఆసియా కప్ ముగిసి మూడు వారాలు దాటినా.. ట్రోఫీ మాత్రం విజేత భారత్ చెంతకు చేరలేదు. ఈ విషయంలో ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీని బీసీసీఐ మరోసారి తీవ్రంగా హెచ్చరించింది. ట్రోఫీని సరైన పద్ధతిలో భారత్‌కు చేర్చాలని డిమాండ్ చేస్తూ మెయిల్ చేసింది. ఇందుకు అఫ్ఘానిస్థాన్, శ్రీలంక బోర్డులు కూడా బీసీసీఐకి మద్దతుగా నిలిచాయి. అయితే, తీరు మారని నఖ్వీ.. ట్రోఫీ అప్పగిస్తానంటూనే కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. అదేంటంటే.. వచ్చేనెల 10న దుబాయ్‌లో ఓ ఈవెంట్‌ను ఏర్పాటు చేస్తామనీ, ఆ కార్యక్రమానికి భారత కెప్టెన్ సూర్యకుమార్ సహా జట్టు సభ్యులంతా రావాలని బీసీసీఐకి పంపిన లేఖలో కోరారు. ఆ ఈవెంట్‌లో తన చేతులమీదుగానే ట్రోఫీ అందిస్తానని అందులో వివరించారు. ఇదిలా ఉండగా.. వచ్చే నెలలో జరిగే ఐసీసీ సమావేశంలో నఖ్వీపై బీసీసీఐ ఫిర్యాదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఆసియా కప్ ఫైనల్లో పాక్‌ను ఓడించిన భారత్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

టాప్ లేపిన సఫారీలు

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
ఆస్ట్రేలియా x ఇంగ్లండ్

- అదరగొట్టిన వొల్వార్ట్, కాప్
- 150 పరుగులతో పాక్ చిత్తు

మహిళల వన్డే వరల్డ్‌కప్



లారా వొల్వార్ట్ (90)

కొలంబో: కెప్టెన్ లారా వొల్వార్ట్ (90) దూకుడైన ఇన్నింగ్స్‌కు మరిజానె కాప్ (68 నాటౌట్, 3/20) ఆల్‌రౌండ్ షో తోడుకావడంతో.. మహిళల వరల్డ్ కప్‌లో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసిన దక్షిణాఫ్రికా 10 పాయింట్లతో టాప్‌నకు చేరుకొంది. మంగళవారం జరిగిన వర్ష ప్రభావిత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 150 పరుగుల (డ/లూ పద్ధతి) తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ ఓటమితో పాక్ సెమీస్ ఆశలు ఆవిరయ్యాయి. వర్షం కారణంగా 40 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో తొలుత సౌతాఫ్రికా 9 వికెట్లకు 312 పరుగులు చేసింది. మెగా టోర్నీ చరిత్రలో సఫారీలకు ఇదే అత్యధిక స్కోరు. సునె లుస్ (61), డి క్లెర్క్ (41) అదరగొట్టారు. నష్రా సంధు, సాదియా చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం డక్‌వర్త్-లూయిస్ పద్ధతి ప్రకారం తొలుత పాక్ లక్ష్యాన్ని 40 ఓవర్లలో 306 పరుగులుగా నిర్ణయించారు. అయితే, పలుమార్లు వర్షం ఆటంకం కలిగించడంతో టార్గెట్‌ను 20 ఓవర్లలో 234 పరుగులకు కుదించారు. కానీ, ఓవర్లన్నీ ఆడిన పాక్ 83/7 స్కోరు మాత్రమే చేసింది.

బ్రిట్స్ విఫలం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. తన్జిమ్ బ్రిట్స్ (0) డకౌట్ అయింది. మరో ఓపెనర్ లారా, లుస్ రెండో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. ఆఖర్లో కాప్‌తోపాటు డి క్లెర్క్ మెరుపులు మెరిపించడంతో సౌతాఫ్రికా సులువుగా 300 మార్క్ దాటింది.

సంక్షిప్త స్కోర్లు: సౌతాఫ్రికా: 40 ఓవర్లలో 312/9 (లారా 90, కాప్ 68 నాటౌట్, లుస్ 61; నష్రా 3/45, సైదా 3/63); **పాకిస్థాన్:** 20 ఓవర్లలో 83/7 (సిద్రా 22 నాటౌట్, నటాలియా 20; కాప్ 3/20, షంగసె 2/19).

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
దక్షిణాఫ్రికా	6	5	1	0	10	0.276
ఆస్ట్రేలియా	5	4	0	1	9	1.818
ఇంగ్లండ్	5	4	0	1	9	1.490
భారత్	5	2	3	0	4	0.526
న్యూజిలాండ్	5	1	2	2	4	-0.245
శ్రీలంక	6	1	3	2	4	-1.035
బంగ్లాదేశ్	6	2	5	0	2	-0.578
పాకిస్థాన్	6	0	4	2	2	-2.651

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

- సోమవారం ముంబైలో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 7 పరుగులతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. తొలుత లంక 48.4 ఓవర్లలో 202 రన్స్‌కు ఆలౌటైంది. ఛేదనలో బంగ్లా ఓవర్లన్నీ ఆడి 195/9 స్కోరే చేసింది.

పంత్‌కు ఇండియా-ఎ పగ్గాలు



న్యూఢిల్లీ: స్వదేశంలో దక్షిణాఫ్రికా-ఎ జట్టుతో ఆడే రెండు 4డే మ్యాచ్‌లకు ఇండియా-ఎ బృందాన్ని బీసీసీఐ సీనియర్ సెలెక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు వికెట్‌కీపర్ రిషభ్ పంత్‌ను సారథిగా సెలెక్టర్లు నియమించారు. ఈ ఏడాది జూలైలో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా మాంచెస్టర్‌లో గాయపడిన పంత్ ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు.

కశ్మీర్ క్రికెటర్ పర్వేజ్ రసూల్ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ నుంచి ప్రాతినిథ్యం వహించిన తొలి క్రికెటర్‌గా రికార్డుకెక్కిన పర్వేజ్ రసూల్ తన కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. క్రికెట్‌లో అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్టు 36 ఏళ్ల రసూల్ ప్రకటించాడు. కుడిచేతివాటం ఆఫ్‌స్పిన్నర్‌గా 2014లో జాతీయ జట్టులో అరంగేట్రం చేసిన రసూల్ ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడాడు. బంగ్లాదేశ్‌తో ఆడిన ఆ మ్యాచ్‌లో పది ఓవర్లలో 60 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. ఇక, ఒకే ఒక టీ20ని 2017లో ఇంగ్లండ్‌తో ఆడాడు. ఆ మ్యాచ్‌లో 5 పరుగులు చేసిన అతను ఒక వికెట్ పడగొట్టాడు. ఇక, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్న రసూల్ 5,648 పరుగులు చేయడంతో పాటు 352 వికెట్లు పడగొట్టాడు. జాతీయ జట్టుకే గాకుండా ఐపీఎల్ తరఫున ప్రాతినిథ్యం వహించిన తొలి కశ్మీర్ క్రికెటర్‌గానూ రసూల్ నిలిచాడు. పుణె వారియర్స్, బెంగళూరు, సన్‌రైజర్స్ జట్లకు ఆడిన రసూల్ 11 మ్యాచుల్లో 4 వికెట్లు తీశాడు.

కేశవ్‌కు ఏడు వికెట్లు

- పాక్ 333 ఆలౌట్

రావల్పిండి: స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (7/102) విజృంభించడంతో.. దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 333 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (66) రాణించాడు. అనంతరం సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 185/4 స్కోరు చేసింది. మంగళవారం ఆట ఆఖరుకు ట్రిస్టన్ స్టబ్స్ (68), కైల్ వెరిన్నే (10) క్రీజులో ఉన్నారు. టోనీ డి జార్జ్ (55) హాఫ్ సెంచరీ సాధించాడు.

శాఫ్ క్రీడలకు వెంకట్రామ్, మోహిత్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దక్షిణాసియా అథ్లెటిక్స్ ఫెడరేషన్ (శాఫ్) పోటీల్లో తెలుగు క్రీడాకారులు వెంకట్రామ్ రెడ్డి (కర్నూలు), మోహిత్ చౌధురి (నాగర్‌కర్నూల్) భారత్ తరఫున బరిలోకి దిగుతున్నారు. గురువారం నుంచి రాంచీలో మూడ్రోజులపాటు జరిగే ఈ టోర్నీలో భారత్‌తో పాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మాల్దీవులు, అఫ్ఘానిస్థాన్ దేశాలు పోటీ పడనున్నాయి. పురుషుల 800 మీటర్ల పరుగులో వెంకట్రామ్, 5 వేల మీటర్ల పరుగు పోటీకి మోహిత్ అర్హత సాధించారు. ఇక, బహ్రెయిన్‌లో బుధవారం నుంచి జరిగే ఆసియా యూత్ గేమ్స్‌లో యశ్విత (శ్రీకాకుళం) హైజంప్‌లో భారత్ తరఫున పోటీ పడనుంది.

వెస్టిండీస్ 'సూపర్' విన్

మిర్పూర్: తొలి మ్యాచ్ నెగ్గి జోరుమీదున్న బంగ్లాదేశ్‌కు రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ ఝలకిచ్చింది. ఈ మ్యాచ్‌లో సూపర్ ఓవర్లో నెగ్గిన వెస్టిండీస్ సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. తొలుత బంగ్లాదేశ్ 7 వికెట్లకు 213 రన్స్ చేసింది. సౌమ్య సర్కార్ (45) టాప్‌స్కోరర్. మోటీ 3, అకీల్, అథనజె చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో కెప్టెన్ హోప్ (53 నాటౌట్) రాణించడంతో విండీస్ 9 వికెట్లకు 213 రన్స్ చేసి స్కోరు సమం చేసింది. దీంతో సూపర్ ఓవర్‌లో మొదట 10/1 చేసిన విండీస్.. తర్వాత బంగ్లాను 9/1కే పరిమితం చేసి పరు గు తేడాతో నెగ్గింది.

50 ఓవర్లూ స్పిన్నర్లతోనే..

ఈ మ్యాచ్‌తో వెస్టిండీస్ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో విండీస్ తరఫున బౌలింగ్ చేసిన ఐదుగురూ స్పిన్నర్లే కావడం విశేషం. ఇలా.. ఒక వన్డేలో మొత్తం 50 ఓవర్లనూ స్పిన్నర్లతోనే బౌలింగ్ చేయించిన తొలి జట్టుగా విండీస్ చరిత్ర సృష్టించింది. ఈ రికార్డు ఇంతకుముందు శ్రీలంక (1996లో 44 ఓవర్లు) పేరిట ఉండేది. మొత్తంగా ఈ మ్యాచ్‌లో 92 ఓవర్లు స్పిన్నర్లే వేశారు. దీంతో అంతకుముందు ఉన్న 78 ఓవర్ల రికార్డు చెరిగిపోయింది.

కివీస్‌కు ఇంగ్లండ్ ఝలక్

క్రైస్ట్‌చర్చ్: మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ 65 పరుగుల తేడాతో గెలిచింది. ఫిల్ సాల్ట్ (85), హ్యారీ బ్రూక్ (78) చెలరేగడంతో మొదట ఇంగ్లండ్.. 20 ఓవర్లలో 4 వికెట్లకు 236 పరుగుల భారీ స్కోరు సాధించింది. బెథెల్ (12 బంతుల్లో 24), ఆఖర్లో టామ్ బాంటమ్ (12 బంతుల్లో 29) వేగంగా ఆడారు. జేమీసన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో రషీద్ (4/32)తో పాటు మిగతా బౌలర్ల ధాటికి కివీస్ 18 ఓవర్లలో 171 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ సీఫెర్ట్ (39), శాంట్నర్ (36), చాప్‌మన్ (28) మినహా అంతా విఫలమయ్యారు. ల్యూక్ వుడ్, కార్స్, డాసన్ తలో రెండు వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా బ్రూక్ నిలిచాడు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వరయ్య

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర సమితి
- జాతీయ కార్యదర్శిగా రామకృష్ణ ఎన్నిక



అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా గుజ్జుల ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కె.రామకృష్ణ జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఒక ప్రకటనలో తెలిపారు. చండీగఢ్‌లో జరిగిన జాతీయ మహాసభల్లో రామకృష్ణను జాతీయ కార్యదర్శిగాను, మంగళవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈశ్వరయ్యను రాష్ట్ర కార్యదర్శిగాను ఎన్నుకున్నట్లు రాజా వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టులో ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన సీపీఐ రాష్ట్ర మహాసభల్లోనే నూతన కార్యదర్శి ఎన్నికను పూర్తి చేయాల్సి ఉండగా.. నాయకత్వం విషయంలో భిన్నాభిప్రాయాలు రావడంతో అప్పుడు వాయిదా వేశారు. 102 మంది సభ్యులతో నూతన రాష్ట్ర సమితి ఏర్పాటు కాగా.. అందులో 33 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా అప్పట్లో ఎన్నికయ్యారు. చండీగఢ్ జాతీయ మహాసభలు ముగిసిన తర్వాత రాష్ట్ర కార్యదర్శిని కూడా ఎన్నుకుంటామని అగ్ర నాయకత్వం నాడు ప్రకటించింది. చెప్పినట్లుగానే పార్టీలో ఏకాభిప్రాయం సాధించి ఈశ్వరయ్యను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. సీపీఐ నాయకురాలు పి.దుర్గాభవానీ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో ఈశ్వరయ్య పేరును రామకృష్ణ ప్రతిపాదించగా.. పార్టీ నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు బలపర్చారు. కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య విద్యార్థి దశ నుంచే సీపీఐలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. కాగా, ఈశ్వరయ్య నాయకత్వంలో రాష్ట్ర పార్టీ మరింత పటిష్ఠమై బలమైన ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని జాతీయ నాయకులు ఆకాంక్షించారు. నవంబరు 2, 3 తేదీల్లో జరగనున్న రాష్ట్ర సమావేశంలో భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

మూలపేట పోర్టుకు రూ.213.28 కోట్లు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు నిర్మాణంలో అదనపు పనుల కోసం రూ.213.28 కోట్లను విడుదల చేస్తూ మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంగళవారం ఉత్తర్వు జారీ చేసింది.

కాడా సిబ్బందికి 30లోగా జీతాలు

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నదీ పరీవాహక అభివృద్ధి సంస్థ (కాడా) సిబ్బంది జీతభత్యాలు ఈనెల 30వ తేదీలోగా చెల్లించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కాడాలోని ఎనిమిది మందికి జీతభత్యాలు చెల్లించలేదు. వీరికి 30వ తేదీలోగా జీతభత్యాలు చెల్లించేలా జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, కాడా పరిధిలో యాజమాన్య నిర్వహణకు రూ.31,02, 00,000 విడుదల చేస్తూ జల వనరుల శాఖ మంగళవారం ఉత్తర్వు జారీ చేసింది.

గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్లుగా పలువురికి పదోన్నతి

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు/నగర పంచాయతీల్లో పనిచేస్తున్న శానిటరీ సూపర్‌వైజర్లు/శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కేటగిరి-2 మేనేజర్లకు గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అదే విధంగా ఆరుగురు గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్లు, కేటగిరి-1 మేనేజర్లకు పదోన్నతి కల్పిస్తూ మున్సిపల్‌శాఖ మరో ఉత్తర్వును విడుదల చేసింది.

పట్టణ ప్రణాళికలకు నోడల్ అధికారులు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రాలకు ప్రత్యేక సాయంగా అందిస్తున్న 'స్కీం ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్' (ఎస్ఎస్ఏఎస్‌సీఐ 2025-26) అమలుకు 26 మంది నోడల్ అధికారులను నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

- నేడు వాయుగుండంగా మారే అవకాశం
- తర్వాత తీవ్ర వాయుగుండం, తుఫాన్‌గానూ మారే చాన్స్
- 24, 25 తేదీల్లో మరో అల్పపీడనం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



తిరుమలలో ఆలయం ముందు కురుస్తున్న వర్షం



నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఇళ్లలోకి వర్షం నీరు

నైరుతి బంగాళాఖాతంలో మంగళవారం ఉదయం అల్పపీడనం ఏర్పడి మధ్యాహ్నానికి తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది బుధవారం వాయుగుండంగా బలపడనుంది. వాయుగుండం ఎక్కడ తీరం దాటుతుందో వాతావరణ శాఖ వెల్లడించలేదు. కానీ, వాయుగుండం దక్షిణ కోస్తాంధ్ర తీరం దిశగా పయనించే క్రమంలో తీవ్ర వాయుగుండంగా లేదా తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు అంచనా వేశారు. గురువారం రాత్రి లేదా శుక్రవారంలోగా మచిలీపట్నం-నెల్లూరు మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీవ్ర అల్పపీడన ప్రభావంతో మంగళవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురిశాయి. బుధవారం రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అనేకచోట్ల, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అతిభారీ, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. దక్షిణ కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని అల్పపీడనం సోమవారం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇదిలావుండగా ఈనెల 24 లేదా 25న దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది బలపడి వాయుగుండంగా మారి ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరం దిశగా వచ్చే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. వరుస అల్పపీడనాలతో తమిళనాడు, కోస్తాంధ్ర, సీమల్లో వచ్చే వారం రోజులు వర్షాలు కురుస్తాయని, తీర ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఇంకా వచ్చే నెల తొలివారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. కాగా, రానున్న ఐదు రోజులు రాష్ట్రవ్యాప్తంగా పిడుగులతో కూడిన వర్షాలు విస్తారంగా కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. బుధవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని వివరించింది.

నెల్లూరు రోడ్లపై మోకాళ్లలోతు నీరు..

ఆరు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో నెల్లూరు జిల్లాలో జనజీవనం అతలాకుతలమైంది. నగరంలోని ఏ వీధిలో చూసినా మోకాళ్ల లోతు నీరు నిలబడింది. చేజర్ల, ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లో వరిపైరు నీట మునిగింది. సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాలతో బుధవారం జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

తిరుమలలో జోరువాన.. తిరుమలలో మంగళవారం జోరుగా వాన కురిసింది. శ్రీవారి ఆలయ ప్రాంతంతోపాటు మాడవీధులు, రోడ్లు, కాటేజీ ప్రాంతాలు తడిసిముద్దయ్యాయి. తిరుమలలో చలితీవ్రత కూడా పెరగడంతో పుష్కరిణిలో స్నానం చేసే వారి సంఖ్య తగ్గింది. అప్పుడప్పుడు దట్టమైన పొగమంచు తిరుమలను కమ్మేస్తోంది.

ప్రాణం పోతున్నా.. పట్టించుకోలా!

- రోడ్డుపక్కన కిందపడి కొట్టుకులాడిన వృద్ధురాలు
- రక్తం కక్కుతున్నా ఎవరూ పట్టించుకోని వైనం
- మనవడు, మనవరాలు ఏడుస్తున్నా సాయం చేయని జనం
- స్థానిక ఎస్ఐ గమనించి ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే కన్నుమూత.. బొబ్బిలిలో అమానవీయ ఘటన



అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలికి సపర్యలు చేస్తున్న ఎస్ఐ రమేశ్

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అది జనసంచారం ఎక్కువగానే ఉన్న ప్రాంతం. అలాంటి చోట ఓ వృద్ధురాలు రోడ్డు పక్కన పడిపోయి.. నోటివెంట రక్తం కారుతూ విలవిల్లాడుతుతోంది. చిన్న పిల్లలైన ఆమె మనవడు, మనవరాలు ఏం చేయాలో పాలుపోక రోదిస్తూ.. సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అయినా.. సాయం చేసేందుకు ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. చివరకు అటుగా వెళ్తున్న ఎస్ఐ గమనించి ఆమెను ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె ప్రాణాలు విడిచింది. విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలో ఈ హృదయ విదారక ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బొబ్బిలి గొల్లవీధికి చెందిన బొట్ల ఆదమ్మ (65) నాలుగైదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. కూలి పనులు చేసుకుని పొట్ట పోసుకునే ఆమె.. మంగళవారం తన మనవడు, మనవరాలిని తోడు తీసుకుని చికిత్స కోసం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. బీపీ మాత్రలు తీసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా గొల్లపల్లి ఆటోస్టాండ్ వద్ద కళ్లు తిరిగి పడిపోయింది. నోటివెంట రక్తం రావడం మొదలైంది. ఆమె మనవడు, మనవరాలు విలపిస్తున్నా.. అటుగా వెళ్లే జనం సాయం చేసేందుకు ముందుకు రాలేదు. అటుగా వెళ్తున్న ఎస్ఐ రమేశ్ గమనించి ఆమెకు సపర్యలు చేశారు. ఆటోలో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె మృతదేహాన్ని ఇంటికి పంపించి, అంత్యక్రియల కోసం కొంతమొత్తాన్ని ఎస్ఐ సమకూర్చారు. ఆదమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదమ్మ బీపీ మాత్రల కోసం వచ్చిందని, బీపీ ఎక్కువగానే ఉండడంతో సీహెచ్‌సీకి రిఫర్ చేశామని గొల్లపల్లి యూపీహెచ్‌సీ డాక్టర్ అనిత తెలిపారు. ఆమె మాత్రలు తీసుకుని వెళ్లిపోయిందని, తర్వాతేం జరిగిందో తమకు తెలీదని చెప్పారు.

భీమవరం డీఎస్పీపై పవన్ సీరియస్!

(మొదటి పేజీ తరువాయి)

జయసూర్య పాత్ర, వ్యవహారశైలిపై నివేదిక కోరారు. అసాంఘిక, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు డీఎస్పీ స్థాయి అధికారి అండగా ఉండడాన్ని తీవ్రంగా పరిగణించాలని.. పోలీసులు ఇటువంటి వ్యవహారాలతోపాటు సివిల్ వివాదాల్లో తల దూర్చకుండా చూడాలని సూచించారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తే ఎవ్వరినీ ఉపేక్షించబోమనే సంకేతాన్ని పంపాలని స్పష్టం చేశారు. పేకాట నిర్వాహకులపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయాలని, నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే ఫిర్యాదులపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ జయసూర్యపై తనకు వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను హోం మంత్రికి, డీజీపీకి తన కార్యాలయం నుంచి పవన్ పంపినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో సమాచారం సేకరిస్తున్నారు. విచారణకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఆరోపణల్లో వాస్తవాలున్నట్లు తేలితే జయసూర్యపై సస్పెన్షన్ వేటు తప్పదనే ప్రచారం పోలీసు వర్గాల్లో నడుస్తోంది. పూర్తి స్థాయి నివేదిక అందాక తదుపరి చర్యలు చేపడతామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సివిల్ తగాదాల్లో జయసూర్య!

- బదిలీ నిలిపివేయించిన కీలక నేతతో అంటకాగుతున్న డీఎస్పీ

భీమవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భీమవరం డీఎస్పీ గణేశ్ జయసూర్య సివిల్ తగాదాల్లో తలదూరుస్తున్నారని, ఓ వర్గం పేకాటలను ప్రోత్సహిస్తున్నారని బాధితులు ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. భీమవరం డివిజన్ పరిధిలోని ఓ నియోజకవర్గంలో డీఎస్పీయే పేకాటలను ప్రోత్సహిస్తున్నారని లేఖలు కూడా రాశారు. ప్రభుత్వం గతంలో ఈయన్ను భీమవరం నుంచి బదిలీ చేసింది. అప్పట్లో జిల్లాలోని కూటమికి చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి ద్వారా జయసూర్య బదిలీని నిలిపివేయించుకున్నారని అప్పట్లో చర్చసాగింది. అప్పటి నుంచి సదరు నేతకు ఆయన దాసోహమయ్యారన్న ప్రచారం ఉంది. అంతే కాకుండా డివిజన్ పరిధిలోని ఇతర కూటమి నేతలను పెద్దగా పట్టించుకోవడం లేదని.. వారికి కనీస ప్రాధాన్యం కూడా ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో పేకాటలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపినా.. సదరు నియోజకవర్గంలో మాత్రం పోలీసులే పేకాటలకు లోపాయకారీగా సహకరిస్తున్నారని, నిర్వాహకులను డీఎస్పీ ప్రోత్సహిస్తున్నారన్న అభియోగాలు అధికమయ్యాయి. వ్యాపారులు, ఇతర తగాదాల్లోనూ పోలీసు వసూళ్లు ఎక్కువగా ఉన్నాయంటూ జయసూర్యపై ఫిర్యాదులు వెళ్లాయి. డిప్యూటీ సీఎం తీవ్రంగా పరిగణించి ఎస్పీ, డీజీపీతో మాట్లాడడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

వెంకీ సరసన శ్రీనిధి



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ తొలి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రంలో హీరోయిన్‌గా కన్నడ నటి శ్రీనిధి శెట్టిని ఎంపిక చేశారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఈ విషయాన్ని మంగళవారం చిత్ర నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని సంస్థ వెల్లడించింది. శ్రీనిధి నటించిన 'తెలుసు కదా' చిత్రం ఇటీవల విడుదలైన సంగతి విదితమే. వెంకటేశ్ నటించిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ రచన చేశారు. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతోంది.

సంక్రాంతికి శర్వా చిత్రం




వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలయ్యే చిత్రాల లిస్ట్‌లోకి మరో సినిమా చేరింది. శర్వానంద్ హీరోగా నటిస్తున్న 'నారీ నారీ నడుమ మురారి' చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర వెల్లడించారు. 'సామజవరగమన' చిత్ర దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి సందర్భంగా సాంప్రదాయ పంచె కట్టులో ఉన్న శర్వానంద్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసి విడుదల విషయాన్ని ప్రకటించారు నిర్మాతలు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. సాక్షి వైద్య, సంయుక్త కథానాయికలుగా నటిస్తున్నారు.

బైక్ రేసర్‌గా...



మోటార్ బైక్ రేసర్‌గా శర్వానంద్ నటిస్తున్న చిత్రానికి 'బైకర్' అనే పేరు నిర్ణయించారు. 1990- 2000 సంవత్సరాల బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకుడు. వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్‌ను, ఫస్ట్ లుక్‌ను దీపావళి సందర్భంగా విడుదల చేశారు. మాళవిక నాయర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం పూర్తి కావచ్చింది.


నవ్వుల నవాబు అస్రాని ఇకలేరు



ఉత్తరాది ప్రేక్షకులను తన నటనతో కడుపుబ్బా నవ్వించిన నవ్వుల నవాబు గోవర్ధన్ అస్రాని(84) కన్నుమూశారు. 'షోలే'లో కోట్లాది మందిని తన సహజ సిద్ధమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్న జైలర్ సాబ్ ఇక లేరు అని తెలియగానే బాలీవుడ్ విషాదంలో మునిగిపోయింది. అస్రాని నిష్క్రమణతో ఓ శకం ముగిసిందని సినీ అభిమానులు, ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య కారణాలతో నాలుగు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరిన అస్రాని, సోమవారం చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. అస్రాని చనిపోయే కొన్ని గంటల ముందు కూడా సోషల్ మీడియా వేదిక ద్వారా అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. 'నా అంత్యక్రియలకు ఎవ్వరినీ పిలిచి ఇబ్బంది పెట్టొద్దు, నేను ఒక కామన్‌మ్యాన్‌గానే వెళ్లిపోవాలి' అని భార్య మంజు అస్రానితో ఆయన చెప్పారట.

మలుపు తిప్పిన 'షోలే'

1941లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు గోవర్ధన్ అస్రాని. సినిమా నటుడు కావాలనే ఆశయంతో కెరీర్ ఆరంభంలో పలు గుజరాతీ చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించారు అస్రాని. ఆ తర్వాత ముంబైకి చేరుకుని పుణేలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నారు. 'హరే కాంచ్ కి ఛుడియాన్' ఆయన మొదటి హిందీ సినిమా. 'సత్యకం', 'గుడ్డి' సినిమాలు ఆయనకు నటుడిగా గుర్తింపు తెచ్చిపెట్టాయి. 'షోలే' సినిమాలో అస్రాని చేసిన జైలర్ పాత్ర ఆయన కెరీర్‌ను మలుపుతిప్పింది. ఆ సినిమాలో అస్రాని చెప్పిన పలు సంభాషణలను ప్రేక్షకులు ఇప్పటికీ గుర్తుంచుకోవడం విశేషం. ఈ జైలర్ పాత్రను హాలీవుడ్ కమెడియన్ ఛార్లీ చాప్లిన్ స్ఫూర్తితో తయారుచేసినట్లు ఆ చిత్ర దర్శకుడు రమేశ్ సిప్పీ ఓ సందర్భంలో తెలిపారు. 'అభిమాన్', 'ఛోటీ సీ బాత్', 'నమక్ హరామ్' వంటి చిత్రాల్లో ఆయన నటనను ప్రేక్షకులు విశేషంగా ఆదరించారు. కమెడియన్‌గా మెప్పిస్తూనే అన్ని రకాల పాత్రల్లో నటించారు. 1975లో విడుదలైన 'చైతాలి' చిత్రంలో ప్రతినాయకుడి పాత్రనూ పోషించారు. దర్శకుడు ప్రియదర్శన్‌తో ఆయన 'హేరా ఫేరీ', 'చుప్ చుప్ కే', 'గరం మసాలా' వంటి చిత్రాలు చేశారు. ప్రస్తుతం ప్రియదర్శన్ దర్శకత్వంలో అస్రాని నటిస్తున్న 'హైవాన్', 'భూత్ బంగ్లా' చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. ఆయన నటించిన ఏకైక తెలుగు చిత్రం మహేశ్‌బాబు తొలి చిత్రం 'రాజకుమారుడు' కావడం విశేషం. దర్శకుడుగా పలు సినిమాలు తెరకెక్కించారు. 1973లో 'ఆజ్ కీ తాజా' సినిమా సెట్స్‌లో సహ నటి మంజుతో ప్రేమలో పడి, ఆమెను వివాహం చేసుకున్నారు. వారికి పిల్లలు లేరు.






కె-ర్యాంప్‌ను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు

దిల్ రాజు

గతేడాది 'క' చిత్రం సక్సెస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నాను. ఇప్పుడు 'కె-ర్యాంప్' చిత్రం విజయోత్సవానికి అతిథిగా వచ్చాను. అనుభవజ్ఞులు, యువతరం కలసి పనిచేయడం, కిరణ్ లాంటి హీరో ఉండడం వల్ల ఈ సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు' అని నిర్మాత దిల్‌రాజు అన్నారు. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మక్ నిర్మించిన చిత్రమిది. ఇటీవలే విడుదల చక్కటి ఆదరణతో కొనసాగుతోన్న సందర్భంగా మంగళవారం చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'టెక్నీషియన్లందరూ ఈ సినిమాకు తమ బెస్ట్ ఇచ్చారు. నా నమ్మకాన్ని నిలబెడుతూ నా కెరీర్‌లో పెద్ద హిట్‌గా ఈ చిత్రం నిలిచింది' అన్నారు. 'కుటుంబ ప్రేక్షకులు మా చిత్రాన్ని అమితంగా ఆదరిస్తున్నారు. కిరణ్ గారితో మరిన్ని సినిమాలు చేస్తాను' అని రాజేశ్ దండా చెప్పారు.

కొత్త సింఫనీ రూపకల్పన



దీపావళి పండుగ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు, ఇసైజ్ఞాని ఇళయరాజా సరికొత్త విషయాన్ని వెల్లడించారు. 'సింఫనిక్ డ్యాన్సెస్' పేరుతో కొత్త సింఫనీని రూపొందించనున్నట్లు వెల్లడించారు. భారతీయ సంగీత ప్రతిభను ప్రపంచానికి చాటడానికి వెస్ట్రన్ క్లాసికల్ మ్యూజిక్‌లో అత్యంత క్లిష్టమైన 'సింఫనీ' రాసి దానికి 'వేలియంట్' అని నామకరణం చేసి గత మార్చి 8 న లండన్‌లోని 85 మంది సభ్యుల ప్రతిష్ఠాత్మక రాయల్ ఫిల్‌హార్మోనిక్ ఆర్కెస్ట్రాతో ప్రదర్శన ఇచ్చిన విషయం తెల్సిందే. వెస్ట్రన్ క్లాసికల్‌లో సింఫనీ రాసి లండన్‌లో ప్రదర్శన ఇచ్చిన తొలి భారతీయ సంగీత దర్శకుడిగా ఇళయరాజా చరిత్ర సృష్టించారు. ఈ నేపథ్యంలో తాజాగా 'సింఫనిక్ డ్యాన్సెస్' పేరుతో సరికొత్త సింఫనీని రాయనున్నట్టు దీపావళి పండుగ సందర్భంగా వెల్లడించారు.


చెన్నై (ఆంధ్రజ్యోతి)

గ్రామీణ నేపథ్యంలో



గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో సౌమ్యా చాందిని పల్లా నిర్మిస్తున్నారు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నటుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. సౌమ్యా చాందిని మాట్లాడుతూ 'నిజ జీవిత సంఘటనల ఆధారంగా 'రేలుగుంట సూరి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. గ్రామీణ జీవనశైలిని, భావోద్వేగాలను దర్శకుడు అద్భుతంగా ఆవిష్కరించారు' అని చెప్పారు. సంగీతం: సుభాశ్ ఆనంద్.

మూడేళ్ల కష్టం 'బైసన్'



'విక్రమ్ కొడుకును అవ్వడం వల్ల అన్నీ నాకు సులభంగానే దక్కాయి. ఆయనలా ప్రేక్షకుల ప్రేమను పొందేందుకు నా శాయశక్తులా కష్టపడతాను. 'బైసన్' చిత్రం కోసం మూడేళ్లు కష్టపడ్డాను. తమిళంలో ఈ సినిమాకు మంచి ఆదరణ దక్కింది. తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరించాలి' అని ధృవ్ విక్రమ్ కోరారు. ఆయన హీరోగా మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నిర్మాత వీపీ సెల్వన్ బాలాజీ ఈనెల 24న తెలుగులో విడుదల చేస్తున్నారు. చిత్ర కథానాయిక అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'మారి సెల్వరాజ్ దర్శకత్వంలో నటించాలనే కోరిక ఈ సినిమాతో తీరింది. ధృవ్‌తో కలసి నటించినందుకు గర్వంగా ఉంది' అని చెప్పారు.

గూగుల్ కోసం గ్రీన్ ఎనర్జీ

- రూ.21,800 కోట్లతో కారిడార్-3 పనులు
- పోలవరం ఎడమ కాలువ నుంచి నీటి సరఫరా
- భారీ పెట్టుబడి వస్తే జగన్ కనీసం ట్వీట్ చేయలేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ధ్వజం



విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు పునరుత్పాదక ఇంధనాన్నే ఎక్కువ ఉపయోగిస్తారని, దీని కోసం రూ.21,800 కోట్లతో ప్రత్యేకంగా గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వెల్లడించారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్‌పై దుష్ప్రచారాల నేపథ్యంలో వాస్తవాలు వివరించడానికి నగరంలోని గ్రాండ్ బే హోటల్‌లో మంగళవారం పారిశ్రామికవేత్తలు, వ్యాపార వర్గాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ డేటా సెంటర్‌కు భూమితో పాటు విద్యుత్, నీరు చాలా ముఖ్యమన్నారు. రాష్ట్రంలో భారీగా సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ అందుబాటులో ఉందని, దానినే గూగుల్ ఉపయోగిస్తుందని.. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా అవసరమైన నీటిని అందిస్తారన్నారు. ఈ నీటిని నిల్వ చేయడానికి స్టీల్ ప్లాంటు సమీపాన మరో పెద్ద రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఇది కాకుండా సముద్ర నీటిని కూడా శుద్ధి చేసి ఉపయోగిస్తారన్నారు. 'భారతదేశానికి ఇంత పెద్దఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావడం ఇదే తొలిసారి. దీనిని స్వాగతించాల్సింది పోయి ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ వ్యతిరేక ప్రచారం చేస్తోంది. విశాఖ పారిశ్రామికంగా ఎదగడం వైసీపీకి ఇష్టం లేదా? దీనిపై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కనీసం ట్వీట్ కూడా చేయలేదు. ఆయన తన వైఖరి ఏమిటో స్పష్టంచేయాలి' అని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం విశ్వసనీయతకు మారుపేరని అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్‌రాజు అన్నారు.

రాష్ట్రంలో కొత్తగా ఏడు డయాలసిస్ కేంద్రాలు

- గతేడాది డయాలసిస్ కోసం 164 కోట్లు ఖర్చు: మంత్రి సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏడు ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. కిడ్నీ రోగుల డయాలసిస్ కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూటమి ప్రభుత్వం రూ.164 కోట్లు ఖర్చు చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా విజయనగరం జిల్లా ఎస్.కోట, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, చిత్తూరు జిల్లా పీలేరు, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, నెల్లూరు జిల్లా వెంకటగిరి, బాపట్ల జిల్లా అద్దంకి, నంద్యాల జిల్లా సున్నిపెంటలో డయాలసిస్ కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 232 డయాలసిస్ కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. ఎస్.కోట, సీతంపేట ఆస్పత్రుల్లో కొత్త డయాలసిస్ కేంద్రాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను పీపీపీ విధానంలో ఓ సంస్థకు అప్పగించామని చెప్పారు.

7న మంత్రివర్గ సమావేశం

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం నవంబరు 7న భేటీ కానుంది. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఉదయం 11 గంటలకు క్యాబినెట్ సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'రాయవరం పేలుడు' వెనుక తీవ్ర నిర్లక్ష్యం

- ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన ద్విసభ్య కమిటీ
- మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం: సీఎం

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు జరగడం వెనుక తీవ్ర నిర్లక్ష్యం చోటు చేసుకుందని ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. తయారీ కేంద్రంలోనే పేలుడు పదార్థాలు, ఇనుప పరికరాలు ఉంచడంతో రాపిడి జరిగి ప్రమాదం సంభవించినట్లు పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఈగిల్ ఐజీ ఆకే రవికృష్ణతో కూడిన కమిటీ నివేదికలో వివరించింది. కనీస నిబంధనలు పాటించలేదని, జాగ్రత్తలు తీసుకోలేదని నివేదించింది. దీనిపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. రాష్ట్రంలో బాణసంచా తయారీ కేంద్రాలకు అనుమతులు కఠినతరం చేయాలని ఆదేశించారు. కనీస నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘించే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని స్పష్టం చేశారు. రాయవరం బాణసంచా తయారీ కేంద్రం పేలుడుతో ప్రాణాలు కోల్పోయిన ఎనిమిది మంది కుటుంబాలకు రూ.15 లక్షలు చొప్పున పరిహారాన్ని ప్రకటించారు.

ఆయన భారత్‌ను ఎంచుకున్నారు

- అన్నాడీఎంకే, డీఎంకే లడాయిపై లోకేశ్

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రలో గూగుల్ పెట్టుబడి తమిళనాట అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ రగడకు కారణమయింది. తమిళ మూలాలు ఉన్న వ్యక్తి సీఈఓగా ఉన్న కంపెనీ ఆయన స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టకపోవడం డీఎంకే ప్రభుత్వ వైఫల్యమేనంటూ మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి మంగళవారం ఎక్స్ వేదికగా విమర్శలకు దిగారు. 'గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తమిళ మూలాలు కలిగిన వ్యక్తి. అయినప్పటికీ ఆ కంపెనీని ఏఐ మౌలిక వసతుల కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయమని ఆహ్వానించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమయింది. ముందు చూపు, సానుకూల దృక్పథం లేకపోవడమే దీనికి కారణం' అని విమర్శించారు. తమిళనాట చెలరేగిన ఈ రాజకీయ హోరుపై ఓ టీవీ చానల్ ప్రసారం చేసిన వార్త స్క్రీన్ షాట్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్న మంత్రి లోకేశ్... మూడంటే మూడే పదాలతో స్పందించారు. 'ఆయన భారత్‌ను ఎంచుకున్నారు' అని ఆయన వ్యాఖ్యానించారు.

తనిఖీలు దాటుకుని సెంట్రల్ జైలులోకి ఎలా..?

- ఖైదీలకు గుట్కాలు, బిర్యానీలు అందుతున్న వైనంపై ఇద్దరు సిబ్బంది, ముగ్గురు ఖైదీలపై కేసు నమోదు
- తెరవెనుక ఎవరున్నారనే కోణంలో పోలీసులు ఆరా

రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జైలులోని ఖైదీలకు గుట్కాలు, బిర్యానీలు గుట్టుగా అందుతున్న విషయంపై ఇద్దరు సిబ్బంది, ముగ్గురు ఖైదీలపై కేసు నమోదైంది. రికార్డు అసిస్టెంట్ ఎస్కే బషీర్, జూనియర్ అసిస్టెంట్ ఎస్.సుశీల్ కుమార్, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు కె.రామకృష్ణ, గంజనబోయిన ప్రసాద్, పాలడుగు నాగసాయి కుమార్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బ్యారెక్‌లలో గుట్కా ప్యాకెట్లు దొరకడంతో.. గేట్లలో తనిఖీలు దాటుకొని ఇవి ఎలా వెళ్లాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుట్కాలతో పాటు బిర్యానీల కోసం బషీర్‌కి రూ.వెయ్యి, సుశీల్‌కి రూ.2వేలు ఫోన్‌పే ద్వారా ఖైదీల తరఫున అందాయి. ఈ విషయాన్ని అటు ఖైదీలు, ఇటు సిబ్బంది కూడా అంగీకరించినట్టు సమాచారం. ఆదివారం ఉదయం గుట్కాల అంశం వెలుగు చూడగా తీవ్ర తర్జనభర్జన అనంతరం అదేరోజు సాయంత్రం జైలు సూపరింటెండెంట్ రాహుల్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెంట్రల్ జైలు విషయం కావడంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని సంప్రదించిన అనంతరం పోలీసులు సోమవారం మధ్యాహ్నం ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తెరవెనుక ఎవరున్నారనే కోణంలో విచారిస్తున్నారు. అయితే జైలు అధికారులు మాత్రం ఈ విషయంలో తాత్సారం వహిస్తున్నారు.

ఎన్‌జీవోల సభ్యత్వ రుసుముపై జీఎస్టీ తగ్గించాలి

- జీఎస్టీ మండలికి ఏపీ చాంబర్స్ సూచన

విజయవాడ (వన్‌టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై 56వ మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో కొన్ని కీలక అంశాలను పునఃపరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఏపీ చాంబర్స్) కోరింది. ఈమేరకు జీఎస్టీ మండలి చైర్మన్ నిర్మలా సీతారామన్‌కు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించినట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్‌రావు మంగళవారం తెలిపారు. 'ఆటోమొబైల్స్‌పై విధిస్తున్న కాంపెన్సేషన్ సెస్‌ను రద్దు చేసిన తేదీకి ముందు డీలర్ల వద్ద నిల్వలు ఉన్నాయి. ఆ నిల్వలపై అప్పటికే సెస్ చెల్లించారు. ఇప్పుడు చెల్లించిన సెస్ నిరుపయోగంగా మిగిలిపోతుంది. దీనివల్ల డీలర్లు ఆర్థికంగా నష్టపోతారు. బిజినెస్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనే ఎగ్జిబిటర్లపై జీఎస్టీ రేటును, ఎన్జీవోల సభ్యత్వ రుసుంపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలి' అని ఏపీ చాంబర్ కోరింది.

శాంతిభద్రతలపై రాజీలేదు



పోలీసు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పిస్తున్న సీఎం చంద్రబాబు

> శాంతిభద్రతలతోనే అభివృద్ధి సాధ్యమని నమ్ముతాను. విశాఖలో గూగుల్ ఏఐ డేటా హబ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందంటే.. ఇక్కడి శాంతి భద్రతలపై ఆ సంస్థకు ఉన్న నమ్మకమే కారణం. రాజకీయ నాయకుల ముసుగులో కొందరు పెద్దఎత్తున నేరాలకు పాల్పడుతున్నారు. అశాంతిని సృష్టించేందుకు దేనికైనా తెగిస్తున్నారు. వీరు క్రిమినల్స్ కన్నా ప్రమాదకరం. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న పోలీసులంటే నాకెప్పుడూ గౌరవమే. - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

సంస్మరణ దినం (ప్రతి ఏటా అక్టోబరు 21న) సందర్భంగా పోలీసు శాఖ మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. హోం మంత్రి అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో కలిసి పోలీసు అమరులకు నివాళులర్పించారు. అనంతరం ప్రసంగించారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలపై నమ్మకంతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సైబర్ నేరాల కట్టడిలో టెక్నాలజీ అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు. పోలీసుల పనితీరు, త్యాగాల వల్ల ఫ్యాక్షనిజం, నక్సలిజంపై విజయం సాధించామని.. ఇప్పుడు శేషాచలంలో ఎర్రచందనం, విశాఖ మన్యంలో గంజాయి స్మగ్లింగ్‌ను నిరోధించడంలోనూ వారి తీరు ప్రశంసనీయమని తెలిపారు. 'వ్యక్తిత్వ హననం నుంచి సమాజంలో చిచ్చు పెట్టేవరకూ సోషల్ మీడియాను ఉపయోగించి.. రాజకీయ ముసుగులో విధ్వంసం సృష్టించే కుట్రలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలి. వ్యక్తిగత గొడవలకు కులం రంగు పులుముతారు.. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన నేరాలకు మతం రంగు పూస్తారు.. ఫేక్ ప్రచారాలతో అలజడులకు కుట్ర చేస్తున్నారు.. అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకుండా జైల్లో పడేయాలి' అని చెప్పారు. గత ప్రభుత్వం పోలీసుల్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఇప్పుడు తాము సరెండర్ లీవ్‌లు ఇస్తున్నామని.. ప్రమాద బీమా కల్పిస్తున్నామని.. పోలీసుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు ఇస్తున్నామని తెలిపారు. వైద్య సేవలకు రూ.33 కోట్లు విడుదల చేశామని.. మరణించిన 171 మంది పోలీసులకు బీమా కింద రూ.23 కోట్లు అందించామని చెప్పారు. ఇటీవలే 6,100 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. పదోన్నతులు ఇస్తున్నామని.. హోం గార్డులకు ఆరోగ్య బీమా కల్పిస్తామని చెప్పారు.

ప్రజల కోసం పనిచేయండి..

'కుమార్తెను రోజూ స్కూలుకు దించే వికలాంగురాలి స్కూటర్‌ను దొంగిలిస్తే.. దానిని రికవరీ చేసి ఆమె కళ్లల్లో ఆనందబాష్పాలు రప్పించిన ఏలూరు పోలీసులకు.. నిరుపేద పిల్లలకు చెప్పులు లేకుండా స్కూలుకు వెళ్తుంటే సొంత డబ్బుతో అందరికీ చెప్పులు కొనిచ్చిన పెనమలూరు హెడ్ కానిస్టేబుల్ వెంకటరత్నాన్ని చూస్తే.. పోలీసుల ఒంటిపై ఉన్నది ఖాకీ అయినా వారి హృదయంలో కారుణ్యం కనిపించింది.. మీరు ప్రజల కోసం పని చేయండి.. ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుంది.. మీ సంక్షేమం ప్రభుత్వ బాధ్యత.. నేరగాళ్లను కట్టడి చేసి ప్రజలకు భరోసా కల్పించాల్సింది మీరే.. ఏపీ పోలీసు అంటే ఓ బ్రాండ్. దానికి మరింత వన్నె తెచ్చేలా పనిచేయాలి' అని సీఎం కోరారు. శాంతిభద్రతల విషయంలో తానెప్పుడూ రాజీపడలేదని, కఠినంగా ఉన్నందుకే తనపై నక్సల్స్ క్లెమోర్‌మైన్ పేల్చారని గుర్తుచేశారు. నేరాల కట్టడిలో టెక్నాలజీకి ప్రాధాన్యం ఇస్తున్నామని, సీసీ కెమెరాలు, డ్రోన్లు, కృత్రిమ మేధ (ఏఐ)తో పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నామన్నారు. 'సీసీ కెమెరాల ద్వారా పాస్టర్ ప్రవీణ్ ప్రమాద కేసు వెలికి తీశాం. జీడీ నెల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టి చిచ్చు రేపే ప్రయత్నం చేశారు. నకిలీ మద్యం కట్టడి చేస్తున్నా ఫేక్ ప్రచారాలతో ప్రజల్లో భయాన్ని సృష్టిస్తున్నారు' అని విమర్శించారు.

పోలీసుల త్యాగాలు సమాజం కోసమే: అనిత

ప్రతి పౌరుడూ నిశ్చింతగా నిద్రపోవడానికి.. ప్రతి కుటుంబం ప్రశాంతంగా జీవించడానికి.. పోలీసులు ఉన్నారనే భరోసానే కారణమని హోం మంత్రి అన్నారు. మహిళలకు 'శక్తి' ఒక రక్షణ కవచంలా ఉంటే.. సమాజాన్ని మత్తులో ముంచే ముఠాలపై 'ఈగల్' ఉక్కుపాదం మోపుతోందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది త్యాగాలు, నిబద్ధతతో కూడిన విధులు వెలకట్టలేనివని డీజీపీ వ్యాఖ్యానించారు. 'ఈ రోజు యూనిఫాం పోలీసులు తల వంచి నివాళులర్పించేది దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన పోలీసులకు.. ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే పోలీసుల త్యాగాల వల్లే.. పోలీసు ఉద్యోగం ఒక వృత్తి కాదు.. బాధ్యతతో కూడిన సమాజ సేవ.. యూనిఫాం గౌరవ సూచిక మాత్రమే కాదు.. కర్తవ్యానికి ప్రతీక' అని గుర్తుచేశారు.



ఉండవల్లి నివాసంలో దీపావళి సంబరాల్లో సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు

చంద్రబాబు దంపతుల దీపావళి

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు దీపావళి వేడుకలను ఉండవల్లి నివాసంలో సతీమణి భువనేశ్వరితో కలిసి జరుపుకొన్నారు. లక్ష్మీ పూజ నిర్వహించిన అనంతరం ప్రమిదలు వెలిగించారు. అనంతరం ఇద్దరూ కాకరపువ్వొత్తులు కాల్చారు. సీఎం నివాసం చెంతనే అనాథ పిల్లలు ఉండే చిగురు ఆశ్రమానికి భువనేశ్వరి వెళ్లారు. ఆశ్రమంలోని పిల్లలకు బాణసంచా, స్వీట్లు పంచారు. వారితో కలిసి బాణసంచా కాల్చారు. అనంతరం వారికి భోజనం వడ్డించారు. పిల్లలతో మాట్లాడి, వారి బాగోగులు తెలుసుకున్నారు.

నేడు దుబాయ్‌కి చంద్రబాబు

మూడు రోజుల యూఏఈ పర్యటనకు సీఎం బృందం

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు రోజుల పర్యటన నిమిత్తం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు(యూఏఈ) వెళుతున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ విమానాశ్రయం నుంచి సీఎం బృందం దుబాయ్ బయలుదేరి వెళుతుంది. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాల్సిందిగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా 25 సమావేశాల్లో సీఎం పాల్గొంటారు. వీటిలో మూడు సమావేశాలు ప్రభుత్వ ప్రతినిధులతో ఉండగా, పారిశ్రామికవేత్తలతో 14 సమావేశాలు ఉన్నాయి. రెండు రౌండ్ టేబుల్ సమావేశాలు, రెండు సైట్ విజిట్స్, రెండు మీడియా ఇంటర్వ్యూలు, ఒక రోడ్‌షో, తెలుగు ప్రవాసీలతో(డయాస్పోరా) ఒక సమావేశం ఉంటాయి.

పర్యటన తొలి రోజు..

బుధవారం సాయంత్రం దుబాయ్‌లో పలువురు పారిశ్రామికవేత్తలతో సీఎం చంద్రబాబు సమావేశమవుతారు. దుబాయ్ ఫ్యూచర్ మ్యూజియంను ఆయన సందర్శిస్తారు. అందులోభాగంగా జర్నీ టు 2071 థీమ్‌తో ఉండే స్పేస్ ట్రావెల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఆయన పరిశీలిస్తారు. అదేరోజు దుబాయ్‌లో సీఐఐ నిర్వహించే భాగస్వామ్య సదస్సు రోడ్‌షోలో చంద్రబాబు పాల్గొంటారు.

రెండోరోజు..

అబుధాబిలోని పలువురు పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు సమావేశమవుతారు. అక్కడి బీఏపీఎస్ హిందూ మందిర్‌ను ఆయన సందర్శిస్తారు.

చివరిరోజు... అబుధాబిలోని యాస్ ఐల్యాండ్‌లో ఫెరారీ వరల్డ్, యాస్ వాటర్ వరల్డ్, వార్నర్ బ్రదర్స్ వరల్డ్ అబుధాబి, సీ వరల్డ్ వంటి ప్రదేశాలను సీఎం చంద్రబాబు సందర్శిస్తారు. అనంతరం ఎమిరేట్స్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో, ఏపీ ఎన్ఆర్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలుగు ప్రవాసీల సమావేశంలో పాల్గొంటారు. పారిశ్రామికవేత్తలతోపాటు యూఏఈకు చెందిన ప్రభుత్వ ప్రతినిధుల తోనూ సీఎం భేటీ అవుతారు. పర్యటనలో ఆయన వెంట మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, సీఎంవో అధికారి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో ధాత్రి రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు.

లక్ష్మయ్య నాయుడు హత్య కేసు విచారణకు ప్రత్యేక కోర్టు

- నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తాం: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలో ఇటీవల హత్యకు గురైన లక్ష్మయ్యనాయుడు కేసు విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేక ట్రిబ్యునల్ ద్వారా వేగంగా విచారణ పూర్తి చేసి.. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్య తీసుకుంటామని సీఎం పేర్కొన్నారు. హోంమంత్రి అనిత, మున్సిపల్ మంత్రి నారాయణ, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో మంగళవారం ఆయన సమీక్షించారు. రూ.2.30 లక్షల అప్పు అడిగినందుకు లక్ష్మయ్య నాయుడును హత్య చేయడం తీవ్ర అమానుష, అమానవీయ ఘటనగా చంద్రబాబు అభివర్ణించారు. బాధ్యులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టపరంగా శిక్షలు పడేలా చేస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని స్పష్టం చేశారు. లక్ష్మయ్య నాయుడి భార్యకు 2 ఎకరాల భూమి, రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. వారి ఇద్దరు పిల్లలకు రెండెకరాల చొప్పున భూమి, రూ.5 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని అధికారులను ఆదేశించారు. దాడి ఘటనలో తీవ్రంగా గాయపడ్డ పవన్‌కు నాలుగు ఎకరాల భూమి, రూ.5 లక్షల నగదు... మరో బాధితుడు భార్గవ్‌కు రూ.3 లక్షల నగదు, ఆస్పత్రి ఖర్చులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు.



సిడ్నీలో నిర్వహించిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో మంత్రి లోకేశ్



హెచ్ఎస్‌బీసీ బ్యాంకు సీఈవో ఆంటోని షా నేతృత్వంలోని సీనియర్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ బృందంతో లోకేశ్ చర్చలు

ఆస్ట్రేలియాతో 'ఆక్వా' బంధం!

(మొదటి పేజీ తరువాయి)

భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపుదలకు తమతో కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. "సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్‌లో ఏపీ అగ్రగామిగా ఉంది. ఆస్ట్రేలియాతో సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులతో ఏపీ ఆక్వాను అనుసంధానించేందుకు ట్రేడ్ మిషన్లు, నెట్ వర్కింగ్ కార్యక్రమాలను చేపట్టండి. ఆక్వా ఉత్పత్తుల నాణ్యత, నిల్వ కాలం పెంచేందుకు ప్రాసెసింగ్, కోల్డ్‌చైన్ మేనేజ్‌మెంట్, ప్యాకేజింగ్ రంగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను పరిచయం చేయండి. ఏపీ సీ ఫుడ్ వంటకాలను ప్రోత్సహించి, కలినరీ టూరిజంను ఆకర్షించేందుకు సంయుక్త కార్యక్రమాలు చేపట్టండి" అని కోరారు. చంద్రబాబు నేతృత్వంలో పారిశ్రామిక పెట్టుబడులకు సానుకూల విధానాలు అమలు చేస్తున్నామని లోకేశ్ వెల్లడించారు. పెట్టుబడిదారుల కోసం స్నేహపూర్వక విధానాన్ని అవలంబిస్తున్నామని చెప్పారు. హెచ్ఎస్‌బీసీ సీఈవో ఆంటోనీ షా నేతృత్వంలోని బృందంతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని, 16 నెలల్లోనే రూ. 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో 1,051 కిలోమీటర్ల సువిశాల సముద్ర తీరం పోర్టు ఆధారిత రంగానికి పెద్ద ఊతమని చెప్పారు. ఈ భేటీలో అమెజాన్ పబ్లిక్ పాలసీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఆగ్నేయాసియా డైరెక్టర్ మైకెల్ కూలే, సిస్కో వైస్ ప్రెసిడెంట్, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ జెట్టి మురళి, రిచర్డ్ వాట్సన్ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో సహకరించండి

స్టెమ్, ఏఐ, రెన్యువబుల్ ఎనర్జీలో నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించాలని యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (యూఎన్ఎస్‌డబ్ల్యూ) అధ్యాపక బృందాన్ని మంత్రి లోకేశ్ కోరారు. రాష్ట్ర వర్సిటీలతో కలసి సంయుక్త డిగ్రీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆ యూనివర్సిటీని సందర్శించిన లోకేశ్.. అధునాతన బోధనా పద్ధతులపై అక్కడి సీనియర్ అధ్యాపక బృందంతో చర్చించారు. ఐటీ, తయారీ రంగాల్లో భాగస్వామ్యం వహించాలని కోరారు. సంయుక్త పరిశోధన, అభివృద్ధి సాంకేతిక నైపుణ్యాల పరిశోధనల్లో భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు టెలీ మెడిసిన్‌కు సహకరించాలని కోరారు. డేటా ఆధారిత పాలన, ప్రజా విధానాలపై సౌత్ వేల్స్ వర్సిటీతో కలసి చేయడానికి సిద్ధమన్నారు.

నగరాల అభివృద్ధికి సహకరించండి

రాష్ట్రంలో ప్రధాన నగరాల అభివృద్ధికి సహకారం అందించాలని గ్రేటర్ సిడ్నీలో కీలక నగరం పారమట్టా లార్డ్ మేయర్ మార్టిన్ జైటర్‌ను లోకేశ్ కోరారు. తర్వాత హారీస్ పార్కులో లిటిల్ ఇండియా పేరిట ఏర్పాటు చేసిన రివర్‌ఫుడ్ కోర్టును ఆయన పరిశీలించారు. న్యూ సౌత్ వేల్స్ ప్రీమియర్ క్రిస్ మీన్స్‌తో లోకేశ్ మంగళవారం సమావేశమయ్యారు. అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ స్టార్టప్‌లు, గ్రీన్ టెక్నాలజీల్లో సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్-న్యూసౌత్‌వేల్స్ ఇన్నోవేషన్ అండ్ ఇండస్ట్రీ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే ఇన్నోవేషన్ హబ్ అండ్ స్టార్టప్‌లతో విశాఖ, అనంతపురంలను అనుసంధానించే ఎక్స్ఛేంజీ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని అభ్యర్థించారు. రెన్యువబుల్ ఎనర్జీ, మెడ్‌టెక్, అగ్రిటెక్, లాజిస్టిక్ రంగాల్లో పనిచేస్తున్న న్యూసౌత్‌వేల్స్ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలన్నారు. క్లీన్ టెక్, ఏఐ, ఇన్‌ఫ్రా రంగంలో పరిశోధనాభివృద్ధి కోసం న్యూసౌత్ వేల్స్, ఆంధ్రప్రదేశ్ వర్సిటీల మధ్య అవగాహనతో సాంకేతికత, అనుభవాలను పంచుకోవాలని కోరారు.

రంగా వర్సిటీతో కలసి పనిచేయండి

వెస్ట్రన్ సిడ్నీ వర్సిటీని లోకేశ్ మంగళవారం సందర్శించి ఆ వర్సిటీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, అగ్రికల్చర్ టెక్నాలజీ పరిశోధకులతో చర్చలు జరిపారు. రాష్ట్రంలో వ్యవసాయ ఆధునీకరణకు వెస్ట్రన్ సిడ్నీ వర్సిటీ వాతావరణ సానుకూల పంటలు, ప్రెసిషన్ ఫార్మింగ్ నైపుణ్యాలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలసి ఆలోచనలను పంచుకోవాలని కోరారు. రైతులు, పుణులకు స్మార్ట్ ఫార్మింగ్ టెక్నిక్, అగ్రిటెక్ ఇన్నోవేషన్‌లో శిక్షణ ఇచ్చేందుకు సంయుక్త కార్యక్రమాలు నిర్వహించాలని.. స్మార్ట్ నీటిపారుదల వ్యవస్థలు, ఏఐ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేసే ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రుల మధ్య ఇగో ఫీలింగ్స్ లేవు

- ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే లక్ష్మయ్యనాయుడు హత్య: అనిత



అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంత్రుల మధ్య ఎలాంటి ఇగో ఫీలింగ్స్ లేవని హోంమంత్రి అనిత అన్నారు. కూటమి నేతల మధ్య మంచి అవగాహన, సమన్వయం ఉన్నాయని, అధికారులు కలిసిమెలసి పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి నారాయణ, కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. నెల్లూరు జిల్లా దారకానిపాడులో లక్ష్మయ్య నాయుడు హత్యకు కులాలతో సంబంధం లేదని, ఆర్థిక వ్యవహారాల కారణంగానే జరిగినట్లు మృతుడి భార్యే చెప్పారని వివరించారు. ఈ విషయంలో కులాలను రెచ్చగొడితే ఉపేక్షించబోమని వ్యాఖ్యానించారు. గతంలో హోంశాఖ గురించి కొన్ని వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... ఇప్పుడు భీమవరం డీఎస్పీపై డీజీపీని నివేదిక కోరడంపై ఓ విలేకరి ప్రశ్నించగా... 'పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం. ఆయన సూచనలు ఇవ్వడంలో తప్పేముంది..? ప్రతిదీ భూతద్దంలో చూడకండి. ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నారు..? మాకు లేని ఇగో మీకెందుకు..? డీఎస్పీ విషయం మా నోటీస్‌లో ఉంది. నాకూ రిపోర్టులు వచ్చాయి. వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. రాజ్యాంగపరంగా డిప్యూటీ సీఎం డీజీపీని నివేదిక కోరవచ్చా..? అని ప్రశ్నించగా.. 'మేమంతా ఒక్కటే. అయినా ఇలాంటి ప్రశ్నలు గత ప్రభుత్వంలో జగన్‌ను అడిగి ఉంటే ఈరోజు ఈ పరిస్థితి ఉండేది కాదు. ఎన్డీయే ప్రభుత్వంలో ఏదో రకంగా చిచ్చు పెట్టాలని చూస్తారు. మాకూ మాకూ అవగాహన, సమన్వయం ఉన్నాయి. ఎటువంటి ఇగోలు లేకుండా పని చేస్తున్నాం. మా అధికారులూ కలిసి పనిచేస్తున్నారు. మేమంతా కలిసి పని చేసుకుంటున్నప్పుడు ఈ ప్రశ్న అవసరం లేదని మా అభిప్రాయం' అని అనిత బదులిచ్చారు.

డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు మార్కెటింగ్

- రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్లు ఏర్పాటు చేయాలి
- అంతర్జాతీయ స్థాయి బ్రాండింగ్ రావాలి
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు
- మెప్మా-మనమిత్ర యాప్ ప్రారంభం

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు బ్యాంకుల్లో రుణాలిచ్చే విషయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎం చంద్రబాబు సూచించారు. గంటల్లోనే రుణాలందిస్తామని బ్యాంకర్లు చెబుతున్నారని.. ఇది అమలవుతోందో లేదో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని అధికారులకు చెప్పారు. తీసుకున్న రుణాలతో వ్యాపారం చేసుకునే మహిళలను ప్రోత్సహించాలని.. వారికి వ్యాపార అవకాశాలు మరింతగా పెరిగేలా డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ పెంచాలని పిలుపిచ్చారు. వారి ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ రావాలన్నారు. మంగళవారం అమరావతి సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మహిళా ఉత్పత్తులకు పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఫుడ్ బిజినెస్, ఆక్వా, టూరిజం వంటి రంగాల్లో ఎలాంటి మార్కెట్ ఉంటుందో అన్వేషించి వారికి అవకాశాలు కల్పించాలి. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 100 వరకు క్లస్టర్లు ఏర్పాటు చేసుకోవాలి' అని స్పష్టం చేశారు. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. 'అరకు కాఫీ, మిల్లెట్లు.. ఈ రెండింటి కాంబినేషన్లో డ్వాక్రా మహిళలతో అవుట్‌లెట్లు ఏర్పాటు చేయించే ఆలోచన చేయండి. స్టార్ బక్స్ తరహాలో ఈ అవుట్‌లెట్ల డిజైనింగ్ ఉండాలి. మునగాకుతో ఉత్పత్తులు చేయవచ్చు, మహారాష్ట్ర తెచ్చిన బ్యాంబూ మిషన్ పాలసీపై అధ్యయనం చేయండి. ఆక్వా రంగంలో ఎక్కువ అవకాశాలున్నాయి. గుర్రపు డెక్కతో ఉత్పత్తులు చేయవచ్చు. డ్రోన్లను ఎగరేయడం మొదలుకొని ఎగ్‌కార్ట్, ఆక్వాకార్ట్, మిల్లెట్ కార్ట్ వంటివి ప్రయోగాత్మకంగా చేపట్టండి. డ్వాక్రా సంఘాల్లో కూడా పీహెచ్‌డీ చేసిన మహిళలు ఉన్నారు. వారిని గుర్తించి వారి సేవలను కూడా ఉపయోగించుకోవచ్చు. టూరిజం రంగంలో హోం స్టేలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలోకి డ్వాక్రా సంఘాలు వచ్చేలా చూడండి' అని అధికారులను ఆదేశించారు. సమీక్ష అనంతరం 'మెప్మా-మన మిత్ర' యాప్‌ను సీఎం ప్రారంభించారు. మెప్మా చేపట్టే కార్యక్రమాలు, కార్యకలాపాలను వివరిస్తూ రూపొందించిన అవని వార్షిక సంచికను, ప్రగ్నా యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు.

డ్వాక్రా మహిళకు రూ.1.25 కోట్ల రుణం

నెయ్యి వ్యాపారం చేస్తున్న డ్వాక్రా మహిళ మాధురికి రూ.1.25 కోట్ల బ్యాంకు రుణం మంజూరైంది. సీఎం ఆమెను అభినందించి చెక్కు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. 'గుంటూరు జిల్లా ఉండవల్లి సెంటర్‌లోని శ్రీసాయికృష్ణ డ్వాక్రా సంఘం నుంచి వచ్చాను. 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకున్నాను. మెప్మా సహకారంతోరూ.కోటీ 25 లక్షల రుణం నాకు వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో ఇంత భారీగా లోన్ రావడం ఇదే మొదటిసారి. యర్రబాలెంలో 40 రోజుల్లో వెన్న నుంచి నెయ్యి తీసే యూనిట్ సిద్ధమవుతుంది. శ్రీమాధురి ఘీతో పాటు అవని అనే పేరుతోనూ బ్రాండింగ్ చేసి బిజినెస్ చేస్తాం' అని చెప్పారు.

మరింత సులభంగా పౌర సేవలు

» ప్రభుత్వ శాఖల సమాచారం కోసం ఏపీ సెర్చ్‌బార్: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పౌర సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పౌర సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరాలని స్పష్టం చేశారు. ఇందుకోసం సాంకేతికతను జత చేయాలని సూచించారు. ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారాన్ని డేటా అనలిటిక్స్‌తో విశ్లేషించుకుని నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందిస్తున్న సేవల విషయంలో టెక్నాలజీ ఆడిటింగ్‌ను కూడా నిర్వహించాలన్నారు. వీటితో పాటు మంత్రులు, అధికారులు ఫైళ్ల క్లియరెన్సులో ఎంత సమయం తీసుకుంటున్నారన్న అంశాన్ని కూడా బేరీజు వేస్తామని పేర్కొన్నారు. తద్వారా ఏ స్థాయిలో ఎక్కువ ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోతున్నాయన్న వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని ఏ శాఖకు సంబంధించిన సమాచారాన్ని అయినా ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా ఏపీ సెర్చ్‌బార్‌ను అందుబాటులోకి తీసుకురావాలని చంద్రబాబు ఆదేశించారు. ఉచిత ఇసుక, ఇతర సేవలు అందిస్తున్న వెబ్‌సైట్లు, యాప్‌లను ప్రజలు సులువుగా ఉపయోగించేలా ఉండాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల సమాచారాన్ని 'డేటా లేక్' ద్వారా త్వరలోనే అనుసంధానిస్తామని పేర్కొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందకూడదా?

» వారిపై కక్షతోనే పీపీపీపై జగన్ విమర్శలు: ఎమ్మెల్యే యరపతినేని

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు నిర్మించి, పేదలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తుంటే.. జగన్‌కు కడుపు మంటగా ఉందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. అందుకే పీపీపీపై వైసీపీ బురదజల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. పీపీపీ విధానం ద్వారా రాష్ట్ర విద్యార్థులకు 220 అదనపు మెడికల్ సీట్లు వస్తాయని, అందులో 110 సీట్లు పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయన్నారు. వైసీపీ, జగన్ డీఎన్‌ఏలోనే విధ్వంసం అనే విషం ఉందని యరపతినేని విమర్శించారు.

ఏపీ గేమ్‌ఛేంజర్ గూగుల్: మంత్రి దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ రాకతో విశాఖపట్టణం గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా మారనుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాబోయే రోజుల్లో ఈ డేటా సెంటర్‌కు అనుబంధంగా ఏర్పాటయ్యే కంపెనీలతో పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

పేదల జీవితాలను చీకటి చేసిన చరిత్ర వైసీపీది: వీరంకి

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు బడుగు బలహీన వర్గాల పట్ల చిత్తశుద్ధి ఉంది కాబట్టే.. కల్తీ మద్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న జయచంద్రారెడ్డిని పార్టీనుంచి సస్పెండ్ చేశారని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. జే బ్రాండ్లతో పేదల జీవితాలను చీకటిమయం చేసిన చరిత్ర వైసీపీది, ఆ పార్టీ అధినేత జగన్‌ది అని ఆయన విమర్శించారు.

గురివింద జగన్

ఒక్క డీఏను కూడా సరిగ్గా ఇవ్వని ఘనుడు.. ప్రభుత్వం ప్రకటించిన డీఏపై మాత్రం విమర్శలు

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

"ఉద్యోగ సంఘాలు ధర్నాలు, రాస్తారోకోలు చేయడం సరికాదు. ఏ సమస్యనైనా కలిసి కూర్చొని పరిష్కరించుకోవాలి. అవసరమైతే కాళ్లు పట్టుకునే నేర్పూ ఉండాలి'...2022 నవంబరు 27న జగన్ క్యాబినెట్‌లో మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలివి. ఈ వ్యాఖ్యలను అప్పటి సీఎం జగన్ కనీసం ఖండించలేదు. పైగా తాను అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఉద్యోగులతో చెడుగుడు ఆడుకున్నారు. తన హయాంలో ఒక్క డీఏను కూడా సరిగ్గా ఇవ్వలేదుగానీ, చంద్రబాబు ప్రభుత్వం తాజాగా ఉద్యోగులకు ప్రకటించిన డీఏను విమర్శిస్తూ జగన్ గురువింద నీతులు సెలవిస్తున్నారు. ఒక్క డీఏతో ఎలా బతుకుతారంటూ ఉద్యోగులపై సానుభూతి కురిపిస్తున్నారు. కానీ, డీఏలు, పీఆర్సీ, మెడికల్ బిల్లులు, ఈఎల్స్, సీపీఎస్ కంట్రిబ్యూషన్‌ను నాడు ఎగ్గొట్టడం.. జీతాలు, పెన్షన్లు కూడా సరైన సమయానికి ఇవ్వకపోవడాన్ని ఉద్యోగులు అంత త్వరగా మరిచిపోలేరు. ఉద్యోగులకు రిటైర్మెంట్ ప్రయోజనాలు ఇవ్వడం ఇష్టం లేని జగన్ వారి పదవీవిరమణ వయసును 62 ఏళ్లకు పెంచి చేతులు దులుపుకున్నారు.


బెంగళూరు నివాసంలో దీపావళి సంబరాల్లో వైఎస్ జగన్, భారతి దంపతులు

జీవోలకు పరిమితమైన ఉద్యోగుల లబ్ధి

2019 ఎన్నికలకు ముందు విపక్ష నేతగా ఉండగా ఉద్యోగులపై జగన్ ప్రేమను ఒలకబోశారు. ముఖ్యమంత్రి అయ్యాక 2024 వరకు ఐదేళ్ల పాటు ఉద్యోగుల మొహాలు చూడడానికి కూడా ఇష్టపడలేదు. పైగా ఉద్యోగులను ఆనాడు కాల్చుకుతిన్నారు. ఒక డీఏ బకాయిని మూడు విడతల్లో ఇవ్వొచ్చంటూ జీవో ఇచ్చిన ఘనత జగన్‌దే. కొత్త పీఆర్సీ వేస్తూ జీవో అయితే ఇచ్చిన జగన్, పాత పీఆర్సీ బకాయిల లెక్క మాత్రం తేల్చలేదు. ఈ బకాయిలను 2024 నుంచి 2027 వరకు 16 విడతల్లో ఉద్యోగులకు చెల్లిస్తామంటూ అధికారికంగా ప్రకటించారు. రిటైర్మెంట్ తర్వాత ఇస్తామన్న డీఏ, పీఆర్సీ బకాయిలు రూ.7,500 కోట్లు ఉన్నాయి. వీటిని 2027లోగా చెల్లిస్తామని చెప్పారు. 2024 జనవరిలో 10శాతం, 2025లో 20 శాతం, 2026లో 30 శాతం, 2027లో 40 శాతం ఇస్తామన్నారు. అయితే, 2024 జనవరిలో ఇస్తామన్నవి కూడా జగన్ ఇవ్వలేదు.

ఆ బకాయి బిల్లులపై హడావుడి..చివరకు రద్దు

ఎప్పుడూ లేని విధంగా ఐఆర్ 27 శాతం కంటే 4 శాతం తగ్గించి 23శాతం ఫిట్‌మెంట్‌ను జగన్ ఇచ్చారు. హెచ్‌ఆర్‌ఏ తగ్గించారు. 11వ పీఆర్సీ సమయంలో మొదట హెచ్‌ఆర్‌ఏ, అదనపు క్వాంటమ్ పింఛనులో కోత విధించారు. ఆ తర్వాత హెచ్‌ఆర్‌ఏ పెంపు కాదు కదా, ఉన్నదాన్నే కొనసాగించాలంటూ ఉద్యోగులు కోరే స్థితికి జగన్ తీసుకురావడం గమనార్హం. 2018 జూలై నుంచి 2021 డిసెంబరు వరకు ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన డీఏ, 11వ పీఆర్సీ బకాయిలు జగన్ గద్దె దిగేనాటికి దాదాపు రూ.19వేల కోట్లు. ఆయన సీఎం అయిన కొత్తల్లో ఈ డీఏ బకాయిల బిల్లులను అత్యవసరంగా చెల్లించాల్సిన బిల్లులుండే గ్రీన్‌చానల్‌లో పెట్టారు. ఉద్యోగులంతా అప్పట్లో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తీరా ఆర్థిక సంవత్సరం చివరిరోజు మార్చి 31 వచ్చేసరికి వాటిని చెల్లించకుండా రద్దు చేసేశారు. ఇలా వరుసగా మూడేళ్లపాటు చేయడమే కాకుండా, 2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు కూడా ఉద్యోగుల ఖాతాల్లో ఆ సొమ్ము జమ కాలేదు. 2022 జూలై, 2023 జనవరి డీఏలను ప్రభుత్వం దాదాపు ఏడాదిన్నర ఆలస్యంగా ప్రకటించింది. జగన్ హయాంలోనే ఈ 2 డీఏల బకాయిలు రూ.7,000 కోట్లకు పైనే.

రూ. వేల కోట్లలో బకాయిలు..

జగన్ దిగిపోయేనాటికి ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన వివిధ రకాల బకాయిలు రూ.25వేల కోట్ల బాకీ ఉందని అప్పటి ఆర్థిక శాఖ అధికారులు రాతపూర్వకంగా మంత్రుల కమిటీకి ఇచ్చారు. ఆ సమయంలో ఉద్యోగులు తమకు ప్రభుత్వం రూ.31,519 కోట్లు బాకీ అని లెక్కలేశారు. 2018 జూలై, 2019 జనవరి డీఏలకు సంబంధించి 66 నెలల బకాయిలను కొంతమంది ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంది. సాంకేతికంగా ఇచ్చినట్టు చూపించి ఉద్యోగుల నుంచి ఆదాయ పన్ను మినహాయించిన ఘనత జగన్‌దే.

ఉద్యోగుల కంట్రిబ్యూషన్ నొక్కేశారు

సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించి ఒక ఏడాది కంట్రిబ్యూషన్ రూ.2,300 కోట్లు. ప్రభుత్వ వాటా కూడా ఏడాదికి రూ.2,300 కోట్లు. అయితే, జగన్ మాత్రం ఉద్యోగుల జీతాల నుంచి వారి కంట్రిబ్యూషన్ కట్ చేశారు కానీ, దానికి నాటి ప్రభుత్వం మ్యాచింగ్ కలిపి ఎన్ఎస్‌డీఎల్‌కు (నేషనల్ సెక్యూరిటీస్ డిపోజిటరీ లిమిటెడ్) చెల్లించకపోగా, ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌ను వాడుకుంది. జగన్ గద్దె దిగేనాటికి సీపీఎస్ కంట్రిబ్యూషన్ బకాయిలే రూ.3,800 కోట్ల వరకు ఉన్నాయి. మెడికల్ బిల్లులు, సరెండర్ లీవులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు, ఏపీజీఎల్‌ఐ, జీపీఎఫ్ ఇతర బిల్లుల రూపంలో ఉద్యోగులకు జగన్ ప్రభుత్వం రూ.2,800 కోట్ల మేర నిలిపివేసింది. ఉద్యోగులు తమ జీతం నుంచి దాచుకున్న జీపీఎఫ్ సొమ్మును కూడా జగన్ ప్రభుత్వం వాడుకుంది.

ఉద్యోగుల 'చలో'పై ఉక్కుపాదం

పోలీసు నిర్బంధాలను అధిగమించి 2022 ఫిబ్రవరి 3న ఉద్యోగులు వేలమంది తరలివచ్చి 'చలో విజయవాడ' నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం కాస్త దిగొచ్చి పీఆర్సీపై చర్చలు జరిపినా, ఉద్యోగులకు ఐఆర్ కంటే తక్కువ ఫిట్‌మెంట్ ఇచ్చింది. ఆ తర్వాత ఉద్యోగసంఘాల్లో చీలిక తెచ్చి ఉద్యోగుల ప్రయోజనాలకు భారీగా గండికొట్టారు. జగన్ దిగిపోయేనాటికి రూ.513కోట్ల ఏపీజీఎల్‌ఐ బకాయిలు చెల్లించాలి. ఇందులో రూ.313 కోట్లే యాప్‌లో అప్‌లోడ్ అయ్యాయి. ఈ బిల్లులను అప్‌లోడ్ చేసే యాప్‌ను జగన్ ప్రభుత్వం ఆపేసింది. మరో 200 కోట్ల బిల్లులు అప్‌లోడ్ కాలేదు. సచివాలయంలో సీపీఎస్ ఉద్యోగులకు 60 నెలల డీఏ బకాయిలను కూటమి ప్రభుత్వం సెప్టెంబరులో చెల్లించింది.

టీచర్లకూ టెట్!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టింది. అయితే దీనిపై తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకోనుంది. 2011లో టెట్ అమల్లోకి వచ్చింది. అంతకుముందు టీచర్ ఉద్యోగాలు పొందిన వారంతా తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్నవారు రెండేళ్లలో టెట్ సర్టిఫికెట్ పొందాలని ఆదేశించింది. ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న టీచర్లకు మినహాయింపు ఇచ్చినప్పటికీ పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ ఉండాలని పేర్కొంది. దీంతో టెట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగాలు పొంది ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారంతా ఇప్పుడు అందులో ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఏర్పడింది. పదోన్నతి అవసరం లేదనుకుంటే ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నవారు మినహాయింపును పొందవచ్చు. కాగా, టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ విద్య జాతీయ మండలి(ఎన్‌సీటీఈ)ని కొందరు టీచర్లు ఆశ్రయించారు. అయితే వీరి వినతిని ఎన్‌సీటీఈ తిరస్కరించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇందులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిపై కొందరు టీచర్లు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు. ఒకవేళ అక్కడ టీచర్లకు మినహాయింపు లభిస్తే రాష్ట్రంలోనూ ఆ వెసులుబాటు దక్కుతుంది. లేనిపక్షంలో టెట్ లేని టీచర్లంతా కచ్చితంగా అందులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఉద్యోగులకు డీఏ ఇవ్వడమూ జగన్‌కు ఇష్టం లేదు: యనమల



అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి బహుమతిగా ఉద్యోగులకు ఒక డీఏ ఇవ్వడం జగన్‌కు ఇష్టం లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. జగన్, అతని అనుచరులు.. వైసీపీ ఐదేళ్ల పాలనలో 4 డీఏలు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'పీఆర్సీని ఎందుకు ప్రకటించలేకపోయారు. ఐఆర్ కూడా ఎందుకు ఇవ్వలేకపోయారు' అని ప్రశ్నించారు. జగన్‌కు ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలంటే పెద్దగా పట్టింపు లేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై వారితో ఏనాడైనా జగన్ చర్చలు జరిపారా? అని యనమల నిలదీశారు.

ఓహో.. మేఘమాలా!



పచ్చని పర్వత శ్రేణులను చుట్టు ముట్టిన దట్టమైన తెల్లని మేఘాలు... తొలి సూర్యకిరణ కాంతికి మంచులా మెరుస్తుంటే పరవశించని హృదయం... పరుగులెత్తని పరువముంటుందా..! అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలోని గడచిన రెండు రోజులుగా వంజంగి కొండలు పర్యాటకులను, ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఏజెన్సీలో ఎండ, వానలతో ప్రస్తుతం విభిన్న వాతావరణం నెలకొంది. అయితే ప్రభాత వేళల్లో మాత్రం ఈ మంచు మేఘమాల సందడి చేస్తూనే ఉంది.

- పాడేరు/ఆంధ్రజ్యోతి

రోడ్డు ప్రమాదంలో జవాన్ మృతి

» మరో ఆరుగురు జవాన్లకు గాయాలు

» అల్లూరి జిల్లాలో కల్వర్టును ఢీకొన్న కారు

» సెలవు ముగిసి.. విధుల్లోకి వెళ్తుండగా ఘటన




ప్రమాదంలో ధ్వంసమైన కారు, గౌరవ్ కుమార్ పాండే(ఇన్‌సెట్)

చింతూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బీఎస్‌ఎఫ్ జవాను మరణించారు. మరో ఆరుగురు జవాన్లు గాయాలపాలయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం గొర్లగూడెం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిందీ ప్రమాదం. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఒడిసాలోని బలిమెల విద్యుత్ ఉత్పాదక రిజర్వాయర్ వద్ద బీఎస్‌ఎఫ్ జవాన్లు భద్రతా విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో కొందరు ఇటీవల సెలవుపై స్వస్థలాలకు వెళ్లారు. సెలవు ముగియడంతో ఏడుగురు జవాన్లు తిరిగి బలిమెలకు పయనమయ్యారు. తెలంగాణలోని ఖమ్మం నుంచి వారంతా కారులో చింతూరు మీదుగా బలిమెల వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జవాను అజిత్ సింగ్ డ్రైవింగ్ చేస్తుండగా.. నిద్రమత్తు వల్ల 30వ నెంబరు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కల్వర్టును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బీఎస్‌ఎఫ్ జవాను గౌరవ్ కుమార్ పాండే(43) అక్కడికక్కడే మృతి చెందారు. జవాన్లు అమితాబ్‌సింగ్, ఎండీ జామిన్, దేవ్‌కుమార్, గుర్జిత్‌సింగ్, వాసవభగత్‌సింగ్, అజిత్ సింగ్ గాయాలపాలయ్యారు. చింతూరు పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

రేపు విచారణకు రండి

» గోవుల మృతిపై ఆధారాలు చూపండి.. భూమనకు పోలీసుల నోటీసు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గోవులు మృతిచెందాయంటూ ప్రచారంచేసిన వ్యవహారంలో విచారణ నిమిత్తం గురువారం విచారణకు రావాలంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం భూమన వాట్సాప్‌కు నోటీసులు పంపారు. ఎస్వీ గోశాలలో అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేకపోవడంతో పదుల సంఖ్యలో గోవులు అకాల మరణం చెందాయంటూ గతంలో ఆయన ఆరోపణలు చేశారు. భూమన టీటీడీ గోశాలపై అసత్య ఆరోపణలు చేసి భక్తులు, హిందువుల మనోభావాలు దెబ్బతీశారంటూ అప్పట్లో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో భూమనకు నోటీసులు జారీచేసిన పోలీసులు ఆరోపణలకు ఆధారాలు చూపాలని కోరారు.

రియాజ్ ఎన్‌కౌంటర్

» కానిస్టేబుల్ ప్రమోద్ హత్యకేసు నిందితుడు పోలీసు కాల్పుల్లో హతం

» ఆస్పత్రిలో కానిస్టేబుల్ వద్ద తుపాకీ లాక్కొన్న రియాజ్

» ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో మృతి

నిజామాబాద్/హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలోని నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన రియాజ్(24) పోలీసుల కాల్పుల్లో హతమయ్యాడు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రియాజ్.. అక్కడ డ్యూటీలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ వద్ద తుపాకీ లాక్కుని తప్పించుకునే ప్రయత్నం చేశాడని, దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడని నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. మంగళవారం ఉదయం రియాజ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. పోలీసు కాల్పుల్లో రియాజ్ మరణించిన విషయాన్ని డీజీపీ శివధర్‌రెడ్డి ప్రకటించారు. కాగా, రియాజ్ మృతిపై జిల్లా ఆస్పత్రిలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్లు తెలుస్తోంది. రియాజ్ మృతి పట్ల కానిస్టేబుల్ కుటుంబం సంతోషం వ్యక్తంచేశారు. ప్రమోద్ కుటుంబానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

ఇంటర్ పాస్ మార్కులు మారాయ్..!

» గణితం 35... ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ 29

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి తీసుకొచ్చిన కీలక సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఈ మార్పులు కనిపించనున్నాయి. మార్పుల అనంతరం కొత్తవిధానం ఎలా ఉంటుందనే సమాచారాన్ని ఇంటర్ విద్యా మండలి తాజాగా కాలేజీలకు పంపింది. ఈ ఏడాది నుంచి గణితం ఒక్కటే సబ్జెక్టు ఉంది. ఇప్పటివరకూ 1ఏ, 1బీ ఉండగా వాటిని ఒక్కటిగా మార్చింది. గతంలో ఒక్కో పేపర్ 75 మార్కుల చొప్పున (పాస్ మార్కులు 26) పరీక్షలు జరిగేవి. ఇప్పుడు ఇంటర్ రెండేళ్ల గణితం ఒక్కటే పేపర్‌గా 100 మార్కుల చొప్పున పరీక్షలు జరుగుతాయి. అందులో 35 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులవుతారు. ఇక బైపీసీలో బోటనీ, జువాలజీని కలిపి బయాలజీగా మార్చారు. ఈ పేపరు 85 మార్కులకు ఉంటుంది. ఫస్టియర్‌లో 29 మార్కులు రావాలి. అదే సెకండియర్‌లో 30 మార్కులు వస్తే ఆ విద్యార్థులు పాస్ అయినట్లు లెక్క! ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లోనూ ఇవే మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఆయా సబ్జెక్టులకు గతంలో 60 మార్కుల చొప్పున పరీక్ష జరుపుతుండగా.. పాస్ మార్కులు 21గా ఉండేవి. కాగా, ప్రస్తుతం సెకండియర్ చదువుతున్న వారికి, గతంలో ఫెయిల్ అయి పరీక్షలు రాస్తున్న వారికి కొత్త మార్పులు వర్తించవు. మరోవైపు ఈ ఏడాది నుంచి కొత్తగా ఎలక్టివ్ సబ్జెక్టు విధానం తీసుకొచ్చారు. ఏ గ్రూపు విద్యార్థులైనా మొత్తం 24 సబ్జెక్టుల్లో దేనినైనా ఎంపిక చేసుకోవచ్చు. అందువల్ల విద్యార్థులు తీసుకునే సబ్జెక్టు ఆధారంగా ఫస్టియర్ మార్కులు మారతాయి. సైన్స్ సబ్జెక్టులైతే 85 మార్కులు, ఆర్ట్స్ సబ్జెక్టులైతే 100 మార్కులు ఉంటాయి. మొత్తంగా రెండేళ్లలో వెయ్యి మార్కులకు పరీక్షలు జరుగుతాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ విద్యార్థులకు రెండేళ్లకు 30 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ ఉంటాయి. అలాగే ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు మరో వెసులుబాటు కూడా ఉంది. అదనంగా మరో సబ్జెక్టును కూడా తీసుకుని చదవొచ్చు. అయితే అవి మొత్తం మార్కుల్లో కలపరు. ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, బైపీసీ విద్యార్థులు గణితంను మాత్రమే అదనపు సబ్జెక్టుగా తీసుకోవచ్చు. ఎలక్టివ్ సబ్జెక్టు విధానం అమల్లోకి రావడంతో పరీక్షల షెడ్యూలు పెరిగింది.

చెల్లించేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

చెల్లిస్తామని అందులో పేర్కొన్నారు. ఇప్పటిదాకా పీఆర్సీ బకాయిలను మాత్రమే రిటైర్మెంట్ సమయంలో చెల్లించేలా నిర్ణయాలు తీసుకున్నారు. డీఏ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో... 21 నెలల డీఏ బకాయిల కోసం రిటైర్మెంట్ దాకా వేచి చూడాల్సిన పరిస్థితి ఏమిటంటూ ఉద్యోగుల్లో తీవ్ర చర్చ మొదలైంది. ఈ విషయాన్ని ఉద్యోగ సంఘాల నేతలు అప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంగళవారం తీవ్రస్థాయిలో కసరత్తు జరిగింది. ఉద్యోగుల డిమాండ్‌ను అర్థం చేసుకున్న ప్రభుత్వం... దీనిపై మంగళరం రాత్రి సవరణ జీవో జారీ చేసింది. దీని ప్రకారం... 2024 జనవరి డీఏకు సంబంధించిన బకాయిలు అంటే 21 నెలల బకాయిలను నాలుగు విడతల్లో ఉద్యోగులకు అందజేస్తారు. బకాయిల్లో 10 శాతాన్ని 2026 ఏప్రిల్‌లో చెల్లిస్తారు. ఓపీఎస్ ఉద్యోగులకు వారి జీపీఎఫ్ ఖాతాల్లోకి... సీపీఎస్, పీటీడీ ఉద్యోగులకు ప్రభుత్వ వాటాతో కలిపి వారి ప్రాన్ ఖాతాల్లోకి జమ చేస్తారు. మిగిలిన 90 శాతం బకాయిలను 3 సమాన భాగాల్లో 2026 ఆగస్టు, 2026 నవంబరు, 2027 ఫిబ్రవరి నెలల్లో అందిస్తామని జీవోల్లో స్పష్టం చేశారు. ఈ మొత్తాలను ఓపీఎస్ ఉద్యోగులకు వారి జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేస్తామని... సీపీఎస్, పీటీడీ ఉద్యోగులకు నగదు రూపంలో అందజేస్తామని జీవోలో వెల్లడించారు.

సీఎం ఓ వైపు.. ఆర్థిక శాఖ మరోవైపు

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తుంటే, మరోవైపు ఆర్థిక శాఖ నిర్ణయాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవని, అందువల్ల డీఏ బకాయిలు రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని ఆర్థిక శాఖ తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రికి ఆపాదిస్తూ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేశారు. ఉద్యోగులకు ప్రభుత్వానికి దూరం పెంచేలా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరిగాయి. ఇది తన దృష్టికి రాగానే ముఖ్యమంత్రి స్పందించారు. మంగళవారం ఆర్థిక శాఖ అధికారులను పిలిచి మందలించారు. ఇకపై ఇలాంటి తప్పులు దొర్లకూడదని, సాధారణంగా డీఏ బకాయిలు ఎలా చెల్లిస్తారో అలాగే ఇప్పుడూ చెల్లించేలా జీవోను సవరించాలని ఆదేశించారు. ఆ మేరకు ఆర్థిక శాఖ మంగళవారం రాత్రి జీవో 62 విడుదల చేసింది.

పదోన్నతులపై ధన్యవాదాలు

» సీఎంను కలిసిన ఆర్టీసీ కార్మిక పరిషత్

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు డీఏ సహా ఆర్టీసీలో పదోన్నతులు కల్పించడంపై ఆర్టీసీ కార్మిక పరిషత్ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపింది. మంగళవారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు మాట్లాడారు. 'ఆరేళ్లుగా పదోన్నతులు రాక ఇబ్బందులుపడుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు పదోన్నతులు ఇచ్చారు. సీఎం ఆమోదంతో 3 వేల మందికి పదోన్నతులు వస్తున్నాయి. ఆర్టీసీలో మరిన్ని సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతిపత్రం ఇచ్చాం. స్త్రీశక్తి పథకం అమలు దృష్ట్యా ఆర్టీసీలో అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరాం. విశ్రాంత ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ అందడం లేదని, విధి విధానాలు విడుదలు చేయాలని విజ్ఞప్తి చేశాం. అమరావతి బ్రాండ్ బస్సులు 100 కొనుగోలు చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే భక్తులకు తిరుమలలో శ్రీవారి దర్శనం పునరుద్ధరించాలని, రోజుకు 5 వేల మంది భక్తులకు ఆర్టీసీ ద్వారా శ్రీవారి దర్శనం కల్పించాలని సీఎంకు విన్నవించాం. ఆయన మా వినతులపై సానుకూలంగా స్పందించారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు' అని పరిషత్ నేతలు చెప్పారు.

ఉద్యోగ సంఘాల హర్షం

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గత ఆరేళ్లలో మొట్టమొదటిసారిగా ఉద్యోగ సంఘాలందరినీ పిలిపించిన ప్రభుత్వం పలు సమస్యలు పరిష్కరించింది. తాజాగా డీఏ విడుదల జీవోలో ఏర్పడిన ఇబ్బందులనూ తొలగిస్తూ రివైజ్డ్ డీఏ జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు, సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటే షెడ్యూల్‌లో మూడు విడతలుగా డీఏ బకాయిలు విడుదల చేయడం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు స్వాంతన కలిగించిందన్నారు. జీవోలో ఉన్న ఇబ్బందులను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగానే స్పందించిన సీఎం చంద్రబాబు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సీఎంవో అధికారులకు, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పీఆర్సీ తదితర అంశాల్లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ప్రతి విషయంలోనూ ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాజీలేని ధోరణిని అవలంబిస్తుందని పేర్కొన్నారు. కాగా, ఏపీ సచివాలయ సంఘం మాజీ కార్యదర్శి రామకృష్ణ హర్షం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన చేశారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఓ ప్రకటన చేస్తూ... 'డీఏ అరియర్స్ గందరగోళానికి చెక్‌పెట్టి, రివైజ్డ్ జీవో ను ఇప్పించిన సీఎంకి ధన్యవాదాలు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.